PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 254 | విజయవాడ, శుక్రవారం 19 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 19 April 2024 | Rs

నేడు తొలి విడత పోలింగ్

- 21 రాష్ట్రాల్లో 102 స్థానాలకు
- అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు కూడా

4

తొలిరోజు 236 నామినేషన్లు

అమరావతి బ్యూరో : తొలిరోజు 236 నామినేషన్లను స్వీకరించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళగిరి నుంచి, కేంద్ర మాజీ మంత్రి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా) విజయవాడ పశ్చిమ నుంచి నామినేషన్లు వేశారు. పుంగనూరుకు చెందిన బిసివై పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ మంగళగిరి అసెంబ్లీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నెల్లిమర్ల నుంచి వైసిపి తరపున బడ్డుకొండ అప్పలనాయుడు, భీమిలి నుంచి గంటా శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్రంలో 25 ఎంపి స్థానాలకు 39 మంది అభ్యర్థులు 43 నామినేషన్లు దాఖలు చేశారు. టిడిపి నుంచి నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు, చిత్తూరు నుంచి దగ్గుమళ్ల ప్రసాదరావు, కర్నూలు నుంచి బసిపాటి నాగరాజు, కడప నుంచి చడిపిరాళ్ల భూపేష్ సుబ్బిరామిరెడ్డి, వైసిపి నుంచి రాజంపేట ఎంపి పివి మిథున్‌రెడ్డి, హిందూపురం నుంచి జోలదరాసి శాంత నామినేషన్లు వేశారు.

సీమ గొంతెండుతోంది

- తీవ్రంగా తాగునీటి సమస్య
- ట్యాంకర్లతో నీటిని కొంటున్న జనం
- సిఎం, ప్రతిపక్షనేత సొంత నియోజకవర్గాల్లోనూ తప్పని తిప్పలు

రాయలసీమ గొంతెండుతోంది. సీమలోని అన్ని జిల్లాల్లోనూ తాగునీటి కొరత నెలకొంది. మండుతున్న ఎండలకు తోడు గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుండటంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సీమలోని 250 మండలాలకుగాను సగానికిపైగా మండలాల్లో ఇప్పటికే నీటి కొరత ఎర్పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాయైన కడపతోపాటు ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడి సొంత జిల్లా చిత్తూరులో కూడా తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడింది. సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండటం, సమస్యలను పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో అత్యంత కీలకమైన ఈ సమస్యను పట్టించుకునే వారే లేకుండాపోయారు.

(వివరాలు లోపల పేజీలో)

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం పుప్పాలదొడ్డిలో నీటి ట్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్న గ్రామస్థులు







సిఎంపై రాయి విసిరిన అనుమానితుడి అరెస్టు

- ఇద్దరు నిందితుల గుర్తింపు
- 12 మందిని విచారించిన పోలీసులు

కోర్టులో నిందితుడిని హాజరు పరిచిన పోలీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడి చేసిన కేసులో అనుమానితుడు వేముల సతీష్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా, 14 రోజుల రిమాండ్ విధించడంతో నెల్లూరు సబ్‌జైలుకు తరలించారు. రెండో అనుమానితుడు వేముల దుర్గారావును కోర్టులో హాజరు పరచాల్సి ఉంది. ఉద్దేశపూర్వకంగా పదునైన రాయితో సిఎంను కొట్టి, హత్యాయత్నం చేశారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఆ నివేదికలో ఉన్న వివరాల ప్రకారం.... రెండో నిందితుడైన వేముల దుర్గారావు కుట్రపూరితంగా ప్రేరేపించడంతో సతీష్ రాయితో సిఎంను కొట్టాడు. సెల్‌ఫోన్ డేటా, సిసి టివి ఫుటేజీ ఆధారంగా నిందితుడిని సంఘటన జరిగిన ప్రాంతంలో పోలీసులు గుర్తించారు. ఈ నెల 17న రాజరాజేశ్వరిపేటలో సతీష్‌ను అరెస్టు చేసి, అతని నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రాజకీయ కుట్రతోనే సతీష్ సిఎంపై హత్యాయత్నం చేశాడు. పదునైన రాళ్లను ప్యాంటు జేబులో పెట్టుకుని రెండు గంటలకుపైగా ఆ ప్రాంతంలో ఎదురుచూశాడు. సిఎం రాగానే ఆయనపై రాయి విసిరాడు. ఈ కేసులో 12 మంది సాక్షులను విచారించి, వారందరి వాంగ్మూలాన్ని పోలీసులు రికార్డు చేశారు. ప్రత్యక్ష సాక్షులూ ఉన్నారని, వారిచ్చిన సమాచారం, సాంకేతిక సమాచారం మొత్తం సరిపోయిందని కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పోలీసులు వివరించారు.

సతీష్‌కు నేరచరిత్ర లేదు : న్యాయవాది సలీం

నిందితుడు సతీష్ మైనర్ అని, అతనికి నేర చరిత్ర లేదని, పోలీసులు సూచించిన పుట్టిన తేదీకి, ఆధార్ ఆధారంగా ఇచ్చిన తేదీకి తేడా ఉందనీ సతీష్ తరపున న్యాయవాది సలీం కోర్టుకు తెలిపారు. ఈ కేసులో 307 సెక్షన్ వర్తించదని పేర్కొన్నారు. దురుద్దేశంతోనే రాయి విసిరాడని, అతనికి 307 సెక్షన్ వర్తిస్తుందని పోలీసుల తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి మున్సిపల్ అధికారులు ఇచ్చిన ధ్రువపత్రాన్ని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

వడ్డెర కాలనీ ఖాళీ

నిందితులు వేముల సతీష్‌కుమార్ అరెస్టు, సాక్షుల పేరుతో యువకులను పోలీసులు తీసుకెళుతుండటంతో వడ్డెర కాలనీ ప్రజలు చెల్లాచెదురయ్యారు. వడ్డెర కాలనీలో ఉన్న నాలుగైదు రోడ్లలో ప్రజలందరూ ఊరు వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. పోలీసులు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నామని, అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా విచారణ పేరుతో వచ్చి పిల్లలను పట్టుకెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి నేత వేముల దుర్గారావు కూడా నిందితుడని పేర్కొనడంతో ప్రజలందరూ ఇళ్లు వదిలి వెళ్లిపోయారు.

ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా ఉండాలి

- ఎటువంటి అనుమానాలకు తావివ్వొద్దు
- ఇసికి స్పష్టం చేసిన సుప్రీం
- వివిప్యాట్ స్లిప్పుల వెరిఫికేషన్‌పై తీర్పు రిజర్వ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా సాగాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అనుమానాలకు తావివ్వొద్దని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లో పోలైన ఓట్లను 100 శాతం వివిప్యాట్ పేపర్ స్లిప్స్‌తో క్రాస్ వెరిఫికేషన్ చేయాలని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) దాఖలు చేసిన పిటిషన్‌పై వాద ప్రతివాదనలు పూర్తవడంతో న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ధర్మాసనం తీర్పు రిజర్వ్‌లో ఉంచింది. ఎడిఆర్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఇటీవల కేరళలో జరిగిన మాక్ పోల్‌ను ధర్మాసనం దృష్టికి తెచ్చారు. "కాసరగడ్‌లో మాక్ ఓటింగ్ జరిగింది. అక్కడ నాలుగు ఇవిఎంలను వివిప్యాట్లతో సరిపోలిస్తే బిజెపికి అదనంగా ఓట్లు వచ్చాయి" అని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని పరిశీలిం చా లని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీనిపై ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్ స్పందిస్తూ కేరళలోని కాసరగడ్‌లో మాక్ పోలింగ్‌లో బిజెపికి ఎక్కువ ఓట్లు పోలైనట్లు వచ్చిన నివేదికలు తప్పు అని, జిల్లా కలెక్టర్ నుంచి ఆ వార్తలపై వివరణ తీసుకున్నామని, అవన్నీ తప్పుడు వార్తలని పేర్కొన్నారు. దీనిపై పూర్తి రిపోర్టును కోర్టులో సమర్పించనున్నట్లు సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ నితీశ్ కుమార్ తెలిపారు. ఈవిఎంలను ట్యాంపర్ చేయడం అసాధ్యమని అన్నారు. నాలుగు కోట్ల వివిప్యాట్ స్లిప్పులు లెక్కించామని, ఎక్కడా మ్యాచ్ కాకపోవడమనేది లేదని అన్నారు. ఇవిఎంలను ఏ దశలోనూ కూడా ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని ధర్మాసనానికి ఇసి స్పష్టం చేసింది. పోలింగ్ ముగిశాక అధికారులు 'క్లోజ్' బటన్‌ను నొక్కాలని, దీని తరువాత నుంచి ఇవిఎంలు ఎలాంటి ఓట్లను అనుమతించవని తెలిపింది. ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయాలను మెషిన్‌లో నమోదు చేస్తారని గుర్తు చేసింది. పోలైన ఓట్లను వివిప్యాట్ స్లిప్పులతో వేరిఫికేషన్ చేయడం ఇప్పటి వరకు 41,629 సార్లు జరిగిందని, అన్ని సార్లు కూడా స్లిప్‌లు, ఓట్లు సరిపోయాయని తెలిపింది. ఒక పోలింగ్ స్టేషన్‌లోని వివిప్యాట్‌లను లెక్కించేందుకు కనీసం గంట సమయం పడుతుందని చెప్పింది.

నిప్పుల కొలిమిలా రాష్ట్రం

- 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ప్రచారంలో తీవ్ర అస్వస్థతకు గురైన వంగా గీత

నెస్లే బేబీ ఆహార ఉత్పత్తుల్లో అధికంగా చక్కెర

- ఇయుతో పోలిస్తే భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లోనే ఎక్కువ
- ద్వంద్వ ప్రమాణాలను ఎత్తిచూపిన స్విస్ ఎన్‌జిఒ నివేదిక వెల్లడి

లోపలి పేజీల్లో..

సిఎస్, డిజిపిలపై వచ్చిన ఫిర్యాదులను ఇసికి నివేదించాం

- సిఎంపై దాడి ఘటనపై నివేదికలు తెప్పిస్తున్నాం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్
- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని సీనియర్ అధికారులైన సిఎస్, డిజిపిలతోపాటు ఇతరులపై రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. అక్కడ్నుంచి ఆదేశాలు రావాల్సి వుందన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన రాయి దాడి ఘటనలో నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ అంశంపై రోజువారీ నివేదికను తెప్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపైనా పోలీసు ప్రత్యేక పరిశీలకులు త్వరలోనే ఇసికి నివేదిక ఇస్తారని, ఆ తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు. అలాగే విఐపిలు ప్రచార కార్యక్రమాలకు వెళ్లిన ప్పుడు భద్రతా చర్యలకు ఎలాంటి అవాంతరాలు కలగ కుండా పర్యవేక్షిం చేందుకు ప్రత్యేక భద్రతా దళాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

రాష్ట్రంలోని 25 పార్లమెంటు స్థానాలకు, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు గురువారం ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్ విడుదల కాగానే రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ మొదలైందని, ఈ నెల 25 వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని సిఇఒ తెలిపారు. 26న నామినేషన్ల స్క్రూటినీ వుంటుందని, అనంతరం పోటీలో వున్నవారితో తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మిగతా 7లో

వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ విభాగంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న వెంకట్రామిరెడ్డి వైసిపికి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు ఆర్‌టిసి డిపోల్లో ఉద్యోగుల సంఘ నాయకుడు చంద్రయ్యతో కలిసి ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి వైసిపిని గెలిపించాలని ప్రచారం చేశారు. వీటిపై ఎన్నికల కమిషన్‌కు టిడిపి ఫిర్యాదు చేసింది. కడప జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా వెంకట్రామిరెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు నిర్ధారించి సస్పెండ్ చేసింది. వెంకట్రామిరెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని టిడిపి ఫిర్యాదు చేసింది. అనేక పత్రికల్లో వచ్చిన ఫొటోలు, వార్తలనూ పరిశీలించినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. సస్పెన్షన్ కాలంలో హెడ్ క్వార్టర్‌ను విడిచి వెళ్లొద్దని ఉత్తర్వుల్లో పేర్కొంది.

బలమైన వామపక్షం అవశ్యం

ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం బిజెపి అనుసరిస్తున్న మతతత్వం, సమాజంలో చీలికలు తీసుకొచ్చే విద్వేష రాజకీయాలను సమర్థవంతంగా తిప్పికొట్టేది వామపక్షాలేనని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ అన్నారు. పార్లమెంటులో వామపక్షాల బలం పెరగాల్సిన ఆవశ్యకత గురించి ఆయన నొక్కి చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), అధిక ధరలు, నిరుద్యోగం సహా ప్రజలను పీడిస్తున్న సమస్యలపై నికరంగా పోరాడుతున్న పార్టీ సిపిఎం, ఇతర వామపక్షాలేనని చెప్పారు. కేరళలోని దేశాభిమాని పత్రికకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కరత్ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆ విశేషాలు..

'దేశాభిమాని' ఇంటర్వ్యూలో ప్రకాశ్ కరత్

ఈసారి 400 దాటుతుందని మోడీ చెబుతున్నారు. దీనిపై వ్యాఖ్యానిస్తారా?

400కు పైగా సీట్లు గెలవడం అనేది కేవలం బిజెపి కార్యకర్తలకు నైతిక స్థైర్యాన్ని ఇవ్వడానికి చేస్తున్న ప్రచారం మాత్రమే. సమాజంలో మత పరమైన చీలికలు తేవడం ద్వారా లబ్ధి పొందాలనేది బిజెపి ఎత్తుగడ. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రజలు అడుగుతున్నారు. ఇటీవలి అధ్యయనాలు, సర్వేలన్నీ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బిజెపి మేనిఫెస్టోలో దీనికి పరిష్కారం చూపే ప్రతిపాదనేదీ లేదు. దాని దృష్టి అంతా మతతత్వం, విభజన రాజకీయాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపైనే ఉంది. గత సారి పుల్వామా దాడిని ఉపయోగించుకుని ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి అది లాభపడింది. ఈసారి అలాంటి పరిస్థితి లేదు..పలు ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు సాగించిన పోరాటాలు ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించనున్నాయి.

ప్రతిపక్షాలన్నీ అవినీతిమయమైనట్లు ముద్రవేసే యత్నం మోడీ చేస్తున్నారు. దీనిని మీరు ఏవిధంగా ఎదుర్కొంటారు?

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బిజెపి పాల్పడిన భారీ అవినీతిని ప్రజల ముందు బట్టబయలు చేసేందుకు వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. గత ఆరేళ్లలో బాండ్ల ద్వారా బిజెపికి రూ.8, 252 కోటు ముట్టాయి..ఇందులో రెండు రకాల అవినీతి ఉంది.అనుచిత లబ్ధి పొందడం కోసం కోట్ల రూపాయలు ముడుపులు ముట్టజెప్పడం ఒక రకమైన అవినీతి. ఇడిని, ఆదాయపు పన్ను శాఖను పంపి బాండ్లను కొనుగోలు చేయమని కంపెనీలను బెదిరించడం రెండో రకం అవినీతి.. ఇదంతా అధికార పార్టీ ఒక్కటే చేయలేదు, ప్రభుత్వంతో కలసి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అవినీతిని అది సంస్థాగతీకరించింది. ఈ అవినీతి బయటకొచ్చిన తర్వాత కూడా మోడీ రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతిలో కూరకుపోయాయని నిందించడం చాలా హాస్యాస్పదంగా ఉంది.

బిజెపి మేనిఫెస్టోలో ఉన్న సిఎఎపై కాంగ్రెస్ మౌనం వహించడంపై మీ కామెంట్...?

కాంగ్రెస్ మేనిఫెస్టోలో పౌరసత్వ సవరణ చట్టం ఊసే ఎత్తకపోవడం ఆశ్చర్యం కలిగించింది. పౌరసత్వ సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు, దానిపై విమర్శలు వచ్చాయి, అయినా, కాంగ్రెస్ కచ్చితమైన వైఖరిని తీసుకోలేకపోయింది. కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు ఇదో ఉదాహరణ. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన హిందువులకు పౌరసత్వం వస్తుందని బిజెపి అదేపనిగా ఊదరగొడుతోంది. సిఎఎ నుంచి వైదొలిగేలా కాంగ్రెస్‌ని ఇదే ప్రేరేపించినట్టుగా ఉంది.

కేరళలో సిఎఎ అమలు చేయరాదన్న వైఖరిని కాంగ్రెస్ తిరస్కరిస్తోంది కదా..!

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేదని బిజెపి కూడా వాదిస్తోంది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవచ్చు.

వామపక్షాల నుంచి ఎక్కువ మంది పార్లమెంటులోకి ఎందుకు రావాలి?

బిజెపిని ఓడించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మేము ప్రయత్నిస్తున్నాం. పార్లమెంటులో బలమైన వామపక్ష ఉనికి లేకుండా, ఆ ప్రభుత్వం బలమైన లౌకిక వైఖరిని తీసుకోదు, ప్రజానుకూల విధానాలను రూపొందించదు, సమాఖ్య సూత్రాలకు కట్టుబడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడదు. కేరళ లాంటి రాష్ట్రానికి ఇది చాలా ముఖ్యం. కేంద్రం అనుసరిస్తున్న వివక్షాపూరిత చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఏకైక రాష్ట్రం కేరళ. రాష్ట్రాల హక్కుల కోసం కాంగ్రెస్ నిలబడలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ని ఉపయోగించి కాంగ్రెసేతర ప్రభుత్వాలను రద్దు చేసిన చరిత్ర దానికి ఉంది. ప్రజావ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు పార్లమెంట్‌లో ఒక బలమైన శక్తి ఉండాలి. వామపక్షాలు సమాఖ్య సూత్రాలకు కట్టుబడి లౌకికవాదాన్ని కాపాడేందుకు గట్టిగా నిలబడతాయి. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను కొనసాగించడంలో కాంగ్రెస్‌కు సరైన ట్రాక్ రికార్డ్ లేదు. ఇంతకుముందు అధికారంలో ఉన్న ఫ్రంట్ ప్రభుత్వాలు మాత్రమే అలా చెప్పుకోగలవు. బలమైన వామపక్షాలు మాత్రమే భారతదేశ ప్రజాస్వామ్య, లౌకిక , సమాఖ్య సూత్రాలను పరిరక్షించగలవు.

దేశంలో వామపక్ష ఉద్యమం గురించి...

ప్రధాన పోటీ బెంగాల్, కేరళ , త్రిపురల్లో ఉంది. వీటితో బాటు ఇతర రాష్ట్రాల్లో కొద్ది స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తున్నాం. ప్రతిపక్షాల ఓట్లు చెదరకుండా ఉండేందుకు ఇది ముందస్తు జాగ్రత్త. చిన్న విభజన అయినా బిజెపికి ఉపయోగపడుతుంది. అందుకే కొన్ని రాష్ట్రాల్లో పోటీ చేయడం లేదు.

బీహార్, రాజస్థాన్‌లలో గెలిచే అవకాశమున్న స్థానాల్లోనే పోటీ చేస్తున్నాం.. త్రిపురలో బిజెపి దాడులను తిప్పికొట్టడానికి ఈ పోటీ ఉపయోగపడుతుంది.

రాహుల్ గాంధీ మళ్లీ వాయనాడ్‌లో పోటీ చేయడం గురించి...

ఇది కాంగ్రెస్ రాజకీయ బలహీనతను తెలియజేస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి తమ నాయకుడు గెలుస్తాడనే విశ్వాసం ఆ పార్టీకి కొరవడింది. యుపిలో ఆయన గెలవలేరని అర్థమవుతోంది. బిజెపి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న రాష్ట్రాల్లో , తాను బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో రాహుల్‌ను పోటీకి నిలబెట్టలేకపోవడం కాంగ్రెస్ తాలూకు బలహీనత. ముస్లిం లీగ్‌తో పొత్తును బహిరంగంగా ప్రకటించడానికి కాంగ్రెస్‌కు ధైర్యం చాలడం లేదు. అలా చెప్పలేక 'మీది మాది' ఒకటే ఎజెండా అని అనడం అవకాశవాదమే అనిపించుకుంటుంది. పార్లమెంటులో యుడిఎఫ్ ఎంపీల పనితీరు గురించి ఇక వేరే చెప్పనక్కర్లేదు. కేరళ ప్రయోజనాలను కాపాడడంలో యుడిఎఫ్ పూర్తిగా విఫలమైంది. కేరళలో ఎల్‌డిఎఫ్ ఎందుకు మెజారిటీ సాధించాలనే ప్రశ్నకు కూడా ఇదే సమాధానం. కేరళ ప్రయోజనాలు కాపాడబడాలంటే ఎల్‌డిఎఫ్‌కు మెజార్టీ పార్లమెంటు సీట్లు రావాలి. ఈసారి కేరళలో ఫలితాలు 2019 ఫలితాలకు భిన్నంగా ఉండబోతున్నాయి.

చీఫ్ జస్టిస్‌ను కలిసిన బార్ కౌన్సిల్ చైర్మన్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎస్ కృష్ణమోహన్ గురువారం హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సిజెను శాలువాతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన వారిద్దరినీ సిజె అభినందించారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని వారిద్దరూ సిజెను కోరారు.

వైసిపి ఎల్ఇడి ప్రచార రథాలు ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు నేరుగా వివరించేందుకు రూపొందించిన ఎల్ఇడి ప్రచార రథాలను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం ముందు జెండా ఊపి ప్రచార రథాలను గురువారం ప్రారంభించారు. పెద్ద ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటుచేసిన ఈ వాహనాలు అన్ని నియోజకవర్గాల్లోని ముఖ్యమైన కూడళ్లలో ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రీవెన్స్‌సెల్ కమిటీ కార్యదర్శి నారాయణ మూర్తి, నాయకులు సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సిఎం జగన్‌పై జరిగిన రాయి దాడిలో బొండా ఉమా పాత్ర కనిపిస్తోందని విమర్శించారు.

పాలకుల వైఫల్యాలను వివరిస్తూ
సిపిఎం ప్రచారం

విజయాన్ని కాంక్షిస్తూ ముందడుగు

ప్రజాశక్తి-యంత్రాంగం

సిపిఎం అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. డప్పుల దరువులు... మంగళ హారతులు... కుంకుమ తిలకాలు దిద్ది ఎక్కడికక్కడ ప్రజలు స్వాగతం పలికారు. సిపిఎం అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓటర్లను పలకరిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతున్నారు. సిపిఎం ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ.. బిజెపి, వైసిపి, టిడిపి పాలకుల వైఫల్యాలను వివరిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇస్తున్నారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్‌లో సిపిఎం మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కూడళ్లలో జరిగిన సమావేశాల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించబోమని రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంతో ప్రకటన చేయించగలవా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మోడీ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి రానున్న ఎన్నికల్లో బిజెపి దాని మిత్రులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, నాయకులు పి.మురళీకృష్ణ, జయరామ్, కె.గడ్డన్న, ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. కర్నూలు జిల్లా కల్లూరులో సిపిఎం పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గౌస్ దేశాయ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ.. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని, దానికి తొత్తులుగా మారిన వైసిపి, టిడిపిలను ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే కల్లూరును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లా గడివేముల మండలంలోని సోమాపురం, ఆళ్లగడ్డలో పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అల్లూరి జిల్లా అడ్డతీగల మండల కేంద్రంలో సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గం పరిధిలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించాలని కోరుతూ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ కమ్యూనిస్టులను చట్టసభలకు పంపిస్తే ప్రజా సమస్యలపై గళమెత్తుతారని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి మండంగి రమణకు మద్దతుగా గరుగుబిల్లి మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి కొత్తపల్లి గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాచిపెంట మండలం మెట్టవలస, కుడుమూరు, కొత్తవలస తదితర గ్రామాల్లో అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్సకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ నియోజకవర్గం పరిధిలోని 16వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నిరంతరం పేదలు, కార్మికులు, రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని నాయకులు కోరారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని దావాజీ గూడెం, అజ్జంపూడి, విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామాల్లో సిపిఎం గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుసుకొని ఓట్లు అభ్యర్థించారు.



గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జొన్నా శివశంకరరావు తదితరులు

'బిజెపికి ఓటు - ఆదివాసీలకు చేటు' బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాసరావు తదితరులు

సిపిఎంతోనే గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ

- ఆదివాసీలకు నష్టం చేస్తున్న వారిని ఓడించండి
- అరకు ఎంపిగా అప్పలనర్సను గెలిపించండి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి గెలుపుతోనే గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్స, అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, అనంతగిరి జడ్‌పిటిసి దీసరి గంగరాజు, సిహెచ్.చిన్నయ్య పడాల్‌లతో కలిసి ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం నుంచి అరకు పార్లమెంట్ స్థానంలో పాచిపెంట అప్పలనర్స, కురుపాం, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో మండంగి రమణ, లోతా రామారావు ఏజెన్సీ నుంచి పోటీ చేస్తున్నారని తెలిపారు. వారిని ప్రజలు గెలిపించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలు ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్నాయని, బిజెపి, వైసిపి, టిడిపిలతో ప్రజలకు నష్టమే తప్ప లాభం లేదన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపికి పోటీ చేసే అర్హత లేదని తెలిపారు. ఆదివాసీలకు ఉన్న హక్కులను, చట్టాలను రద్దు చేస్తూ గిరిజన ఉనికిని దెబ్బకొడుతున్న వారిని ఎన్నికల్లో ఓడించాలని కోరారు. అటవీ సంరక్షణ చట్టాన్ని యుపిఎ ప్రభుత్వం వామపక్షాల మద్దతుతో తీసుకొచ్చిందని, ఆ చట్టం రావడంతో గిరిజనులు పోడు భూములకు పట్టాలు సాధించుకున్నారని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టాన్ని రద్దు చేస్తూ టైగర్‌జోన్, వన్యప్రాణ సంరక్షణ, అభివృద్ధి పేరుతో వేలాది ఎకరాలను అదానీకి కట్టబెడుతున్నారని విమర్శించారు. అరకు పార్లమెంట్ పరిధిలో పంప్డ స్టోరేజ్ హైడల్ ప్రాజెక్టు పేరుతో అదానీకి సుమారు 1200 ఎకరాలను కట్టబెట్టడానికి ఒప్పందాలు చేసుకుంటున్నారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఏ గ్రామంలోనూ గ్రామసభ నిర్వహించకుండా, పీసా, 1/70 చట్టాలను తుంగలో తొక్కి కార్పొరేట్లకు వేలాది ఎకరాలు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో అటవీ ప్రాంతాన్ని ఖాళీ చేయించి అదానీకి కట్టబెట్టడానికి ప్రభుత్వం చూస్తోందన్నారు. పోలవరం ప్రాంతంలో ఆయుధ కర్మాగారం పెట్టడానికి అదానీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గిరిజన సబ్ ప్లాన్‌ను బిజెపి ఎత్తేసిన తరువాత నిధులు రాక ఏజెన్సీలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలుచోట్ల డోలీమోతలే శరణ్యమవుతున్నాయని, వైద్య సదుపాయాలు మృగ్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిలో విఫలమైన బిజెపి, వైసిపిలకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత కేసుల మాఫీ కోసం పార్టీలు మారుతూ చివరకు బిజెపిలో చేరారని విమర్శించారు. అలాంటి ఆమెను ఎంపి అభ్యర్థిగా బిజెపి ప్రకటించిందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే పరిపాలన చేసేది ఢిల్లీ నుంచి మోడీయేనని అన్నారు. చంద్రబాబు, జగన్‌లు కేసుల భయంతో మోడీ చేతుల్లో కీలు బొమ్మలుగా మారారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బిజెపి, దానికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, వైసిపిని ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్ట సభలకు పంపించాలని కోరారు. అనంతరం పార్టీ ముద్రించిన 'బిజెపికి ఓటు - ఆదివాసీలకు చేటు' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

సీమ గొంతెండుతోంది

తీవ్రంగా తాగునీటి సమస్య

ప్రజాశక్తి- యంత్రాంగం

సిఎం, ప్రతిపక్షనేత సొంత నియోజకవర్గాలైన పులివెందుల, కుప్పంలో కూడా తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. ఈ నెల మొదట్లోనే ఈ రెండు మున్సిపాల్టీల్లోనూ రోజువిడిచి రోజు నీటి సరఫరా అవుతున్నట్లు వార్తలు వచ్చాయి. కడప నగరపాలక సంస్థతోపాటు పలమనేరు, పెనుకొండ, హిందూపూర్, గుత్తి మున్సిపాల్టీల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. గుత్తిలో కొళాయిల ద్వారా నెలకోసారి తాగునీటిని సరఫరాచేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా మూడు నాలుగు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అవి ఏమాత్రం చాలడం లేదు. దీంతో ప్రజలు ట్యాంకర్‌కు 600 రూపాయలు చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. కడప నగర పాలక సంస్థతోపాటు మరికొన్ని మున్సిపాల్టీల్లోనూ ఇదే దుస్థితి ఏర్పడింది.

జిల్లాల వారీగా ఇలా...!

- సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాయైన వైఎస్ఆర్ కడప జిల్లాలో 36 మండలాలు ఉండగా, 29 మండలాలను తాగునీటి సమస్య వేధిస్తోంది. వీటిలో 12 మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. కడప నగరంతోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు తాగునీటిని కొనుక్కునే పరిస్థితి ఏర్పడింది. పులివెందుల మున్సిపాల్టీలోనూ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. 264 హేబిటేషన్లలో ట్యాంకర్లతో తాగునీటి సరఫరాకు రూ.6.39 కోట్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి, రోజులు గడుస్తున్నా ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు.
- కర్నూలు జిల్లాలో 26 మండలాలు ఉండగా వాటిలో 12 మండలాల్లో తాగునీటి కొరత నెలకొంది. 11 మండలాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని 4,253 బోర్లలో 212 పూర్తిగా పనిచేయడం లేదు. మిగిలిన వాటిలోనూ అరకొరగా నీరు వస్తోంది. 796 పిడబ్ల్యు పథకాల్లో 692 మాత్రమే పని చేస్తున్నాయి.. ఆస్పరి మండలంలో సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి ట్యాంకుల వద్ద బళ్లపై బిందెలతో పడిగాపులు కాయాల్సి వస్తోంది.
- నంద్యాల జిల్లాలో 29 మండలాలు ఉండగా, పది మండలాల్లో తాగునీటి కొరత ఉంది. జిల్లాలోని ఐదు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీల్లో రెండు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 926 బోర్లు ఉండగా, వాటిలో 145 మరమ్మతులకు గురయ్యాయి. తొమ్మిది మండలాల్లో ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు. అయితే, అవి ఏ మూలకూ చాలడం లేదు.
- శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు గానూ 14 మండలాల్లో నీటి కొరత నెలకొంది. జిల్లాలో 14 బహుళార్థక రక్షిత మంచినీటి పథకలు, 4,880 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. రక్షిత మంచినీటి పథకాల్లో అత్యధికంగా బోరుబావులే. భూగర్భ జలాలు పడిపోవడంతో వీటిలో అధికభాగం నిరుపయోగంగా మారాయి. గోరంట్ల, అగళి, మడకశిర, గుడిబండ, రొళ్ల, తనకల్లు మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. సుమారు 180 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా, ప్రజల అవసరాలకు చాలడం లేదు.
- అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాల్టీలో కొళాయిల ద్వారా నీటిసరఫరా దాదాపుగా నిలిచిపోయింది. ఇక్కడ నెలకు ఒక్క రోజు మాత్రమే కొళాయిల ద్వారా నీటిని వదులుతున్నారు. మూడు, నాలుగురోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అవి ప్రజల అవసరాలకు ఏ మాత్రం చాలడం లేదు. దీంతో అత్యధిక కుటుంబాలు 600 రూపాయలకు ట్యాంకరు నీటిని కొనుగోలు చేస్తున్నాయి. రాయదుర్గం మున్సిపాలిటీలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరు అడుగంటడంతో ఐదు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ జిల్లాలోని 31 మండలాలకు గానూ 11 మండలాల్లో తాగునీటికి కొరత ఏర్పడింది. పలు గ్రామీణ ప్రాంతాల్లోనూ సమస్య తీవ్రంగా ఉంది.
- అన్నమయ్య జిల్లాలో మొత్తం 10,627 (స్కీం, చేతి పంపు బోర్లు కలిపి) బోర్లు ఉన్నాయి. వాటిలో 112 బోర్లు మరమ్మతుకు గురికావడంతో వాటిని బాగు చేశారు. తొమ్మిది మండలాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు.

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గాంధీ నగర్ చెంచు గూడెంలో నీటి ట్యాంకర్ కోసం వేచి చూస్తున్న మహిళలు

మున్సిపాల్టీల్లో ఇలా...

ముఖ్యమంత్రి సొంత జిల్లా యైన కడప కార్పొరేషన్‌లోని కొన్ని ప్రాంతాలకు మూడు రోజులకు ఒకసారి, మరికొన్ని ప్రాంతాలకు ఐదు రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో, కడప నగర ప్రజలు రూ.600కు ట్యాంకర్ నీటిని కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకుంటున్నారు. బద్వేల్, మైదుకూరు మున్సిపాలిటీల్లో కూడా రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్లో రెండు లేదా మూడు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో, ప్రజలు క్యాన్ నీటిని రూ.25కు కొంటున్నారు.

పెద్ద సంఖ్యలో తిరుపతికి వచ్చే యాత్రికులకు ఉచిత నీటి వసతి కరువైంది. శ్రీకాళహస్తి, వెంకటగిరి గూడూరు, సూళ్లూరుపేట, పుత్తూరు మున్సిపాల్టీల్లోనూ నీటి కొరత ఏర్పడింది. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపాల్టీలో నాలుగు రోజులకు ఒకసారి, కర్నూలు, ఎమ్మిగనూరు, గూడూరులో రెండు రోజులకోసారి తాగునీటిని అందిస్తున్నారు. బేతంచర్ల, చిత్తూరు, ధర్మవరం, డోన్, గుంతకల్లు, కదిరి, కమలాపురం, కుప్పం, మదనపల్లి, నంద్యాల, పునగనూరు, రాయచోటి, రాయదుర్గ, తాడిపత్రి, ఎర్రగుంట్ల మున్సిపాల్టీల్లోనూ తాగునీటి కొరత ఏర్పడింది. ఈ మున్సిపాల్టీలో రోజువిడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు.

చిత్తూరు కార్పొరేషన్లో 496 బోర్లు ఉన్నాయి. వాటిలో 87 బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. రోజువిడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు.

కుప్పం ప్రజలకు హంద్రీ నీవా నీరు ప్రస్తుతం రావడం లేదు. కుప్పం పరిధిలో పాలూరు ప్రాజెక్టు ఉంది. మన రాష్ట్రానికి, తమిళనాడు రాష్ట్రానికి మధ్య వివాదం వల్ల ఆ నీరు మన రాష్ట్రానికి రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే 0.5 టిఎంసిల నీరు వచ్చే అవకాశం ఉంది.

జైలు నుంచి బయటకు వచ్చిన సిఐటియు నేతలు, మిమ్స్ కార్మికులకు స్వాగతం పలికిన సుబ్బరావమ్మ

మిమ్స్ ఉద్యోగుల పోరాటం స్ఫూర్తి దాయకం

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ
- జైల్ నుంచి విడుదలైన వారికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ మిమ్స్ యాజమాన్య నిరంకుశత్వాన్ని, పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొని జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలైన సిఐటియు నాయకులకు, మిమ్స్ ఉద్యోగులకు గురువారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. విజయగనరం సబ్‌జైలు బయట ప్రజాసంఘాల నాయకులు, మిమ్స్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున పోరాడారు. కక్ష కట్టిన యాజమాన్యం తప్పుడు కేసులు పెట్టి 23 మందిని అరెస్టు చేయించింది. వారిలో ఐదుగురిని విశాఖ సెంట్రల్ జైలుకు పంపగా, మిగతా 18 మంది విజయనగరం సబ్‌జైలులో ఉంచారు. వీరిలో నలుగురు ఈ నెల 13న విడుదల కాగా, మిగతా వారంతా గురువారం విడుదలయ్యారు. విడుదలైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, మిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, నాయకులు కామునాయుడు, బంగారు నాయుడు, డివి రమణ మూర్తి, నాగభూషణం, రామకృష్ణ, మధుసూదనరావు, గౌరీతో పాటు మొత్తంగా 19 మంది ఉన్నారు.

వీరికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పూలమాల వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాజమాన్యం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, ఉద్యోగం నుంచి తొలగించినా, చివరకు జైలుకు పంపినా పట్టువదలకుండా ఉద్యోగులంతా సిఐటియు ఆధ్వర్యాన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. మిమ్స్ ఉద్యోగుల పోరాట ఫలితంగా నేడు యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకొని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని కోరారు. 14 రోజులపాటు జైలులో ఉండి కార్మికుల కోసం పోరాడి విడుదలైన వారికి ఆమె అభినందనలు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, ఉపాధ్యక్షులు బి.సుధారాణి, ఎస్ అనసూయ, నాయకులు బి.పైడిరాజు, కె.త్రినాథ్, మిమ్స్ ఉద్యోగులు ఉన్నారు.

క్లీన్‌చిట్ పొందిన అధికారులపై దర్యాప్తు

- సిఇఒకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న 74 మంది అధికారులకు ప్రభుత్వం క్లీన్‌చిట్ ఇవ్వడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని టిడిపి కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య సచివాలయంలో కలిసి గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల విలేకరులతో మాట్లాడుతూ.. చరిత్రలో ఇంతమందికి క్షమాభిక్ష పెట్టిన దాఖలు లేవని పేర్కొన్నారు. సిఎం జగన్‌పై విజయవాడ పోలీస్ కమిషనరు స్వామిభక్తి చూపుతున్నారని విమర్శించారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసిపి నేతలు అంబటి రాంబాబు, అనిల్ కుమార్ యాదవ్ ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. వీరితోపాటు వీరికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అప్పుల ఊబిలో రైతులు : శ్రీనివాసరెడ్డి

జగన్ పాలనలో రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు అభ్యర్థిగా ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి వైసిపి టికెట్ ఇచ్చిందని టిడిపి నేత వరుణ్ విమర్శించారు.

తూర్పుగోదావరిలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

'పశ్చిమ', 'తూర్పు'లో ముగిసిన సిఎం బస్సుయాత్ర

- రోడ్‌షోలో పలువురితో మాట్లాడుతూ ముందుకు సాగిన జగన్
- పటిష్ట భద్రతా చర్యలు

ప్రజాశక్తి - తణుకు రూరల్, రాజమహేంద్రవరం ప్రతినిధి

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర గురువారం పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ముగిసింది. శుక్రవారం కాకినాడ జిల్లాల్లో యాత్ర కొనసాగనుంది. విజయవాడలో జరిగిన రాయిదాడి ఘటన నేపథ్యంలో నిర్వహించిన యాత్ర కావడంతో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాయి. మొబైల్ కమాండింగ్ వాహనాన్ని సైతం ఏర్పాటు చేశారు. రోడ్ షో పొడవునా ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

గురువారం ఉదయం వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలను పలుకరిస్తూ జగన్ యాత్ర కొనసాగించారు. తేతలిలో వృద్ధులతో మాట్లాడిన అనంతరం శర్మిష్ఠ సెంటర్ వద్దకు చేరుకోగానే మెదడు పక్షవాతంతో బాధపడుతున్న తణుకు పట్టణానికి చెందిన ఐదేళ్ల బర్ల దుర్గాఅచ్చుతం కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉమెన్స్ కళాశాల, పెరవలి, సిద్ధాంతం మీదుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి యాత్ర ప్రవేశించింది. తూర్పుగోదావరిలో రావులపాలెం, పొట్టిలంక, వేమగిరి, బొమ్మూరు జంక్షన్, మోరంపూడి జంక్షన్, గామన్ బ్రిడ్జి మీదుగా రాజానగరం మండలం ఎస్‌టి. రాజపురం వరకూ యాత్ర సాగింది. శుక్రవారం కాకినాడ జిల్లాలో యాత్ర కొనసాగనుంది.

వైసిపిలో చేరిన రాజోలు జనసేన ఇన్‌ఛార్జి

రాజోలు జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బొంతు రాజేశ్వరరావు జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. రాజోలు నుంచి జనసేన తరపున బొంతు రాజేశ్వరరావు టికెట్ ఆశించి భంగపడ్డారు. అప్పటి నుంచి ఆయన పార్టీపై అసంతృప్తితో ఉన్నారు.

'ఉక్కు'కు కోకింగ్ కోల్ కొరత సృష్టించిన
స్టీల్‌ప్లాంట్ సిఎండిని తొలగించాలి

21న కార్మిక గర్జన : సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్ కొరత సృష్టించిన స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్‌ను వెంటనే తొలగించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారం ఉత్పత్తి ప్రారంభించిన 33 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని మొదటి విభాగమైన కోక్‌ఓవెన్‌కు అవసరమైన కోకింగ్ కోల్ కొరతను యాజమాన్యం సృష్టించిందని, దీనికి బాధ్యులు స్టీల్ సిఎమ్‌డి అతుల్‌భట్ అని తెలిపారు. విశాఖలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు. కోక్‌ఓవెన్ నుంచి ఉత్పత్తయ్యే గ్యాస్ ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్ నడుస్తుందని చెప్పారు. కోక్ ఓవెన్‌కు ముడిసరుకు అయిన కోకింగ్ కోల్ 30 వేల టన్నులు విదేశాల నుంచి దిగుమతి అయి గంగవరం స్టాక్ యార్డ్‌లోనూ, ఆస్ట్రేలియా నుంచి రెండు షిప్‌ల్లో వచ్చిన 1.5 లక్షల టన్నుల కోకింగ్ కోల్ గంగవరం పోర్టులోనూ నిలిచిపోయిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు, గంగవరం పోర్టుకు మధ్య గోడ మాత్రమే అడ్డుగా ఉందన్నారు. గంగవరం పోర్టులోని కోకింగ్ కోల్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు రప్పించలేకపోయారని ప్రశ్నించారు. దీనికి స్టీల్ యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. సకాలానికి ముడిఖనిజం కూడా రప్పించడం చేతకాని అసమర్థ సిఎండిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గత ఆరు రోజుల్లో కోక్‌ఓవెన్ ఉత్పత్తి 320 పుస్సింగ్‌ల నుంచి నేటికి 140 పుస్సింగ్‌లకు పడిపోయిందన్నారు. మొత్తం స్టీల్‌ప్లాంట్‌లో ఐదు బ్యాటరీల్లో 1, 3 బ్యాటరీలు కోకింగ్ కోల్ లేనందువల్ల ఉత్పత్తి నిలిపివేశాయని తెలిపారు. దీని ప్రభావంతో ప్లాంట్ ఉత్పత్తి 80 శాతం పడిపోతుందన్నారు. కోక్‌ఓవెన్ విభాగం కోమాలోకి వెళ్తే మరమ్మతులకు కనీసం 60 రోజులకుపైగా సమయం పడుతుందని, ఈ కాలంలో ఉత్పత్తి పూర్తిగా పడిపోతుందని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా దెబ్బతీయడానికి కేంద్ర ప్రభుత్వం, అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కలిసి చేసిన కుట్రే ఇదని విమర్శించారు. అదానీ యాజమాన్యం గంగవరం పోర్టు కార్మికులకు కావాలనే సమస్యలు సృష్టిస్తోందన్నారు. నిర్వాసితులతో 2006లో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాల్సి ఉన్నా 15 సంవత్సరాలు దాటినా గంగవరం, దిబ్బపాలెం నిర్వాసితులను నేటికీ పర్మినెంట్ చేయలేదని వివరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు యాజమన్యాల తప్పుడు వైఖరికి నిరసనగా ఈ నెల 21న స్టీల్‌ప్లాంట్ వద్ద కార్మిక గర్జన జరుగుతుందన్నారు. దీనికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డిగా గిరిషా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డిగా గిరిషా పిఎస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎమ్‌డిగా ఉన్న కె వెంకటరమణ రెడ్డి సెలవులో ఉన్నారు. దీంతో ఆయన స్థానంలో గిరిషాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించి అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు బి చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీరు ప్రసాద్, సూపరింటెండెంటు ఇంజినీర్లు జయరామాచారి తదితరులు పాల్గొన్నారు.

బిజెపికి దెందులూరు

- టిడిపికి అనపర్తి!
- ఆలోచనలో కూటమి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి-జనసేన-టిడిపి కూటమిలో మరోసారి మార్పులు, చేర్పులు జరుగనున్నాయి. అనకాపల్లి, పి గన్నవరం, నియోజకవర్గాల్లో అభ్యర్ధులను ప్రకటించిన తరువాత మార్పులు జరిగాయి. ఇప్పుడు కూడా మరికొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్ధుల మార్పు ఉండే అవకాశం ఉంటుందని టిడిపి నేతలు అంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి, దెందులూరు, ఉమ్మడి విశాఖపట్నంలోని మాడుగుల, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మడకశిర నియోజకవర్గాల్లో అభ్యర్ధుల మార్పులు జరగొచ్చు. శనివారం లోపు మార్పులు చేసిన అభ్యర్ధులతో జాబితా ప్రకటించే అవకాశం ఉంది. పొత్తులో భాగంగా అనపర్తి సీటు బిజెపి పోటీ చేసేందుకు కూటమి మధ్య అంగీకారం కుదిరినట్టు తెలిసింది. బిజెపి అభ్యర్ధి శివకృష్ణంరాజు వైసిపి అభ్యర్ధి సత్తి సూర్యనారాయణ రెడ్డికి పోటీ ఇవ్వలేకపోతున్నారని నిర్ధారణకు కూటమి నేతలు వచ్చారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తున్న రాజమండ్రి లోకసభ పరిధిలో ఈ నియోజకవర్గం ఉంది. ఈ నియోజకవర్గంలో ఓట్లు పడకపోతే లోకసభ స్థానానికి కూడా పడవనే ఆందోళన ఆమెలో ఉన్నట్లు నేతలు చెబుతున్నారు. కాబట్టే అనపర్తి నియోజకవర్గాన్ని టిడిపికి అప్పగించి మాజీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డిని బరిలో దింపాలని నిర్ణయానికి వచ్చారు. ఈ నియోజకవర్గానికి బదులు దెందులూరును బిజెపికి అప్పగించాలనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ టిడిపి అభ్యర్ధిగా చింతమనేని ప్రభాకర్‌ను ఆ పార్టీ ప్రకటించింది. బిజెపి నుంచి తపన చౌదరి టికెట్ కోసం ఆ పార్టీపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో అనపర్తి, దెందులూరు నియోజకవర్గాలను మార్పు చేసుకున్నట్లు తెలుస్తోంది. మాడుగుల అభ్యర్ధిగా పైలా ప్రసాద్‌ను ప్రకటించిన టిడిపి ఇప్పుడు మార్చేందుకు నిర్ణయం తీసుకుంది. మాజీ మంత్రి బండారు సత్యనారాయణకు టికెట్ ఇవ్వనుంది. మడకశిర నుంచి ఎంఎ సునీల్‌కుమార్‌కు బదులు పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజును ప్రకటించనుంది. బాపట్ల ఎంపిగా ఎంఎస్ రాజు పేరును ప్రకటించాల్సి ఉంది. చివరి నిమిషంలో బిజెపి నేత కృష్ణప్రసాద్ పార్టీ కండువా కప్పుకోవడంతో ప్రకటించింది. బాపట్ల బదులు ఎంఎస్ రాజును మడకశిర అభ్యర్థిగా నిర్ణయించింది. వీటితోపాటు మరో రెండు నియోజకవర్గాల్లో మార్పులు ఉండొచ్చన్న చర్చ నడుస్తోంది.

21న టిడిపి అభ్యర్థులకు బి-ఫామ్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేయనున్న అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా బి-ఫామ్‌ అందజేయనున్నారు. ఈ నెల 21న టిడిపి కార్యాలయంలో అందజేయనున్నారు. టిడిపి నుంచి 144 మంది శాసనసభకు, 17 మంది లోకసభ నియోజకవర్గాలకు పోటీ చేయనున్నారు.

కల్యాణదుర్గంలో ఘర్షణ

- టిడిపి, వైసిపి నాయకుల పరస్పర దాడులు
- ఇరు గ్రూపులపై కేసులు నమోదు

ప్రజాశక్తి-కల్యాణదుర్గం (అనంతపురం జిల్లా)

ఘర్షణ పడుతున్న టిడిపి, వైసిపి నాయకులు

అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో గురువారం ఘర్షణ చోటు చేసుకుంది. టిడిపి వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగజేసుకుని ఇరుగ్రూపులను అక్కడి నుంచి పంపివేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని 12వ వార్డులో టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు స్థానిక నాయకులతో కలిసి గురువారం ఉదయం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుండగా టిడిపి ప్రచార రథానికి ఎదురుగా వైసిపి నాయకులు వారి ప్రచార రథాన్ని ఉంచారు. వాహనాన్ని పక్కకు తీయాలని వైసిపి నేతలను టిడిపి నాయకులు అడిగారు. ఈ విషయంలో మాటామాట పెరిగి ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పరస్పర దాడులకు దిగారు. వైసిపి నాయకుల దాడిలో టిడిపి నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ వైపి రమేష్ అస్వస్థత గురయ్యారు. టిడిపి నాయకుల దాడిలో వైసిపి నాయకులు బిక్కిరి మంజునాథ్, అనిల్ గాయపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు గ్రూపులవారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపివేశారు. ఈ ఘటనపై టిడిపి, వైసిపి మద్దతుదారులు వేర్వేరుగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించారు.

తాగునీటికి సాగర్ నీరు

- తెలంగాణకు 8.5, ఎపికి 5.5 టిఎంసిలు : కెఆర్ఎంబి ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల ఎండాకాలం తాగునీటి అవసరాల కోసం కృష్ణానది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఆదేశాలు జారీచేసింది. ఈ నెల 12న జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బోర్డు ఉత్తర్వులు ఇచ్చింది. నీటి ఎద్దడి దృష్ట్యా నాగార్జున సాగర్‌లో 500 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవాలని సమావేశంలో నిర్ణయించిన విషయం విదితమే. దాదాపు 14.195 టిఎంసిల వరకు నీరు అందుబాటులో ఉందని కెఆర్ఎంబి తెలిపింది. అందులో ఎపికి 5.5 టిఎంసిలు కేటాయించారు. మిగిలిన నీటిని హైదరాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాల కోసం వినియోగించడానికి తెలంగాణకు అనుమతినిచ్చింది. తెలంగాణ మంచినీటి అవసరాల కోసం 8.5 టిఎంసిలను వాడుకోవచ్చని ఈ మేరకు గురువారం కెఆర్ఎంబి సభ్యకార్యదర్శి డిఎం రాయిపురే ఆదేశాలు జారీ చేశారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా (Bank of India — Relationship beyond banking)
అరండల్‌పేట బ్రాంచి, డి.నెం.4-12-40, పి.యస్.కాంప్లెక్స్, కొరిటెపాడు మెయిన్ రోడ్డు, గుంటూరు-522007. ఫోన్: 0863-2271005

సంక్షిప్త డిమాండ్ నోటీసు
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద-జారీచేయబడిన నోటీసు)

ఋణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు తనఖాదారు (లు) యొక్క పేర్లు మరియు చిరునామా: 1) M/s.ఇండియన్ ఫ్లెక్స్ మెటీరియల్స్, యజమాని: శ్రీమతి షేక్ సబీహ బాను, డి.నెం.6-14-55, 14/2, అరండల్‌పేట, గుంటూరు-522002. 2) శ్రీమతి షేక్ సబీహ బాను, భర్త: కాశిన సూర్య ప్రకాష్ రెడ్డి, డోర్ నెం.25-16-48/A, టుబాకో బోర్డు ఎదురు, 12/3వ లైను, శ్రీనివాసరావుతోట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. ఫోన్: 8143928228/9030031245. **హామీదారు(లు)/ తనఖాదారు(లు): 3) శ్రీమతి కాశిన ఆదిలక్ష్మి, భర్త: రామకృష్ణారెడ్డి,** హెచ్.నెం.25-16-48/ఎ, శ్రీనివాసరావుతోట, 12/3వ లైను, టుబాకో బోర్డు ఎదురు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. ఫోన్: 8143538673 (హామీదారు(లు)/ తనఖాదారులు).

లోన్ ఖాతా : Cash Credit (Working Capital) LOAN A/C No :567930110000044
మంజూరైన పరిధి : రూ.30,00,000/-,
బకాయిసొమ్ము : రూ.33,20,523/- + 21.06.2021 తేదీ నుండి వడ్డీ.

పైన పేర్కొనబడిన ఋణసౌకర్యములు ఈ క్రింద తనఖావుంచబడిన ఆస్తులపై మంజూరు చేయడమైనది. (బ్యాంకుకు తనఖావుంచబడిన ఆస్తులు / ఆస్తి యొక్క వివరములు):

ఆస్తి వివరములు: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా యొక్క లిమిట్స్, శ్రీనివాసరావుతోట, 12/3వ లైను, డి.నెం.4/1బి, రామచంద్రాపురం అగ్రహారం గ్రామము, బ్లాక్ నెం.20 & 21, పట్టా నెం.1053, అసెస్మెంట్ నెం.37377/DN/1, డోర్ నెం. 25-16-48/A నందు **హామీదారురాలు శ్రీమతి కాశిన ఆదిలక్ష్మి, భర్త: రామకృష్ణారెడ్డికి చెందిన** 82.8 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందలి ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** యస్.కె.మొహమ్మద్ హుస్సేన్ యొక్క ఆస్తి-39 అ॥; **దక్షిణం:** ఈగ అనసూయమ్మ యొక్క ఆస్తి-19 అ॥; **పడమర:** షేక్ ఫాతిమాభీ యొక్క ఆస్తి-39.6 అ॥; **ఉత్తరం:** 20 అ॥ వెడల్పుగల రోడ్డు-19 అ॥.

పైన చెప్పబడిన ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులు **బ్యాంక్ ఆఫ్ ఇండియా, అరండల్‌పేట బ్రాంచి** వారి నుండి ఋణం పొంది ఉన్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చి యున్నారు. ఋణము యొక్క నియమనిబంధనలననుసరించి ఋణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులు సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమనిబంధనల ప్రకారము **తేది.21-06-2021** న నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. **బ్యాంకు పైన పేర్కొనబడిన తనఖావుంచిన ఆస్తులపై చర్య తీసుకొనుటకు ఉపక్రమించి ఋణగ్రహీతకు తేది.26-03-2024న రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసు చిరునామాలో లేరని బట్వాడా కాకుండా తిరిగి వచ్చినందున ఈ ప్రకటన జారీచేయడమైనది.** సదరు ఋణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులు పైన పేర్కొన్న మొత్తములను ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం ఋణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులు పైన తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది: 18-04-2024, ప్రదేశం: గుంటూరు — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఇన్ఫోసిస్‌లో 26వేల మంది ఉద్యోగులు ఔట్

- క్యూ4లో రూ.7,969 కోట్ల లాభాలు

బెంగళూరు : దేశంలోని రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 30 శాతం వృద్ధితో రూ.7,969 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.6,128 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.37,441 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో 1.3 శాతం పెరిగి రూ.37,923 కోట్లకు చేరింది. రెవెన్యూ, లాభాలు భారీగా పెరిగినప్పటికీ.. వరుసగా ఐదో త్రైమాసికంలోనూ నియామకాలు పడిపోవడం గమనార్హం. 2023 మార్చి ముగింపు నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,43,234గా ఉండగా.. గత ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతం లేదా నికరంగా 25,994 మంది తగ్గడంతో మొత్తం మానవ వనరుల సంఖ్య 3,17,240కి పరిమితమయ్యింది. గడిచిన 23 ఏళ్లలో ఇంత భారీగా ఉద్యోగాలు తగ్గడం ఇదే తొలిసారి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమ రెవెన్యూలో ఒక శాతం నుంచి మూడు శాతం వరకూ వృద్ధి ఉండొచ్చని ఆ కంపెనీ అంచనా వేసింది.

పులివెందులలో వైఎస్ సునీత ప్రచారం

- షర్మిలకు ఓటు వేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పులివెందుల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె వైఎస్ సునీత, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని వినాయక స్వామి ఆలయాన్ని వారు సందర్శించారు. పట్టణ ప్రధాన వీధుల్లో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి వైఎస్ షర్మిలకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎంపి అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి ఓటమి ధ్యేయంగా తాము ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు సునీత తెలిపారు. వైఎస్ షర్మి లను గెలిపిస్తే కడప ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలకూ ఆమె ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ శివప్రకాశ్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామ్‌రెడ్డి, వేలూరు శ్రీనివాసరెడ్డి, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వేణుగానాలంకారంలో శ్రీరాముడు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం వేణుగానాలంకారంలో శ్రీరామచంద్రమూర్తిని అలంకరించారు. ఆలయ నాలుగు మాఢవీధుల్లో శ్రీరాముడిని ఊరేగించారు. చెక్కభజన, కోలాటం, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా ఊరేగింపు జరిగింది. యాత్రికులు అడుగడుగునా కర్పూరహారతులు అందించారు. ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటలకు ఊంజల్ సేవ, రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటలకు వాహనసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్లు హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

హడావుడిగా ఉద్యోగుల బకాయిలు చెల్లింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలపై ఆర్థికశాఖ దృష్టి సారిస్తోంది. ఏళ్ల తరబడి చెల్లింపులు లేకపోవడంతో ఆయా వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు హడావుడిగా ఆర్థికశాఖ చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే భారీ మొత్తంలో బకాయిలను ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లింపులు చేస్తున్నారు. ఒకవైపు సామాజిక పింఛన్లు, వేతనాలకు నిధులు సమకూరుస్తూనే, మరోవైపు జిపిఎఫ్, మెడికల్ బిల్లులు వంటివి చెల్లించేందుకూ చర్యలు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓవర్‌డ్రాఫ్ట్‌కు కూడా వెళ్తున్నట్లు సమాచారం. కొత్త ఆర్థిక సంవత్సరం తొలి నెల సగం దాటిపోయినా ఖజానా ఓడీలోనే ఉంది. కేవలం ఇటువంటి పాత బకాయిలను చెల్లించేందుకే ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల్లోనే రాష్ట్ర ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఈ బకాయిలు చెల్లించాలని ప్రయత్నిస్తుండడం గమనార్హం. ఇప్పటికే బకాయిలపై ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడం తెలిసిందే. వారంతా బాహాటంగానే ప్రభుత్వ తీరుపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. దీని ప్రభావం ఓటింగ్‌పైనా పడుతుందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం ముందుగానే ఈ బకాయిలను విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది.

మడకశిరలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న వైఎస్.షర్మిల

బిజెపితో టిడిపి పొత్తు.. మోడీకి వైసిపి తొత్తు..!

- ఈ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం
- 'అనంత' పర్యటలో వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రానికి పదేళ్లుగా తీరని అన్యాయం చేసిన బిజెపితో టిడిపి నేరుగా పొత్తు పెట్టుకుంటే... వైసిపి మోడీకి తొత్తుగా ఉందని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఈ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, కాంగ్రెసుతోనే ప్రత్యేక హోదా సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎపి న్యాయ యాత్రను ఆమె చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం సత్యసాయి జిల్లాలోని మడకశిర నియోజకవర్గంలో పర్యటించారు. సాయంత్రం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని నార్పల మండలం, ఉరవకొండ పట్టణం సభల్లో షర్మిలతో పాటు ఇండియా వేదికలోని సిపిఎం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి మోసం చేసిందని విమర్శించారు. పోలవరం విషయంలోనూ ఇదే మోసం జరిగిందని గుర్తు చేశారు. వీటిని సాధించే విషయంలో వైసిపి, టిడిపిలు బిజెపిని నిలదీయలేవన్నారు. మోసం చేసిన పార్టీతో టిడిపి పొత్తు పెట్టుకుంటే... మోడీకి తొత్తుగా వైసిపి ఉందన్నారు. రాష్ట్రంలో ఆ రెండు పార్టీల్లో ఏది అధికారంలోకి వచ్చినా పాలించేది మాత్రం బిజెపినే అని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాను సాధించి ఉంటే రాష్ట్రానికి పరిశ్రమలు విరివిగా వచ్చేవని, స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు లభించేవని అన్నారు. ఇవి లేకపోవడంతో ఈ జిల్లా నుంచి ఉపాధి కోసం వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. రాయలసీమకు సాగు, తాగునీటిని అందించే హంద్రీనీవా వైఎస్ హయంలోనే 90 శాతం పూర్తయితే. మిగతా పది శాతం ఈ పదేళ్లలో ఈ రెండు పార్టీలు పూర్తి చేయలేకపోయాయని దుయ్యబట్టారు. ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీ అమలులో భాగంగా ఈ ఐదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా వేదిక అభ్యర్థులను అత్యధిక మోజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యులు ఎన్ రఘువీరారెడ్డి, ఎపిసిసి మాజీ అధ్యక్షులు, శింగనమల అభ్యర్థి డాక్టర్ సాకే శైలజనాథ్, సిపిఎం సత్యసాయి జల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, అనంతపురం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ నల్లప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, డిసిసి అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, అనంతపురం పార్లమెంటు అభ్యర్థి వి మల్లికార్జున, ఉరవకొండ కాంగ్రెసు అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకొస్తే విశాఖ నుంచే పాలన : మంత్రి బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశాఖ నుంచి సిఎం పాలన కొనసాగిస్తారని, ఇక్కడే ప్రమాణస్వీకారం చేస్తారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విశాఖలోని లాసన్స్‌బే కాలనీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ఉత్తరాంధ్రను గత టిడిపి ప్రభుత్వం మరింత వెనుకబాటుకు గురిచేసిందన్నారు. విశాఖకు సహజ వనరులు, పరిశ్రమలు, రోడ్డు, ఎయిర్, సీ కనెక్టివిటీ ఉన్నాయని, ఈ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో సిఎం తీర్చిదిద్దుతారని తెలిపారు.

తమ ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ జరగడం లేదని కొంతమంది అసత్యాలు చెబుతున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సాధ్యం కాలేదని, దానికి ప్రత్యామ్నాయంగా ఉద్యోగులకు మేలు చేసే స్కీమును తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. నాసిరకం మద్యాన్ని విక్రయిస్తున్నట్టు చంద్రబాబు అండ్ కో విమర్శలు చేస్తున్నారని, వారు ఏ ల్యాబ్‌లో టెస్టులు చేశారని, నాసిరకమని ధ్రువీకరించిందెవరని ప్రశ్నించారు. అసలు మద్యపానానికే తమ ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై చంద్రబాబు తన వైఖరి ఏమిటో చెప్పాలని సవాలు విసిరారు.

ఎన్నికల ప్రచారంలో వివేకా హత్య గురించి ప్రస్తావించొద్దు

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన కడప కోర్టు

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య గురించి ఎవ్వరూ మాట్లాడకూడదని కడప కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కడప ప్రిన్సిపల్ డిస్టిక్ కోర్టులో మాజీ గవర్నమెంట్ ప్లీడర్ ఎం.నాగిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రచారంలో వివేకానందరెడ్డి హత్య గురించి చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్, పురందేశ్వరి, బీటెక్ రవి, వైఎస్.షర్మిల, వైఎస్.సునీత మాట్లాడకూడదని ప్రిన్సిపల్ జిల్లా కోర్టు జడ్జి గురువారం ఆదేశించారు.

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ✦ DEPOSITS — Translating Dreams into Reality
డి.నెం.4-1-1, గాయత్రీ ప్లాజా, 1వ అంతస్తు, కొరిటెపాడు, మెయిన్ రోడ్డు, గుంటూరు-522007. ఫోన్: 0863-2333064, సెల్ : 7625079146
E Mail-guntur@canfinhomes.com (CIN : L85110KA1987PLC008699)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి నిబంధన 8(6) క్రింద హామీ స్థిరాస్తుల అమ్మకం యొక్క ప్రకటన

టు
1) శ్రీ నిడమానూరి భీమేశ్వరరావు (ఋణగ్రహీత 1), ఇంటి నెం.4-28/ఎ, పంచాయితీ కార్యాలయం దగ్గర, పొనుగుపాడు, గుంటూరు-522549
2) శ్రీమతి నిడమానూరి సుబ్బాయమ్మ (ఋణగ్రహీత 2), ఇంటి నెం.4-28/ఎ, పంచాయితీ కార్యాలయం దగ్గర, పొనుగుపాడు, గుంటూరు-522549
3) శ్రీ నిడమానూరి శివ ప్రసాద్ (హామీదారు), ఇంటి నెం.4-28/ఎ, పంచాయితీ కార్యాలయం దగ్గర, పొనుగుపాడు, గుంటూరు-522549

మీలో నెం.1 & 2 గా ఉన్నవారు మా గుంటూరు బ్రాంచి నుండి గృహ ఋణము వినియోగించుకున్నారు మరియు అందులకు హామీగా ఈ దిగువ చెప్పిన **నెం.1** గా ఉన్న వారికి చెందిన ఆస్తి తనఖా ఉంచడమైనది. మీ ఋణఖాతా **తేది.01.05.2022**న నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినది మరియు తదుపరి **తేది.24.09.2022** నాటికి మా డిమాండ్ నోటీసు నందు చెప్పిన బకాయి మొత్తము చెల్లించవలసినదిగా మిమ్ములను కోరడమైనది.

స్థిరాస్తి వివరములు
గుంటూరు జిల్లా, నరసారావుపేట రెవెన్యూ డివిజన్, శిశు మందిర్ స్కూల్ దగ్గర, ఇస్సాపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, 440-44 చ॥గ॥ లేదా 368-25 చ॥మీ॥ల విస్తీర్ణంలో డి.నెం.114 & 115తో **"శ్రీ సరస్వతీ హోమ్స్"** పేరుతో గల అపార్ట్‌మెంట్ నందు గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.103. **హద్దులు: తూర్పు:** 17 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** ఎం.జునియనమ్మ గారి ఆస్థి, **ఉత్తరం:** ఎం.జునియనమ్మ & పి హనుమంతరావు గార్ల ఆస్థి.
ఇస్సాపాలెం గ్రామ పంచాయితీ ఏరియాలోని **"శ్రీ సరస్వతీ హోమ్స్"**లోని 22-02 చ॥గ॥లు లేదా 18-41 చ॥మీ॥ల అవిభాజ్యపు అనిర్దేశ్యపు విస్తీర్ణం వాటాతో గ్రౌండ్ ఫ్లోర్‌లోని 900 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు కార్ పార్కింగ్‌తో గల అన్ని అనుభవించు మరియు ఉమ్మడి యూజిమెంటరీ హక్కులతో గల ఫ్లాట్ నెం.103నకు **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై & లిఫ్ట్, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

అయినప్పటికినీ మీరు మా డిమాండ్ నోటీసు నందు చెప్పబడిన చట్టబద్ధ కాలపరిమితి లోగా బకాయిలు తిరిగి చెల్లింపు నందు విఫలమైనారు కావున, ఈ దిగువ సంతకందారుడు అధీకృత అధికారిగా సదరు హామీ స్థిరాస్తులను పైన చెప్పిన చట్టం యొక్క సెక్షను 13(4) తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 8 నిబంధన ప్రకారం, స్వాధీనత తీసుకున్నారు.

కావున మీరు ఋణఖాతాలోని పూర్తి బకాయిలు **తేది.24.09.2022 నాటికి రూ.19,79,909/-** మరియు తదుపరి వడ్డీ మరియు ఒప్పందరేటు ప్రకారం ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను. ఈ సమాచారము రిజిష్టర్డ్ పోస్ట్ ద్వారా మీ చివరి తెలిపిన చిరునామాకు పంపబడినది మరియు సదరు నోటీసు మీచే స్వీకరింపబడక త్రిప్పి పంపబడినది కావున ఈ ప్రచురణ చేయబడినది.

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) యొక్క నిబంధన 8(6) తో చదవబడే క్రింద ఈ నోటీసు మీకు చిట్టచివరిదిగా మీ యొక్క పూర్తి బకాయి మొత్తములను ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ జారీ చేయబడినది. అట్లు విఫలమైన ఎడల ఈ దిగువ సంతకందారుడు వేలం తేది. నిర్ణయించి, వేలం ప్రకటన ప్రచురించి మరియు హామీ స్థిరాస్తులు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002, నందలి నిబంధనల ప్రకారం విక్రయం జరిపి తమ బకాయి మొత్తములను వసూలు చేసుకొనగలరని దయచేసి గమనించవలెను.

తేది : 18.04.2024 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : గుంటూరు — కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్.,

TATA
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదు కార్యాలయం చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400013
శాఖ చిరునామా: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డో.నం: 54-15-4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లెరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీసు రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ-520008.

స్థిరాస్తి యొక్క అమ్మకం కొరకు నోటీసు
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు రూల్ 9(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)కి తనఖాగా ఉంచబడిన స్థిరాస్తిని క్రింద వివరించిన స్థిరాస్తిని గురించి సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత లేదా వారి చట్టపరమైన వారసులు/ప్రతినిధులు (రుణగ్రహీతలు)లకు దీని ద్వారా నోటీసు ఇవ్వడింది. టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క అధీకృత అధికారి తీసుకున్న స్వాధీనం 22.05.2024న దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతలు బకాయిలను రికవరీ చేయడానికి "ఎక్కడ ఉందో అలాగే ఉంది" మరియు "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది" ఆధారంగా. రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ దిగువన పేర్కొనబడ్డాయి. ఏదైనా వాయిదా/విక్రయాలు నిలిపివేయబడినప్పుడు, పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్/ఆస్తి దీని ద్వారా విక్రయించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. ఇ-వేలం 22.05.2024న మ. 2గం.లకు . ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి యొక్క డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలిగి ఉన్న సీల్డ్ ఎన్వలప్‌ను టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ ఆధీకృత అధికారికి బ్రాంచ్ అడ్రసు: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్, డోర్ నెం. 54.15.4సి/1, 5వ అంతస్తు, ఆర్.కె. గల్లెరియా శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్డు, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 మరియు టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ప్లాట్ నం.3 నుండి 6, నాలుగవ అంతస్తు, ఆటో ప్లాజా, రోడ్డు నం.3, బంజారా హిల్స్, హైదరాబాద్-500034 వద్ద 21.05.2024, సా.5గం.ల లోపు సమర్పించాలి.
క్రింద వివరించిన క్లుప్త వివరాల ప్రకారం సురక్షి ఆస్తి/ స్థిరాస్తి విక్రయం "పరిస్థితి ఉన్న చోటనే" ఉంటుంది.

క్ర.సం	లోన్ ఎకౌంట్ నెం. మరియు శాఖ	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు) చట్టపరమైన వారసులు/ న్యాయ ప్రతినిధి/ తనఖాదారు(లు) పేర్లు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వ్ మొత్తం	బయానా మొత్తం	స్వాధీనతా విధానం
1.	9733449	శ్రీ. చిరంజీవి ఆత్యం, శ్రీమతి. ఆత్యం మాధవి	రూ.40,65,711/- (నలభై లక్షల అరవై ఐదు వేల ఏడు వందల పదకొండు రూపాయలు మాత్రమే) 13-07-2021	రూ.69,15,500/- (అరవై తొమ్మిది లక్షల పదిహేను వేల ఐదు వందల రూపాయలు మాత్రమే)	రూ.6,91,550/- (ఆరు లక్షల తొంభై ఒక్క వేల ఐదు వందల యాభై రూపాయలు మాత్రమే)	భౌతికం
2.	10382816	శ్రీమతి.భూలక్ష్మి సంద్రు, శ్రీ. రామాంజనేయ	రూ.16,48,637/- (పదహారు లక్షల నలభై ఎనిమిది వేల ఆరు వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే) 27-10-2023	రూ.27,72,200/- (ఇరవై ఏడు లక్షల డెభై రెండు వేల రెండు వందల రూపాయలు మాత్రమే)	రూ.2,77,220/- (రెండు లక్షల డెభై ఏడు వేల రెండు వందల ఇరవై రూపాయలు మాత్రమే)	భౌతికం

స్థిరాస్తి వివరణ (1): కృష్ణాజిల్లా, నందిగామ ఎస్ఆర్‌ఓ, నందిగామ మండలం, నందిగామ గ్రామం, రెవెన్యూ వార్డు నం.14, మూల్యాంకనం నం.1145007598, బేరింగ్ డో.నం.14-12, ఆర్.ఎస్.నం.522/3 లో ఉన్న మొత్తం ఆ సైట్ 97.50 చ.గ.లు. లేదా 81.522 చ.మీ.లు. తో పాటు ఆర్‌సిసి భవనం ఉన్న గ్రౌండ్, ఒకటవ మరియు రెండవ అంతస్తులు. **హద్దులు : తూర్పు :** షేక్ ఖాదర్ మస్తాన్ (ఆంధ్రా జ్యువెలర్స్) ఆస్తి, **పడమర :** రోడ్డు, **ఉత్తరం :** కె.కోటేశ్వరరావు ఆస్తి, **దక్షిణం :** షేక్ ఖాదర్ మస్తాన్ (ఆంధ్రా జ్యువెలర్స్) ఆస్తి.

స్థిరాస్తి వివరణ (2): గుంటూరు జిల్లా, ఎస్ఆర్‌ఓ మంగళగిరి-522503, మంగళగిరి మండలం, నవులూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ప్లాట్ నం.10, సర్వే నం.777/4 డో.నం.4-486 లో శ్రీమతి.సంద్రు భూలక్ష్మి పేరు మీద ఉన్న రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.15596/2018 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 166 చ.గ.లు. లేదా 138.7 చ.మీ.లు. భాగం బయట 332.5 చ.గ.లు. **హద్దులు : తూర్పు :** బి.కృష్ణారెడ్డి 67 అ.లు., **పడమర :** సరసు మదన్‌కుమార్ స్థలం 66 అ.లు., **ఉత్తరం :** లే అవుట్ రోడ్డు 22.5 అ.లు., **దక్షిణం :** డొంక రోడ్డు 22.5 అ.లు.

వేలం వద్ద, సాధారణ ప్రజలు వ్యక్తిగతంగా వారి బిడ్(లు) దాఖలు చేయుటకు ఆహ్వానించడమైనది
రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) ఈ నోటీసు ప్రచురించిన 15 రోజులలోపు మొత్తం బకాయిలను తదుపరి వడ్డీతో చెల్లించడానికి ఇక్కడ చివరి అవకాశం ఇవ్వబడింది. లేని పక్షంలో స్థిరాస్తి షెడ్యూల్ ప్రకారం విక్రయించబడుతుంది. పైన పేర్కొన్న విధంగా చెల్లించాల్సిన మొత్తం, వడ్డీ మరియు ఖర్చులు (అమ్మకపు ఖర్చుతో సహా) పైన పేర్కొన్న మొత్తాన్ని 'ఆధీకృత అధికారికి టెండర్ చేస్తే ఇ వేలం నిలిపివేయబడుతుంది లేదా అటువంటి సురక్షితమైన రుణం, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించినట్లు ఇ-వేలం తేదీకి ముందే అతని సంతృప్తికి రుజువు ఇచ్చినట్లయితే.
ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి, ఈ అమ్మకానికి సంబంధించి ఏ విధమైన విధిని కలిగి ఉన్నా, అయితే, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వేలం వేయాలి, అమ్మిన ప్రవచనంలో ఆసక్తిని సంపాదించడానికి కొనుగోలుదారుడు ప్రయత్నిస్తాడు.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో సూచించిన షరతులకు లోబడి ఉండవలెను మరియు తదుపరి షరతులు అనుసరించవలెను:
నోట్: ఇ-వేలం 22.05.2024న మ.2.00గం.ల నుండి 3.00గం.ల మధ్యన ప్రతి 10 నిమిషాల పొడగింపుతో పోర్టల్ https://sarfaesi.auctiontiger.net ద్వారా జరుగుతుంది.

నియమాలు మరియు నిబంధనలు:
1) దిగువ షెడ్యూల్‌లో ప్రత్యేకంగా పేర్కొన్నట్లుగా క్రింది సంతకందారునికి ఉన్నంత సమాచారం మేరకు సరైనవి, కాని క్రింది సంతకందారుడు ఈ ప్రొక్లేమేషన్‌లో ఏదేని పొరపాటు, మిస్‌స్టేట్‌మెంట్ లేదా లోపానికి సమాధానం ఇవ్వరు. మొత్తం బిడ్ లేదా బిడ్డరుదారుకు ఏదేని వివాదాలు తలెత్తితే, ఆ లాట్ మళ్లీ ఒకసారి వేలం కొరకు ఉంచబడును. **2)** ఆస్తిని రిజర్వు ధర కంటే తక్కువ ధరకు విక్రయించబడదు. **3) బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (పది వేల రూపాయాలు) 4)** ఆస్తి కొనుగోలు కోసం సమర్పించిన అన్ని బిడ్‌లు పైన పేర్కొన్న విధంగా ఎర్నెస్ట్ మనీతో పాటు "టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" కి అనుకూలంగా ఉండే డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అందించబడతాయి. చెల్లించవలసిన శాఖ చిరునామా: ఎన్ఆఎఫ్‌టి/ ఆర్‌టిజిఎస్/ ఐఎమ్‌పిఎస్ ద్వారా ఇఎమ్‌డి కోసం, దయచేసి ఆధీకృత అధికారిని సంప్రదించండి. వేలం సఫలీకృతంకాని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగిఇవ్వబడును. **5)** అధిక్యతగల బిడ్డరుదారు బిడ్‌కు చట్టపరంగా అర్హతపొందినగా అన్నివిధాలా కల్పించిన ఏదేని లాట్ కొనుగోలుదారుగా ప్రకటించబడతారు మరియు తదుపరిగా అతని ద్వారా బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫర్‌చేసిన ధర సరిగాలేనట్లుగా స్పష్టంగా కనిపిస్తే అత్యధిక బిడ్ యొక్క క్షీణత అనుమతించుట ఆధీకృత అధికారి యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. **6)** రికార్డు అయిన కారణాల కొరకు అమ్మకమును వాయిదా వేయుట/నిలుపివేయుట అనునది 'ఆధీకృత అధికారి' యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. **7)** ఆస్తి యొక్క తనిఖీ **15-05-2024న ఉ.11 గం.ల నుండి సా.5.00గం.ల మధ్యలో** చేపట్టవచ్చును. **8)** కొనుగోలుదారుగా ప్రకటించబడు వ్యక్తి, సదరు డిక్లేరేషన్ తరువాత వెంటనే, కొనుగోలుచేసిన మొత్తం/బిడ్‌లో ఇరవై ఐదు శాతంను 24 గం.లలోపు **'ఆధీకృత అధికారి'**కి డిపాజిట్ చేయవలెను మరియు సదరు డిపాజిట్ విషయంలో విఫలమైన యెడల, ఆస్తి వెంటనే ప్రైవేట్ ట్రీటి ద్వారా తాజా వేలం/అమ్మకానికి ఉంచబడుతుంది. **9)** పై విధంగా చేసిన ప్రారంభ డిపాజిట్ విషయంలో, కొనుగోలు యొక్క మిగిలిన మొత్తంను ఆస్తి అమ్మకం నిర్ధారణ తేది నుండి 15వ రోజున లేదా ఆలోగా ఆధీకృత అధికారి కొనుగోలుదారు చెల్లించవలెను, లేదా ఒకవేళ 15వ రోజు ఆదివారం లేదా ఇతర సెలవు రోజువస్తే, 15వ రోజు తరువాత మొదటి రోజున చెల్లించవలెను. **10)** పైన పేర్కొన్న సమయంలో ఏదైన విఫలం చెందితే, ప్రైవేట్ ట్రీటి ద్వారా ఆస్థిని తాజాగా వేలం/విక్రయం జరుపబడును. డిపాజిట్ టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఇఎండి సహా వదులుకోవాల్సి ఉంటుంది మరియు విఫలమైన కొనుగోలుదారుడు ఆస్థి దావాలు కోల్పోవలసి ఉంటుంది. **11)** ఆస్తికి సంబంధించిన **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి తెలిసినంత వరకు ఏదేని రుణాభారాలు వివరాలు: నిల్. ఆస్తికి పెట్టబడిన క్లెయిలు ఏవేని ఉన్నట్లయితే మరియు దీని స్వభావం మరియు విలువపై కలిగియున్న ఏదేని ఇతర తెలిసిన వివరాలు : లేవు. పైవి కాక ఇతరములు ఏవీలేవు. **12) ఏదైనా ఇతర వివరాల కోసం లేదా ఇ-వేలం పై ఆన్ లైన్ శిక్షణ కోసం కాబోయే బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్ ఇ-ప్రొక్యూర్మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్‌టైగర్), చిరునామా : బి-705, వాల్ స్ట్రీట్ 2, ఓరియంట్ క్లబ్ ఎదురు, గుజరాత్ కాలేజి వద్ద, ఎల్లిస్ బ్రిడ్జి, అహ్మదాబాద్-380 006 గుజరాత్ (ఇండియా) మొబైల్ : 8000023297 / 9173528727 మరియు 9265562818/9265562821/079-6813 6842/6869 ఇ మెయిల్ :** support@auctiontiger.net & ramprasad@auctiontiger.net **లేదా మనిష్ బన్సాల్, ఇ మెయిల్ ఐడి:** Manish.bansal@tatacapital.com **ని సంప్రదించవచ్చు.** ఆధీకృత అధికారి ఫోన్ నెం. 8588983696, దయచేసి మీ ప్రశ్నను వాట్సప్ నెం. 9999078669 లో పంపండి. **13)** 1% టిడిఎస్ వర్తింబడును మరియు గరిష్ఠంగా ప్రకటించిన బిడ్ మొత్తం మీద అత్యధిక బిడ్డర్ ద్వారా చెల్లించబడుతుంది. యజమాని/రుణగ్రహీత(లు) యొక్క పాన్‌లో అత్యధిక బిడ్డర్ ద్వారా పేమెంట్ చెల్లించాల్సిన అవసరం ఉంటుంది మరియు ఒక చలాన్ కాపీ మా కంపెనీకి దాఖలు చేయాల్సి ఉంటుంది. **14) పై వివరాలకు సెక్యూర్డ్ క్రెడిటార్'స్ వెబ్‌సైట్** http://surl.li/sfcru **లో పొందుపరిచిన క్రింది లింక్‌ను చూడవచ్చు. 15.** దయచేసి https://www.tatacapital.com/property-disposal.html లింక్‌ని కూడా సందర్శించండి.
దయచేసి గమనించండి- టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ ఈ ఆస్తి అమ్మకం/ వేలం కోసం పేర్కొన్న వేలం భాగస్వామితో పాటు ఏ బ్రోకర్/ఏజెంట్‌ను నిమగ్నం చేయలేదు. ఆసక్తి ఉన్న పార్టీలు ఈ విషయంలో అన్ని సందేహాలు మరియు విచారణల కోసం దిగువ సంతకం చేసిన ఆధీకృత అధికారిని మాత్రమే సంప్రదించాలి.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ — సం/- అధీకృత అధికారి
తేది: 19.04.2024 — టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బీహార్ కా షేర్ కౌన్ బనేగా?

మీరేమైనా జోతిష్కులా? - ప్రియాంక

లక్నో : లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాలు గెలుస్తామని, మూడోసారి కూడా తామే అధికారంలోకి రాబోతున్నామని బిజెపి నేతలు చెబుతుండగా, బిజెపి నేతల వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక తోసిపుచ్చారు. మీరేమైనా జోతిష్యులా అని ఆమె ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఇండియా ఫోరం తరపున కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న ఇమ్రాన్ మసూద్‌కి మద్దతుగా ప్రియాంక ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇండియా'కు ఎన్ని స్థానాలు వస్తాయని ఆమెను మీడియా ప్రశ్నించగా.. తానేమీ జ్యోతిష్యురాలిని కాదన్నారు. 'ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. వారికి ఇలాంటి రాజకీయాలు అక్కర్లేదు. గత పదేళ్లలో ఏ ఒక్క సామాన్య వ్యక్తి లేదా మహిళ జీవితంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. యువతకు ఉద్యోగాలు రావడం లేదు. ద్రవ్యోల్బణం తగ్గడం లేదు. ముఖ్యంగా ప్రధాని మోడీ ప్రజలతో సంబంధాన్ని కోల్పోయారు. దేశంలో ఈసారి ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే బిజెపికి 180 సీట్లకు మించి రావు. 'ఇండియా'కు మంచి సంఖ్యలోనే సీట్లు వస్తాయి...' అని ప్రియాంక ఆశాభావం వెలిబుచ్చారు.

- అవకాశవాద నితీష్ సారథ్యంలో ఎన్‌డిఎ కూటమి
- తేజస్వి కెప్టెన్‌గా ఇండియా బ్లాక్
- సిపిఎం, సిపిఐ చెరొక చోట పోటీ
- సిపిఐ(ఎంఎల్) 3 స్థానాల్లో

ప్రజాశక్తి - పాట్నా

జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే బీహార్‌లో ఇండియా ఫోరం, ఎన్డిఎ మధ్య ద్విముఖ పోటీ నెలకొంది. 40 స్థానాలున్న బీహార్‌లో ఏడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడతలో నాలుగు, తరువాత నాలుగు విడతల్లో ఐదేసి స్థానాలు, చివరి రెండు విడతల్లో ఎనిమిదేసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి తమ స్థానాలను నిలబెట్టుకోవాలని ఎన్డిఎ కూటమి ప్రయత్నిస్తుండగా, ఈతడవ బీహార్‌లో విజయంతో ఎన్డిఎ కూటమిని మట్టి కరిపించేందుకు ఇండియా ఫోరం శ్రమిస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఓట్లు 7,64,33,329 కాగా పురుషులు4,00,29,136, మహిళలు: 3,64,01,903 ట్రాన్స్ జండర్ ఓట్లు 2,290.

పొత్తులు, కూటములు

బీహార్‌లో దాదాపుగా పాత కూటమి సర్దుబాట్లే కొనసాగుతున్నాయి. గత ఎన్నికల్లో బిజెపి, జెడియు, లోక్ జనశక్తి పార్టీలతో ఎన్డిఎ కూటమి 39 సీట్లను గెలుచుకుంది. బిజెపి 17 సీట్లలో పోటీ చేసి అన్నీ గెలుచుకుంది. జెడియు 17 సీట్లకు 16 చోట్ల, ఎల్జేపి ఆరింటికి ఆరూ కైవసం చేసుకున్నాయి. కాంగ్రెస్, ఆర్జెడి తదితర పార్టీల మహాకూటమి ఓటమి చెందింది. కాంగ్రెస్ 9 చోట్ల పోటీ చేసి ఒక సీటు గెల్చుకోగా, ఆర్జెడి 19 స్థానాల్లో పోటీ చేసి అన్నింటిలో ఓడిపోయింది. ఈసారి ఎన్డిఎ కూటమిలో బిజెపి 17, జెడియు 16, చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని ఎల్జేపి 5, జితన్ రామ్ మాంఝికి చెందిన హిందుస్తాన్ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ సమతా ఒక్కో స్థానంలో పోటీ చేయనున్నాయి. ఇండియా ఫోరంలో ఆర్జెడి 26, కాంగ్రెస్ 9, సిపిఐ(ఎంఎల్) 3, సిపిఎం 1, సిపిఐ 1 పోటీ చేస్తున్నాయి. అయితే ఆర్జెడి తమ 26 సీట్లలో మూడింటిని మాజీ మంత్రి ముకేశ్ సాహ్ని సారథ్యంలోని వికాసిల్ ఇన్సాన్ పార్టీ (విఐపి)కి కేటాయించింది.

బిజెపి సీట్లకు గండి

దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న నితీష్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఎన్డిఎ సీట్లకు గండి పడనుంది. రాష్ట్రంలో కులగణన చేపట్టడాన్ని నితీష్ సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారు. అది తమ ఘనతేనని కాంగ్రెస్, ఆర్జెడి కౌంటర్ ఇస్తున్నాయి. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆ హామీ ఇస్తున్న విషయాన్ని, మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళుతోంది. బిజెపి రామ మందిరాన్నే నమ్ముకుంది. ఎన్నికల వేళ వెన్నుపోటు పొడిచిన నితీష్‌కు గుణపాఠం నేర్పాలని ఇండియా ఫోరం పట్టుదలగా ఉంది. ఆయనది పచ్చి అవకాశవాదమంటూ కాంగ్రెస్, ఆర్జెడి విమర్శిస్తున్నాయి.

కులాలు చుట్టూనే...

బీహార్‌లో దశాబ్దాలుగా కులాల చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి. నితీష్ చేపట్టిన కులగణన మరోసారి రిజర్వేషన్ల అంశాన్ని చర్చకు పెట్టింది. రాష్ట్రంలో 94 లక్షల కుటుంబాలు (34.13 శాతం) నెలకు రూ.6,000 సంపాదన కూడా లేక పేదరికంలో మగ్గుతున్నారని కులగణనలో వెల్లడైంది. రాష్ట్రంలో రిజర్వేషన్లను 65 శాతానికి పెంచాల్సిందేనని నితీష్ పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 19.65 శాతం ఎస్సిలు, 1.68 శాతం ఎస్టీలున్నారు. వారిలో ఏకంగా 42.7 శాతం మంది నిరుపేదలని కులగణనలో తేలింది. 27.13 శాతం ఒబిసిలున్నారు. దాదాపు 17.7 శాతం మంది ముస్లింలున్నారు.

నిరుద్యోగం, ధరలు పెరుగుదలే ప్రధాన సమస్యలు

బీహార్‌లో నిరుద్యోగం, ధరల పెరుగుదలే ప్రధాన ఎన్నికల అంశాలుగా ఉన్నాయి. మోడీ హయాంలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల, కార్పొరేట్ దోపిడీ తదితరాలను ప్రచారాస్త్రాలుగా ప్రతిపక్ష ఇండియా ఫోరం మలచుకుంటున్నాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ఎన్నికల ఎజెండా అని ఆర్జెడి నేత తేజశ్వీ యాదవ్ పేర్కొన్నారు.

ఫిరాయింపుల నితీష్

బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కప్పగంతులకు మారుపేరుగా నిలిచారు. ఏదో ఒక పార్టీ పొత్తుతో 15 ఏళ్లుగా సిఎం పీఠాన్ని అంటిపెట్టుకున్నారు. ఒకసారి బిజెపితో, మరొకసారి ఆర్జెడితో ఇలా కూటములు మారుస్తూ పబ్బంగడుపుకుంటూ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. 2015 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్డిఎ కూటమికి గుడ్ బై చెప్పి బయటకు వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జెడి, సమాజ్ వాదీ, జెడిఎస్, కాంగ్రెస్ మహా కూటమిగా పోటీ చేశాయి. ఆర్జెడి అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించినా నితీష్ సిఎం పదవి దక్కించుకున్నారు. రెండేళ్ల తిరిగేసరికి మహాకూటమికి రాంరాం చెప్పి మళ్లీ బిజెపితో జట్టుకట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డిఎ కూటమితో సీట్ల సర్దుబాటు చేసుకున్నారు. ఆ తరువాత 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్డిఎ భాగస్వామిగా పోటీ చేసి సిఎం పీఠమెక్కారు. బిజెపి ఎక్కువ సీట్లు గెలిచినా నితీష్ మళ్లీ సిఎం పదవి దక్కించుకున్నారు. తిరిగి రెండేళ్లలోనే ఆయన మళ్లీ ప్లేటు ఫిరాయించారు. ప్రతిపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిపక్షాల ఇండియా ఫోరంలో చేరారు. ఆయనను ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తారని ఆశించారు. కాని అది జరగకపోవడంతో ఇండియా ఫోరం నుంచి బయటకెళ్లి, ఎన్డిఎ కూటమిలో చేరారు. ఇలా కప్పగెంతులేస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఉన్నారని నితిష్ కుమార్ పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాశ్వాన్ ఫ్యామిలీలో కమలం చిచ్చు

బీహార్‌లో పాశ్వాన్ కుటుంబానికి పేరుంది. నాలుగైదు దశాబ్దాల పాటు రామ్ విలాస్ పాశ్వాన్ జాతీయ రాజకీయల్లో ఉన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా, ఆయన కేంద్ర మంత్రిగా ఉండేవారు. అలాంటి కుటుంబంలో బిజెపి చిచ్చు పెట్టింది. అబ్బాయ్-బాబాయ్ మధ్య గొడవ పెట్టింది. ఎల్జేపి వ్యవస్థాపకుడు రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తరువాత ఆయన వారసత్వం కోసం కుమారుడు చిరాగ్, సోదరుడు పశుపతి పరాస్ తీవ్రంగా తలపడ్డారు. చివరికి పార్టీని పరాస్ చేజిక్కించుకున్నారు. చిరాగ్ కు ఎల్జేపి (రాం విలాస్), పశుపతికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎపి) పేర్లను ఎన్నికల సంఘం కేటాయించింది. పశుపతి కేంద్ర మంత్రిగా ఉండేవారు. పశుపతి పార్టీకే బిజెపి మద్దతు ఇచ్చింది. చిరాగ్ ను రామ్ విలాస్ పాశ్వాన్ బంగ్లాను కూడా ఖాళీ చేయమని కేంద్రం నోటీసు ఇచ్చింది. మళ్లీ ఏమైందో ఏమోగాని పశుపతి పార్టీకి బిజెపి ఒక్క సీటూ ఇవ్వకపోవడంతో ఆయన కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలిగారు. సొంతంగా పోటీ చేస్తామని ప్రకటించారు. రాగ్ పార్టీకి బిజెపి ఐదు సీట్లు ఇచ్చింది.

ప్రతిపత్తి ఎత్తేశాక కాశ్మీర్‌లో తొలి ఎన్నికలు

- బరిలో ఇద్దరు మాజీ సిఎంలు
- 'ఇండియా'గా జమ్మూలో కాంగ్రెస్, కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పోటీ
- జమ్మూలో కాంగ్రెస్‌కు పిడిపి మద్దతు
- లోయ నుంచి పారిపోయిన బిజెపి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్ముకాశ్మీర్ లో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆర్టికల్ 370ని రద్దు తరువాత జరిగే తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలకు ఐదు విడతల్లో నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 19 నుంచి మే 20 వరకు మొదటి ఐదు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడతలో ఉదంపూర్, రెండో విడత జమ్మూ, మూడో విడత అనంతనాగ్, నాలుగో విడత శ్రీనగర్, ఐదో విడతలో బారాముల్లాలో పోలింగ్ జరుగుతుంది. కాశ్మీర్ లోయలో ఉన్న మూడు స్థానాలకు పోటీ చేస్తున్న పిడిపి, జమ్మూ, ఉదంపూర్ స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతిస్తోంది. మొత్తం ఓట్లు 86.93 లక్షలు. పురుషులు: 44.35 లక్షలు, మహిళలు: 42.58 లక్షలు.

బరిలో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు

జమ్మూ కాశ్మీర్ లోక్‌సభ ఎన్నికల్లో ఇద్దరు మాజీ సిఎంలు పోటీ చేస్తున్నారు. అనంతనాగ్ నుంచి మాజీ సిఎం మెహబూబా ముఫ్తీ పోటీ చేయగా, బారాముల్లా నుంచి మరో మాజీ సిఎం ఒమర్ అబ్దుల్లా బరిలో ఉన్నారు. బారాముల్లాలో ఒమర్‌కు ప్రత్యర్థిగా పిడిపి నుంచి మాజీ రాజ్యసభ సభ్యుడు మీర్ ఫయాజ్ పోటీ చేస్తున్నారు. అనంత్‌నాగ్‌లో డిపిఎపి నేత, మాజీ సిఎం గులాంనబి ఆజాద్ పోటీ చేస్తారని ప్రచారం జరిగినా చివరి నిమిషంలో మనసు మార్చుకొని తమ పార్టీ తరపున మహ్మద్ సలీమ్‌ప్యారే పేరు ప్రకటించారు. ఇక్కడ నేషనల్ కాన్ఫరెన్స్ నేత మియాన్ అల్తాఫ్ అహ్మద్ పోటీ చేస్తున్నారు. అప్నీ పార్టీ తరపున జాఫర్ ఇక్బాల్ మన్హాస్ పోటీచేస్తున్నారు. ఉదంపూర్ లో బిజెపి తరపున కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఇండియా ఫోరంలో భాగంగా కాంగ్రెస్ తరపున చౌదర్ లాల్ సింగ్, డిపిఎపి తరపున జిఎం సరూరి పోటీ చేస్తున్నారు. జమ్మూ నుంచి బిజెపి తరపున జుగల్ కిషోర్ శర్మ, కాంగ్రెస్ నుంచి రామన్ భల్లాల పోటీ చేస్తున్నారు. శ్రీనగర్ లోక్‌సభ స్థానానికి పిడిపి తరపున యూత్ ప్రెసిడెంట్ వహీద్ పారా, నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి మాజీ మంత్రి అగా రుహుల్లా పోటీ చేస్తున్నారు. జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ఈసారి పోటీ చేయటం లేదు. ఆయన స్థానంలో రుహుల్లా పోటీ చేస్తున్నారు.

కాశ్మీర్ నుంచి పారిపోయిన బిజెపి 370 ఆర్టికల్ రద్దు తరువాత అభివృద్ధి అంటూ డాంభికాలు పలికిన బిజెపి కాశ్మీర్‌లో పోటీ నుంచి తప్పుకుంది. కాశ్మీర్ పరిధిలోని శ్రీనగర్, బారాముల్లా, అనంతనాగ్ లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థులను బిజెపి ప్రకటించలేదు. కాశ్మీర్ మొత్తాన్ని బహిరంగ జైలుగా మార్చేసింది. ఎన్నికలు ప్రకటించినప్పటి నుండి యువకులను అరెస్టు చేసే ప్రక్రియ ప్రారంభించింది.

రాష్ట్ర హోదా, అసెంబ్లీ ఎన్నికలు

జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలనేదే అక్కడి ప్రజల ప్రధాన డిమాండ్. అలాగే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరుతున్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత ప్రజల జీవితాల్లో పెద్దగా మార్పులు రాలేదు. నిర్బంధం అమలవుతోంది. ప్రజలు అభద్రతా భావంలో ఉన్నారు. అక్కడ యాపిల్‌ను పండించే రైతుల సమస్యలను పట్టించుకునే నాధుడే లేరు. దీంతో యాపిల్ రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 370 ఆర్టికల్ రద్దు తరువాత జమ్మూ కాశ్మీర్‌లో జిల్లా అభివృద్ధి మండళ్ల ఎన్నికలు జరిగాయి. ప్రతిపక్ష పార్టీల గుప్కార్ కూటమి విజయం సాధించింది.

పార్టీలు.. సర్దుబాట్లు

గత ఎన్నికల్లో జమ్మూ కాశ్మీర్‌లోని ఐదు స్థానాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ మూడు, బిజెపి రెండు స్థానాలను గెలుచుకున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా ఫోరంలో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పోటీ చేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో ఐదు, లడఖ్ లో ఒక ఎంపి మొత్తం ఆరు ఎంపి స్థానాల్లో కాశ్మీర్ పరిధిలోని శ్రీనగర్, బారాముల్లా, అనంతనాగ్ లో నేషనల్ కాన్ఫరెన్స్ పోటీ చేయగా, జమ్మూ పరిధిలోని జమ్మూ, ఉదంపూర్ లోనూ, కేంద్ర పాలిత ప్రాంతం లఢఖ్ లోనూ కాంగ్రెస్ పోటీ చేస్తోంది. బిజెపి, జమ్మూకాశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (జెకెపిడిపి), జమ్మూకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ (జెకెపిసి), డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డిపిఎపి) ఒంటరిగా పోటీ చేస్తున్నాయి.

నేడు తొలివిడత పోలింగ్

- 21 రాష్ట్రాల్లో 102 స్థానాలకు
- అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు కూడా

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన తొలివిడత పోలింగ్ ఘట్టానికి శుక్రవారం తెరలేవనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకుగాను 102 లోక్‌సభ స్థానాలు ఈ తొలి విడత పోలింగ్‌లో ఉన్నాయి. వీటిలో 73 జనరల్ కేటగిరిలో ఉండగా, 11 ఎస్‌టి, 18 ఎస్‌సి రిజర్వ్ స్థానాలున్నాయి. వీటితోబాటు అరుణాచల్ ప్రదేశ్ (60), సిక్కిం(32) అసెంబ్లీలకు కూడా పోలింగ్ నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తొలి విడతలో 16.63 కోట్ల మంది ఓటర్లు 1625 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించబోతున్నారు. వీరిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ మాజీ గవర్నరు తమిళిసై వంటి ప్రముఖులు ఉన్నారు. ఎన్నికలు సాఫీగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ తెలిపారు. 1.87 లక్షల పోలింగ్ కేంద్రాల్లో సుమారు 18 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. 50 శాతానికిపైగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, అన్ని కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు. 5 వేలకుపైగా కేంద్రాలను పూర్తిగా మహిళా అధికారులు, 1000 పోలింగ్ స్టేషన్లను వికలాంగులు నిర్వహించనున్నారు.. మొదటి దశ ఎన్నికలకు వెళ్తున్న 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తమిళనాడు (39), రాజస్థాన్ (12),ఉత్తర్‌ప్రదేశ్ (8), మధ్యప్రదేశ్ (6) మహారాష్ట్ర (5), అస్సాం (5), ఉత్తరాఖండ్ (5), బిహార్ (4), పశ్చిమ బెంగాల్ (3) అరుణాచల్ ప్రదేశ్(2), మణిపూర్ (2), మేఘాలయ(2) ఛత్తీస్‌గఢ్ (1), , మిజోరం(1), నాగాలాండ్ (1), సిక్కిం (1), త్రిపుర (1), అండమాన్ నికోబార్ (1), జమ్ముకాశ్మీర్ (1), లక్షద్వీప్(1), పుదుచ్చేరి (1) ఉన్నాయి.

మూటలు మోసిన కురుక్షేత్ర బిజెపి అభ్యర్థి జిందాల్

హర్యానా : లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ అభ్యర్థుల ప్రచారం వేడెక్కుతోంది. ఈ ప్రచారంలో అభ్యర్థులు పోటీపడి ఓటర్లను మెప్పించడానికి రకరకాల ఫీట్లు చేస్తున్నారు. హర్యానాలోని కురుక్షేత్ర లోక్‌సభ నియోజకవర్గం నుంచి జిందాల్ స్టీల్స్ ఛైర్మన్ నవీన్ జిందాల్ పోటీ చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా నవీన్ జిందాల్ స్థానిక మార్కెట్ యార్డులో మూటలు మోశారు. 50 కేజీల గోధుమ మూటను ఎత్తుకుని లారీలోకి లోడ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయనే స్వయంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. కాగా నవీన్ జిందాల్ 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై కురుక్షేత్ర నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇటీవలే ఆయన బిజెపిలోకి దూకారు. బిజెపి టికెట్‌పై ఈ ఎన్నికల్లో పోటీకి దిగారు.

యుపి బరిలో తెలంగాణ మహిళ

లక్నో : తెలంగాణ మహిళ ఉత్తరప్రదేశ్ ఎన్నికల బరిలో నిలిచారు. ఆమె పేరు శ్రీకళారెడ్డి. ఈమె ఉత్తర్‌ప్రదేశ్‌లోని జౌన్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆమె భర్త ధనుంజయ్‌సింగ్ మాజీ ఎంపి. అతనికి కిడ్నాప్, అక్రమవసూళ్ల కేసులో శిక్షపడడంతో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు. దీంతో తాజా ఎన్నికల్లో జౌన్‌పూర్ స్థానం నుంచి బిఎస్‌పి టికెట్‌పై ఆయన భార్య శ్రీకళారెడ్డి పోటీ చేశారు. ఈ స్థానానికి త్రిముఖ పోటీ నెలకొంది.

భాజపా తరపున కృపాశంకర్‌సింగ్, సమాజ్‌వాదీ పార్టీ తరపున బాబూసింగ్ కుశ్వాహ పోటీ చేశారు. ఉన్నారు. కాగా, శ్రీకళారెడ్డి తండ్రి కె.జితేందర్‌రెడ్డి. ఈయన నల్గొండ జిల్లా కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా, హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈమె తల్లి లలితారెడ్డి. గ్రామసర్పంచిగా చేశారు. శ్రీకళారెడ్డి ఇంటర్మీడియట్ చెన్నైలో చేయగా, బీకామ్ కోర్సు హైదరాబాద్‌లో పూర్తి చేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక అమెరికాకు వెళ్లి ఆర్కిటెక్చర్ ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు చేశారు.

శ్రీకళారెడ్డి పేరిట రూ.780 కోట్ల స్థిరాస్తులు, రూ.6.71 కోట్ల చరాస్తులు ఉన్నాయి. రూ.1.74 కోట్లు విలువైన ఆభరణాలున్నాయి. ధనుంజయ్ సింగ్ వద్ద రూ.3.56 కోట్ల చరాస్తులు, రూ.5.31 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి.

ఈమె 2017లో బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా సమక్షంలో తెలంగాణ బిజెపిలో కూడా చేరారు. 2021లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జిల్లా పంచాయతీ ఎన్నికల్లో గెలిచారు. జెడ్పీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు..



కలం బాణాలు

రాళ్లు, బూతుల చుట్టూనే కూటమి : వైసిపి

రాళ్లు, బూతుల చుట్టే
రాజకీయ రచ్చ?
ఎపి ప్రజల ప్రయోజనం
ఏమున్నది పిచ్చ!

ఇకనైనా కావొద్దా
ఓ సమగ్ర యోజన
ఓటేసే ముందుగనే
చేద్దామా యోచన

సిపిఎస్ గురించి ఒక మార్గం చూస్తాను..పవన్

మోడీ,బాబు మూగనోము
పవన్ గారి సినీగేము
అసలోళ్ళను కాపాడను
వాగ్దానపు వర్షము

రూటుమాపు వాళ్ళ నడిగి
సాగుతున్న బాటసారి
నోటిమాట నమ్మేరా
ఆపై మళ్ళీ సారి?

రాష్ట్రంలో నామినేషన్లు ప్రారంభం



మొదలైపోయిందిలే
తొలిగ నామినేషను
ఫలితాలొచ్చేదాకజి
గెలుపే మన నోషను

ప్రచారాలలో గొడవలు
రాకుండా కాషను
మంచివాళ్ళురావాలని
కోరుతున్న నేషను!

- తె.ర

ముఖ్యమంత్రుల సీమ

45 ఏళ్లలో 8 మంది సిఎంల ప్రాతినిధ్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రతియేటా కరువు కాటకాలకు గురయ్యే ప్రాంతం రాయలసీమ... ప్రతియేటా లక్షలాది మంది ప్రజలు ఉన్న ఊర్లో బతకలేక మహానగరాలకు వలసలు పొయేది ఎక్కడ నుండి అంటే రాయలసీమ... రాష్ట్రంలో ఎక్కువ అటవీ ప్రాంతం, ఖనిజ సంపద, నీటి వనరులు వుండేది కూడా రాయలసీమ ప్రాంతమే... దేశంలో అత్యున్నత పదవులు అయినా దేశ ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకరు వంటి వాటితోపాటు పూర్వపు ఉమ్మడి నాలుగు రాయలసీమ జిల్లాలు... ఒక్కొక్క జిల్లా నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 8 మంది ముఖ్యమంత్రులు 45 ఏళ్లకు పైగా ఈ ప్రాంతం వారే రాష్ట్రాన్ని పాలించారు. అంతటి ఘన చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో ఒక్క పెద్ద పరిశ్రమ లేకపోవడం వింతే. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ ప్రాంతానికి ఉక్కు ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు, ప్రత్యేక ప్యాకేజీ కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం చేస్తే ఆ చట్టాన్ని అమలు చేయించుకోలేని అసమర్ధత మూటగట్టుకున్నది కూడా ఈ ప్రాంత నేతలేనన్నది ప్రజల, ఉద్యమకారుల భావన.

నదులున్నా తాగునీటికి కటకటలే..

కృష్ణా, తుంగభద్ర, పెన్నా వంటి నదులున్నా సాగునీరు కాదుకదా ఇప్పటికీ తాగునీటి కోసం కటకటలాడాల్సిందే. తిరుమల, శ్రీకాళహస్తి, కడప పెద్ద దర్గా, వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, శ్రీశైలం, మంత్రాలయం, లేపాక్షి, శ్రీశైలం డ్యామ్, బెలూం ఏర్పడ్డ 1956 నుండి ఇప్పటి వరకు దాదాపు 45 ఏళ్లపాటు రాయలసీమ ప్రాంతం నుండే ముఖ్యమంత్రులుగా పాలించారు. మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 6 ఏళ్లు, ఆ తర్వాత కర్నూలు జిల్లాకు చెందిన దామోదరం సంజీవయ్య రెండేళ్లు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మూడేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. వీరు ముగ్గురు కేంద్రంలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. నీలం సంజీవరెడ్డి లోక్‌సభ స్పీకరుగా కూడా రెండు పర్యాయాలు, రాష్ట్రపతిగానూ పనిచేశారు. అలాగే గాంధీయేతర కుటుంబం నుండి ఐదేళ్లపాటు మొదటిసారి విజయవంతంగా దేశ ప్రధానిగా వ్యవహరించిన పివి నరసింహారావు ఇక్కడి నంద్యాల పార్లమెంటు సభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. కర్నూలు జిల్లా నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మూడేళ్లపాటు ముఖ్యమంత్రిగా చేశారు. అనంతరం కృష్ణా జిల్లాకు చెందిన ఎన్‌టి రామారావు ఏడేళ్లపాటు సిఎంగా రాయలసీమలోని తిరుపతి, హిందూపురం నియోజకవర్గాల నుండి ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత చిత్తూరు జిల్లాకు చెందిన నారా చంద్రబాబు నాయుడు 14 ఏళ్లపాటు, అదే జిల్లా నుంచి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మూడేళ్ల మూడు నెలలపాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కడప జిల్లా నుండి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఐదేళ్లపాటు, ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా వున్నారు. అలాగే ఎన్‌టి రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలుగానూ వ్యవహరించారు. ఇంతటి ఉద్దండులు ఏలిన ఈ



నీలం సంజీవరెడ్డి | దామోదరం సంజీవయ్య | కోట్ల విజయభాస్కరరెడ్డి | ఎన్.టి రారామావు
నారా చంద్రబాబునాయుడు | వై.ఎస్.రాజశేఖరరెడ్డి | ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి | వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి

కేవ్స్, పుట్టపర్తి వంటి కీలకమైన పర్యాటక ప్రాంతాలతో టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటుచేసి ఉపాధిని పెంచే కార్యక్రమాలను చేపట్టకపోవడం పాలకుల వైఫల్యమే. పాలకుల ఒంటెత్తుపోకడలు, ముఠా తగాదాల మూలంగానే ఈ ప్రాంతం అభివృద్ధికి దూరమవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పాలకపక్షంలో ముఖ్యమంత్రులుగానే కాదు.. ప్రతిపక్ష నేతలుగా ఈ ప్రాంతం నుండే సుదీర్ఘకాలంగా ప్రాతినిధ్యం వహించారు. మద్రాసు నుంచి విడిపోయి కర్నూలు రాజధాని కేంద్రంగా వుండే ఆంధ్ర రాష్ట్రంలో మూడేళ్లపాటు ముఖ్యమంత్రులుగా కోస్తా జిల్లాలకు చెందిన టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి వున్నా, ఉప ముఖ్యమంత్రిగా అనంతపురం జిల్లాకు చెందిన నీలం సంజీవరెడ్డి చక్రం తిప్పారు. తెలంగాణతో కలిపి ఆంధ్రప్రదేశ్ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడి వుండేందుకు కారణం పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే

కృష్ణా జిల్లాకు చెందిన ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రిగా వున్నపుడు రూపొందించిన తెలుగుగంగ, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి ప్రాజెక్టులు దశాబ్దాలుగా నిర్మాణం కొనసాగుతూనే వున్నాయి. ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తే రాయలసీమ ప్రాంతానికి శాశ్వతంగా కరువు నుంచి విముక్తి కలిగే అవకాశం వుంది. అలాగే ప్రభుత్వ రంగంలో ప్రతి జిల్లాలో భారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి దొరుకుతుంది. కొద్దో గొప్పో ఇప్పటికీ కొనసాగుతున్న ఫ్యాక్షనిజం అంతరిస్తుంది.

– బి. గోరంట్లప్ప

ఉద్దండుల కోట.. నరసరావుపేట

- వలస వాదులకూ ఆదరణ
- ఎన్నికల్లో మారుతున్న సమీకరణలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా నరసరావుపేట లోక్‌సభ పరిధిలో సామాజిక సమీకరణలు మారుతున్నాయి. 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి ఎంపిగా గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయలు ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. టిడిపి తరపున ఇదే నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసి ఓడిపోయిన రాయపాటి సాంబశివరావు వయోభారంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. దీంతో ఆయనకు టిడిపి టికెట్ ఇవ్వలేదు. వైసిపి నుంచి నెల్లూరు ఎమ్మెల్యే పి అనిల్‌కుమార్ యాదవ్ బరిలో నిలిచారు. ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ తరపున అలెగ్జాండర్ పోటీ చేస్తున్నారు. స్థానిక, స్థానికేతరులను ఆదరించిన ఘనత నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం ప్రజలకు దక్కింది. 1952 నుంచి 2019 వరకూ 15 సార్లు జరిగిన ఎన్నికల్లో తొమ్మిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టిడిపి, ఒకసారి వైసిపి, ఒకసారి ఇండిపెండెంటు గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో గెలిచిన ముగ్గురు మాజీ ఎంపిలు కాసు బ్రహ్మానందరెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రులుగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి రెండు సార్లు ఎంపిగా గెలిచి కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా కూడా పనిచేశారు. అంతకముందు ముఖ్యమంత్రిగా ఏడున్నరేళ్లపాటు పనిచేశారు. చివరిలో మహారాష్ట్ర గవర్నరుగా కూడా పనిచేశారు. నరసరావుపేట పార్లమెంటు పరిధిలోని నాగార్జున సాగర్, అమరావతి, కొటప్పకొండ, చేజర్ల, గుత్తికొండ బిలం వంటి పర్యాటక కేంద్రాలుగా ఉన్నాయి. పల్నాటి పౌరుషానికి పురిటి గడ్డగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన అభ్యర్థులు జాతీయ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. 1998లో కొణిజేటి రోశయ్య, 1999లో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి నరసరావుపేట ఎంపిలుగా గెలిచారు. 2004లో నెల్లూరుకు చెందిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 2009లో మోదుగుల వేణుగోపాలరెడ్డి, 2014లో రాయపాటి సాంబశివరావు గెలిచారు. 2019లో వైసిపి నుంచి లావు శ్రీకృష్ణ దేవరాయలు విజయం సాధించారు. నరసరావుపేట లోకసభ నియోజకవర్గం పరిధిలో నరసరావుపేట, వినుకొండ, గురజాల, మాచర్ల, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నెల్లూరు జిల్లాకు చెందిన నేదురుమల్లి, మేకపాటిని, డెల్టా ప్రాంతానికి చెందిన రోశయ్య, గుంటూరుకు చెందిన రాయపాటి సాంబశివరావు, లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ నియోజకవర్గంలో స్థానికేతరులుగా ఉన్నా ఎంపిగా గెలిచారు. 1951లో తొలిసారిగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చామలమడుగు రామయ్య చౌదరి కాంగ్రెస్ అభ్యర్థి నంద్యాల ఆంజనేయరెడ్డిపై గెలిచారు. 1957లో కాంగ్రెస్ అభ్యర్థి చేగిరెడ్డి బాలిరెడ్డి సిపిఐ అభ్యర్థి జి యలమందారెడ్డిపై విజయం సాధించారు. 1962లో సిపిఐ అభ్యర్థి జి యలమందారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి బాలిరెడ్డిపై గెలుపొందారు.

గెలుపోటములు

1971లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మద్ది సుదర్శనం స్వతంత్ర అభ్యర్థి వైవి నరసింహారావుపై గెలిచారు. 1977లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి బిఎల్‌డి అభ్యర్థి ఐ కోటిరెడ్డిపై గెలుపొందారు. 1980లో తిరిగి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి స్వతంత్ర అభ్యర్థి పోపూరి బ్రహ్మానందంపై గెలుపొందారు. 1984లో టిడిపి అభ్యర్థి కాటూరి నారాయణస్వామి కాంగ్రెస్ అభ్యర్థి కాసు బ్రహ్మానందరెడ్డిపై విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి కాసు కృష్ణారెడ్డి టిడిపి అభ్యర్థి పిడతల రంగారెడ్డిపై గెలుపొందగా, 1991లో కాసు కృష్ణారెడ్డి టిడిపి అభ్యర్థి అనిశెట్టి

పద్మావతిపై రెండోసారి గెలుపొందారు. 1996లో టిడిపి అభ్యర్థి కోట సైదయ్య చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి కాసు కృష్ణారెడ్డి పరాజయం పాలయ్యారు. 1998లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కొణిజేటి రోశయ్య టిడిపి అభ్యర్థి కోట సైదయ్యను ఓడించారు. 1999లో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టిడిపి అభ్యర్థి లాల్ జాన్‌బాషాపై గెలిచారు. 2004లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మేకపాటి రాజమోహన్ రెడ్డి టిడిపి అభ్యర్థి మద్ది లక్ష్మయ్యపై గెలుపొందారు. 2009లో టిడిపి అభ్యర్థి మోదుగుల వేణుగోపాలరెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వి బాలశౌరిపై గెలిచారు. 2014లో టిడిపి నుంచి పోటీ రాయపాటి సాంబశివరావు వైసిపి నుంచి పోటీ చేసిన ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డిపై గెలుపొందారు. 2019లో వైసిపి నుంచి పోటీ చేసిన లావు శ్రీకృష్ణదేవరాయలు టిడిపి అభ్యర్థి రాయపాటి సాంబశివరావుపై గత 70 ఏళ్లలో ఎవరికీ రాని ఆధిక్యతతో గెలుపొందారు. శ్రీకృష్ణదేవరాయలుకు 1,53,979 ఓట్ల ఆధిక్యత లభించింది.

ఒపిఒలుగా కార్యదర్శులు!

ఇంకు పెట్టడం, జాబితా చూడడానికే..

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులను ఎన్నికల విధుల్లో వినియోగించుకునేందుకు చకచకా ఏర్పాటు జరుగుతున్నాయి. ఇప్పటికే అనేక మందికి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే వారిని కేవలం ఒపిఒలు (అదర్‌దెన్ పోలింగ్ ఆఫీసర్స్)గా మాత్రమే వినియోగించుకునేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కొంత మందికి శిక్షణ కూడా ఇస్తుండడంతోపాటు కార్యదర్శుల సామాజిక గ్రూపుల్లో దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. వాస్తవానికి ఉపాధ్యాయుల స్థానంలో వలంటీర్లను, కార్యదర్శులను పూర్తి స్థాయిలో ఎన్నికల విధుల్లో వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినప్పటికీ వలంటీర్ల వినియోగంపై ఎన్నికల కమిషన్, న్యాయ స్థానాలను అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లపై వెనకడుగు వేయాల్సి వచ్చింది. అయితే కార్యదర్శులు మాత్రం అధికారికంగా ఉద్యోగులుగా ఉండడంతో వారి సేవలను ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకు నిర్ణయించింది. అయితే పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులను మాత్రమే వినియోగించుకుంటూ గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులను సాధారణ విధులకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. కేవలం ఓటర్ల వేలుపై ఇంకు గుర్తు వేయడం, వారి ఓటర్ స్లిప్పులను ఓటర్ల జాబితాలో ఉన్నాయా లేదా అన్నది చూడడం వంటి అంశాలకు మాత్రమే వారిని పరిమితం చేయనున్నారు.

ఉత్సాహంగా కార్యదర్శులు

ఇప్పుడు కార్యదర్శులుగా నియమితులైన వారికి ఇదే తొలి ఎన్నికల విధులు కావడంతో వారంతా ఉత్సాహంగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఓటర్లుగానే ఉన్న తమకు ఎన్నికల నిర్వహణ విధుల్లో భాగస్వామ్యులు కావడం కొత్త అనుభూతినిస్తోందని పలువురు గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు చెబుతున్నారు.

కాకినాడలో ఉత్కంఠ పోరు

- జనసేనపై ముద్రగడ ప్రభావం ఎంత?
- పదేళ్ల తర్వాత బరిలోకి పల్లంరాజు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

కాకినాడ జిల్లాలో పిఠాపురం కేంద్రంగా జనసేన పవనాలు వీస్తున్నాయి. పవనాలు కాదు తుపానులైనా అడ్డుకుంటామంటూ అధికార వైసిపి ముద్రగడ పద్మనాభంను రంగంలోకి దింపింది. వీరిద్దరూ జిల్లా రాజకీయాల్లో ఓ సామాజిక వర్గాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది. మరో పక్క కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు పదేళ్ల అనంతరం తిరిగి బరిలోకి దిగుతున్నారు. ఆయన ఎవరి ఓట్లను కొల్లగొడతారోననే చర్చ సర్వత్రా జరుగుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ ఏడు నియోజకవర్గాల్లో ఆరు స్థానాలను వైసిపి కైవశం చేసుకుంది. పెద్దాపురంలో మాత్రమే టిడిపి గెలిచింది.

కాకినాడ జిల్లాలో కాకినాడ పార్లమెంటు స్థానం, 7 అసెంబ్లీ స్థానాలున్నాయి. ముఖ్యంగా కాకినాడ పార్లమెంటు స్థానం నుంచి త్రిముఖ పోరు నెలకొంది. అధికార వైసిపి నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్త చలమలశెట్టి సునీల్ పోటీలో ఉన్నారు. ఈయన గత మూడుసార్లు మూడు పార్టీల నుంచి ఎంపిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నాలుగోసారి ఇదే స్థానం నుంచి ఆయన వైసిపి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇదే స్థానం నుంచి జనసేన నేత తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఎన్నికల బరిలోకి దిగడం కొత్త, యువతకు తప్ప మిగిలిన వర్గాలకు దగ్గర కాలేకపోవడం ప్రతికూల అంశం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజును ఆ పార్టీ అధిష్టానం ఇటీవలే ప్రకటించింది. ఆయన మూడుసార్లు ఎంపిగా నెగ్గి, రెండుసార్లు కేంద్ర మంత్రిగా సేవలు అందించారు. సౌమ్యుడుగా, అభివృద్ధి ప్రదాతగా పేరు ఉంది. పార్లమెంటు పరిధిలో బంధు వర్గం కూడా ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి.

అందరి చూపు.. పిఠాపురం వైపు

పిఠాపురం అసెంబ్లీ నియోజవర్గం నుంచి జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్నారు. అయితే పవన్ గెలుపు అంత సులభం కాదని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వైసిపి నుంచి కాకినాడ ఎంపి వంగా గీత పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.

తెరమీదికి ముద్రగడ

వైసిపి నేత ముద్రగడ పద్మనాభం పోటీలో లేకున్నప్పటికీ చరిష్మాను అడ్డుపెట్టుకుని కాపు సామాజిక తరగతికి చెందిన ఓట్లను కొల్లగొట్టాలని, లేదా ఓటర్లు జనసేన వైపు మరలకుండా చూడాలనే ఎత్తుగడలో వైసిపి ఉంది. అందులో భాగంగా ఇప్పటికే ముద్రగడ ఆయా నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులను కలుస్తున్నారు.

ముగ్గురు సిట్టింగులకు దక్కని టికెట్లు

జిల్లాలో ఒక్క ముద్రగడపైనే ఆధార పడకుండా వైసిపి గెలుపు కోసం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. అందులో భాగంగానే అభ్యర్థులను సైతం మార్పు చేసింది. జిల్లాలో ఏకంగా ముగ్గురు సిట్టింగులను ఈ ఎన్నికల్లో పక్కన బెట్టింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను తొలగించి మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు సీటు కేటాయించింది. పిఠాపురం సిట్టింగు ఎమ్మెల్యే పెండెం దొరబాబును కాదని కాకినాడ ఎంపి వంగా గీతను ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలోకి దింపింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును పక్కనబెట్టి మాజీ మంత్రి తోట నరసింహంకు సీటును కేటాయించింది.

అనంతబాబుపై వ్యతిరేకత

ప్రత్తిపాడులో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు వైసిపి నుంచి బరిలో ఉన్నారు. టిడిపి నుంచి సమీప బంధువైన వరుపుల రాజా భార్య సత్యప్రభ పోటీ చేస్తున్నారు. ఇక్కడ సిట్టింగు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌పై తీవ్రస్థాయిలో అవినీతి, అక్రమాలు బయటపడటంతో అధిష్టానం అతన్ని కాదని సుబ్బారావుకు అవకాశం ఇచ్చింది. అయితే దళిత యువకుడ్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుకు సుబ్బారావు సమీప బంధువుగా ఉన్నారు. అనంతబాబే అక్కడ అన్నీ తానై చూడటంతో వ్యతిరేకత ఉంది. స్థానికులను కాదని అనంతబాబుకు పెత్తనం ఇవ్వడాన్ని స్థానిక నాయకులు వ్యతిరేకిస్తున్నారు. అనంతబాబు వల్ల దళిత వర్గం దూరమవుతుందనే సాంకేతాలు కనిపిస్తున్నాయి.

జగ్గంపేటలో మాజీ మంత్రి తోట నరసింహం వైసిపి నుంచి పోటీలో నిలవగా, కూటమి అభ్యర్థిగా టిడిపి నేత జ్యోతుల నెహ్రూ బరిలో ఉన్నారు. గ్రూపు తగాదాలు తోటకు తలపోటుగా మారాయి. సిట్టింగు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వర్గం తోట నరసింహంకు పూర్తిగా సహకరించని పరిస్థితి నెలకొంది. పెద్దాపురంలో మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మూడోసారి కూటమి అభ్యర్థిగా పోటీలో ఉండగా, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దవులూరి దొరబాబు వైసిపి నుంచి బరిలో ఉన్నారు.

భంగపడ్డ యనమల కృష్ణుడు

కాకినాడ సిటీలో అధికార పక్షం నుంచి సిట్టింగు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బరిలో ఉండగా, కూటమి అభ్యర్థిగా టిడిపి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పోటీ చేస్తున్నారు. మరోవైపు కూటమి అభ్యర్థిగా ఉన్న కొండబాబు ద్వారంపూడిని బలంగా ఢీకొట్టలేని పరిస్థితుల్లో ఉన్నారని టిడిపి, జనసేన, బిజెపి శ్రేణుల్లో కనిపిస్తోంది. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైసిపి నుంచి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బరిలో ఉన్నారు. జనసేన నుంచి కూటమి అభ్యర్థిగా పంతం నానాజీ పోటీ చేస్తున్నారు. తుని నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా మంత్రి దాడిశెట్టి రాజా బరిలో ఉండగా, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య తొలిసారి పోటీలో నిలుచున్నారు. అయితే యనమల సోదరుడు యనమల కృష్ణుడు టిడిపి టికెట్‌ను ఆశించి భంగపడ్డారు. ఆయన అసంతృప్తితో ఉన్నారు.

రాష్ట్రానికి మీరేం చేశారు?

చంద్రబాబుకి పేర్నినాని ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడుతోపాటు పవన్‌కల్యాణ్, బిజెపి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బందరు సభలో పవన్‌కల్యాణ్, చంద్రబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. శిరోముండనం ఘటన టిడిపి హయాంలో తోట త్రిమూర్తులు టిడిపిలో వున్నప్పుడే జరిగిందనే అంశాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. రాజకీయాలకు ఇప్పుడిప్పుడే వచ్చిన తన కుమారుని పట్ల కూడా అనుచితంగా మాట్లాడి వారి వయసుకు వున్న గౌరవాన్ని పోగొట్టుకున్నారని విమర్శించారు. తాను అవినీతి పరుడో, కొల్లు రవీంద్ర ఎంత అవినీతి పరుడో రాష్ట్ర ప్రజలకు తెలుసునని అన్నారు.

1999 ఎన్నికలు - బిజెపితో దోస్తీ - మూడుముక్కలైన టిడిపి

చంద్రబాబు నాయుడు | వై.ఎస్. రాజశేఖరరెడ్డి | ఎన్. ఇంద్రసేనా రెడ్డి | నోముల నరసింహయ్య

1985, 1989, 1994 ఎన్నికల్లో ఎన్‌టిఆర్.. వామపక్షాలను మిత్రులుగా చేసుకుని కాంగ్రెస్‌తో తలపడ్డారు. ఎన్‌టిఆర్ ప్రవచించిన లౌకికవాద విధానాలకు తిలోదకాలిచ్చి 1999 ఎన్నికల్లో చంద్రబాబు బిజెపితో జతకట్టి పోటీ చేశారు. 1996లో ఎన్‌టి రామారావు మరణించారు. 1999 ఎన్నికల నాటికి టిడిపి మూడు పార్టీలుగా చీలిపోయింది. ఒకటి : అధికారయుత టిడిపికాగా.. రెండోది : ఎన్‌టిఆర్ భార్య లక్ష్మీపార్వతి 'ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీ (ఎల్‌పి)'ని స్థాపించి ఎన్నికల గోదాలోకి దిగారు. మూడోది : బావ చంద్రబాబును వదిలేసి ఎన్‌టిఆర్ కుమారుడు హరికృష్ణ 'అన్న తెలుగుదేశం' పార్టీని స్థాపించి వామపక్షాలతో కలిసి పోటీ చేశారు. ఎన్‌టిఆర్ పదవీచ్యుతుడు అయ్యాక శాసనసభ్యుడుకాని హరికృష్ణను తన మంత్రివర్గంలో రవాణా శాఖ మంత్రిగా నియమించారు చంద్రబాబు. ఆరు నెలల్లోనే తిరిగి శాసనసభకు ఎన్నికయ్యేందుకు హరికృష్ణకు అవకాశం కల్పించకపోవడంతో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ పరిస్థితుల్లో హరికృష్ణ తన బావ చేతిలోకి వెళ్లిన తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో విస్తృత ప్రచారం చేశారు. అయితే లక్ష్మీపార్వతి, హరికృష్ణల రెండు పార్టీలనూ రాష్ట్ర ప్రజలు ఆదరించలేదు. లక్ష్మీపార్వతి, హరికృష్ణ సైతం ఓడిపోయారు. వారి పార్టీలకు ఒక్క సీటు కూడా రాలేదు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ప్రతిపక్ష నేతగా రాజశేఖరరెడ్డి

1999 ఎన్నికల్లో 269 స్థానాలకు పోటీ చేసిన చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ 180 స్థానాల్లో విజయం సాధించింది. ఈ పార్టీ 1,46,13,307 (43.87 శాతం) ఓట్లు సాధించింది. కాంగ్రెస్ 293 స్థానాలకు పోటీ చేసి 91 స్థానాల్లో గెలుపొందింది. ఈ పార్టీకి 1,35,26,309 (40.61 శాతం) ఓట్లు లభించాయి. ఈ రెండు పార్టీలకూ మధ్య తేడా కేవలం 3.26 శాతం మాత్రమే. టిడిపితో పొత్తుతో బిజెపి 24 సీట్లకు పోటీ చేసి 12 స్థానాలు గెలిచింది. 12,23,481 (3.67 శాతం) ఓట్లు పొందింది. సిపిఎం 48 స్థానాల్లో పోటీ చేసి 2 స్థానాలు గెలుపొందింది. ఈ పార్టీకి 5,67,761 (1.70 శాతం) ఓట్లు వచ్చాయి. ఎంఐఎం 5 స్థానాలకు పోటీ చేసి 4 స్థానాల్లో విజయం సాధించింది. దానికి 3,60,211 (1.08 శాతం) ఓట్లు లభించాయి. ఇండిపెండెంట్లు 762 మంది పోటీ చేసి 5 సీట్లలో గెలిచారు. వీరికి 15,93,015 (4.78 శాతం) ఓట్లు వచ్చాయి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతిపక్ష నాయకుడుగా కాంగ్రెస్ నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఎన్నికయ్యారు. బిజెపి శాసనసభా పక్ష నేతగా నల్లు ఇంద్రసేనారెడ్డి, సిపిఐ(ఎం) శాసనసభా పక్ష నేతగా నోముల నరసింహయ్య ఎన్నికయ్యారు.

ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వం

ఈ కాలంలో రాష్ట్రంలో చంద్రబాబు పాలన ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుంది. నాయకుల, అధికార యంత్రాంగంలో అవినీతికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమాలు సాగాయి. తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడటం, రైతులను ఆదుకునే చర్యలు చేపట్టకపోవడం, ప్రపంచ బ్యాంక్‌తో ఒప్పందాల్లో భాగంగా విద్యుత్తు ఛార్జీలను భారీగా పెంచడంతో 2000 సంవత్సరం ఆగస్టులో వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం రాజుకుంది. ఈ ఉద్యమంలో 25 వేల మంది కార్యకర్తలపై కేసులు పెట్టారు. కాంగ్రెస్‌కు చెందిన 90 మంది ఎమ్మెల్యేలు, వామపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు నిరాహారదీక్షలు నిర్వహించారు. దానిలో భాగంగానే ఆగస్టు 28న వామపక్షాలు, కాంగ్రెస్ వేర్వేరుగా 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమం చేపట్టాయి. ఇనుప కంచెలు, బారికేడ్లు ఏర్పాటుచేసినా ప్రదర్శకులు ముందుకు కదిలారు. పోలీసులు గుర్రపు దళాలతో ప్రజలపై దౌడు తీస్తూ దారుణమైన లాఠీఛార్జి జరిపారు. జల ఫిరంగులను, భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. అయినా ప్రదర్శకుల దీక్ష సడలకపోవడంతో బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ దిగువకు రాగానే పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరు సిపిఎం, ఒక కాంగ్రెస్ కార్యకర్తను చంపివేశారు. వందలాది మంది గాయపడ్డారు. దీంతో చంద్రబాబు పాలనకు కౌంట్‌డౌన్ ప్రారంభం అయినట్లయింది.

టిడిపి నుంచి కెసిఆర్ రాజీనామా

తరువాత కాలంలో.. 2001 ఏప్రిల్ 27న శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. చంద్రశేఖరరావు (కెసిఆర్) తన పదవికి, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. అదే రోజు తెలంగాణ రాష్ట్ర సమితి అనే పార్టీ పెట్టారు. అక్కణ్ణుంచి మలిదశ ప్రత్యేక తెలంగాణా ఉద్యమం చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

– యు. రామకృష్ణ

1999 ఎన్నికల్లో పార్టీల బలాబలాలు

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
తెలుగుదేశం	269	180	1,46,13,307	43.67
కాంగ్రెస్	293	91	1,35,26,309	40.61
బిజెపి	24	12	12,23,481	3.67
సిపిఐ(ఎం)	48	02	5,67,761	1.08
ఇండిపెండెంట్లు	762	05	15,93,015	4.78

సంపాదకీయం

విద్వేష ప్రసంగాలు

పదేళ్ళ పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ... తాను ప్రజలకు చేసిన మేలు ఇదీ అని ఘనంగా చెప్పుకోలేకపోతోంది. అందుకనే మతాన్ని, దానికి సంబంధించిన ఉద్వేగ అంశాలను ఈ సార్వత్రిక ఎన్నికల్లో వాడుకోవటానికి బరి తెగిస్తోంది! ఈ ధోరణి మన రాజ్యాంగ స్ఫూర్తికి, ఎన్నికల నిబంధనావళికి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకూ పూర్తి విరుద్ధం. ఎన్నికల సమరాంగణంలో నిలబడి, ప్రజల మద్దతును ఆశిస్తున్న వేళ ... తాము గత ఎన్నికల్లో చెప్పిందేమిటో, పదేళ్ల పాలనలో చేసిందేమిటో వివరంగా చెప్పుకొని, తీర్పును కోరటం అధికార పక్షం నాగరిక లక్షణం. కానీ, బిజెపి ఏ ఎన్నికల్లోనూ ఈ తరహా ప్రజాస్వామిక తీరును ప్రదర్శించలేదు. ఎందుకంటే- ఆ పార్టీ చేసిన వాగ్దానాలకు, చేపట్టిన చర్యలకూ అసలు పొంతన కుదరదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలూ, 2022 నాటికే రైతులకు రెట్టింపు ఆదాయం వంటి ఎన్నో వాగ్దానాలు ఏమాత్రమూ ఆచరణకు నోచుకోలేదు. పైగా ఆ లక్ష్యాలకు విరుద్ధమైన విధానాలను అవలంబించటంతో పరిస్థితి మరింత దారుణంగా దిగజారిపోయింది. పదేళ్ల ముందుకన్నా ఇప్పుడు నిరుద్యోగం పెచ్చు పెరిగింది. ప్రోత్సాహకాలకు మంగళం పాడి, నల్ల చట్టాలను రంగంలోకి తేవడంతో వ్యవసాయరంగం ఉన్న కొద్దిపాటి భరోసాను కూడా కోల్పోయింది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్టీ విధింపూ వంటి చర్యలూ కోట్లాది మంది ప్రజల జీవన స్థితిగతులను దెబ్బ తీశాయి తప్ప, ఇసుమంతైనా ఉద్ధరించింది లేదు.

ఈ నేపథ్యంలో పదేళ్ల మోడీ ప్రభుత్వం చెప్పుకోవటానికి ఏ ఘనతా లేక, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పలేక, ఎప్పటివలె ఎన్నికల్లోకి మతాన్ని లాక్కొస్తోంది. కనీస వివేచన, విచక్షణ లేకుండా అవాకులూ చెవాకులతో ప్రచారానికి దిగుతోంది. "మతమనేది వ్యక్తిగతం. దానిని వీధుల్లోకి, విమర్శల్లోకి తీసుకురాకండి." అని దేశ సర్వోన్నత న్యాయస్థానం గతంలో గట్టిగా నిర్దేశించినా; ఎన్నికల నిబంధనావళిలో స్పష్టంగా రాసుకున్నా బిజెపికి పట్టడం లేదు. సామరస్యాన్ని, సంయమనాన్ని పాటించాల్సిన ప్రధాని స్థాయి వ్యక్తి విద్వేష ప్రచారానికి ఆరంభం పలకటం మరింత దారుణం. మోడీ ఏ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నా- రాముడిని రాజకీయ దినుసుగా వాడబూనటం గర్హనీయం. రాముడికి ఆలయం కట్టనీయకుండా కాంగ్రెస్, ఆర్జేడీ అడ్డుకున్నాయంటూ బీహారులో ఏప్రిల్ 7న జరిగిన సభలో అసత్యాలు వల్లించారు. అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన తమ పార్టీ సభ్యులను కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు బహిష్కరించాయంటూ ఉత్తర ప్రదేశ్ సభలో పచ్చి అబద్ధాలు వండి వార్చారు. ఆ పార్టీలు రాముడిని అవమానించాయంటూ ప్రజలను రెచ్చగొట్టే విద్వేష ప్రసంగం చేశారు. అనేక రాష్ట్రాల్లో మోడీ ఈ పద్ధతిలోనే ప్రచారం సాగించటం తీవ్ర అభ్యంతరకరం. ప్రజల దైనందిన సమస్యలను పక్కనపెట్టి, సెంటిమెంట్లతో మద్దతు కూడగట్టాలనుకోవడం క్షమార్హం కాని మోసకారితనం.

మోడీ దురుద్దేశపూర్వకంగా ఈ రెచ్చగొట్టుడు ధోరణిని కొనసాగిస్తున్నా ఎన్నికల సంఘం ఇప్పటివరకూ ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఎన్నికల నియమావళిని గమనించినా, భారత శిక్షాస్మృతిని చూసినా మత సంబంధమైన అంశాలతో విద్వేష ప్రసంగాలు చేయటం శిక్షార్హమైన నేరం. పదే పదే ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘిస్తున్న మోడీపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా, ఇంతవరకూ అధికారుల నుంచి తగిన స్పందన లేదు. 2019 ఎన్నికల సమయంలోనూ మోడీ, కాషాయ పరివారపు విద్వేష ప్రచారంపై సిపిఎం ఫిర్యాదు చేసినా ఏ చర్యలూ తీసుకోలేదు. అప్పటి కమిషన్ ముగ్గురు సభ్యుల్లో ఒకరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డా, మిగతా ఇద్దరూ అధికార పక్షానికి దాసోహమైనట్లు తరువాతి కాలంలో వార్తలొచ్చాయి. పార్టీలకతీతంగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్ అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తే అది ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తుంది. ప్రస్తుత కమిషన్ అధికారానికి దాసోహమవుతుందా? లేక ప్రజాస్వామ్యానికి పహారాగా నిలుస్తుందా? అన్నది దాని ఆచరణ బట్టే తేలుతుంది.

భిన్నాభిప్రాయాలు లేకుండా సజీవమైన, శక్తివంతమైన ఉద్యమం వుండదని నా విశ్వాసం. సర్వ సంపూర్ణమైన ఏకాభిప్రాయం స్మశానంలో మాత్రమే సాధ్యమౌతుంది.

- జోసెఫ్ స్టాలిన్

మరోసారి అవకాశమిస్తే...ఇక అంతే !



సమకాలీన రాజకీయ పరిస్థితులు చూసి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఇలా వ్యాఖ్యానించారు- "మోడీ కాకపోతే ఇంకెవరూ? అని అడుగుతారు. అయిదేళ్లలో ఆయన ఏం చేశారో చూడండి. ఐదు కోట్ల ఉద్యోగాలు గాలికెగిరిపోయాయి. రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం, కాగ్, లోక్‌పాల్, సిబిఐ, మీడియా అన్నిటినీ వశపరుచుకున్నారు. మూక దాడులు, ద్వేషపూరిత అబద్ధపు ప్రకటనలు ప్రధాన వార్తా స్రవంతిలో, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. వీరికే గనక ఈ దేశ ప్రజలు మరోసారి అవకాశమిస్తే ఇక అంతే-నాగరికత అంతరించినట్టే!" మనమెంత ప్రమాదకరమైన వాతావరణంలో ఉన్నామన్నది ఇలాంటి వివేకవంతుల మాటల్లోంచి గ్రహించుకోవాలి!

కామెంట్స్

డా॥ దేవరాజు మహారాజు

పుస్తకాల గది నుంచి వచ్చేవారే ఈ సమాజానికి అవసరం. పూజ గది నుంచి వచ్చేవారు బహుశా... పునర్జన్మలకు మాత్రమే అవసరమేమో.

- ఆర్థర్ జాన్, అమెరికన్ సైకియాట్రిస్ట్.

పుస్తకాల గురించి, పుస్తకాలు చదవడంలోని ఆనందం గురించి భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ ఇలా రాసుకున్నారు-పుస్తక ప్రేమికులకు అధ్యయనశీలురకు ఆయన మాటలు తప్పకుండా స్ఫూర్తినిస్తాయి-"నేను చదివిన పుస్తకంలోని తత్వాన్ని బయటకు తీస్తాను. అవసరం లేని భాగాన్ని వదిలేస్తాను. 'జ్ఞానం అనేది శక్తి. ఆనంద సాధనం'-అన్న హైంజలైట్ మాట అక్షరసత్యం! పుస్తకం చదవడం మొదలు పెట్టగానే నాకు అనంతమైన సుఖానుభవం కలుగుతుంది. చదవటంలో నాకు కలిగే ఆనందం వర్ణింపనలవి కానిది...నాకు బాధ కలిగించే విషయమేమంటే మన వాళ్లు చాలా మంది చదవరు. అధ్యయనం లేకుండా జ్ఞానం...జ్ఞానం లేకుండా శక్తీ రావు. ఎవరితోనైనా తలపడే ముందు మనం జ్ఞానంతో, శక్తి యుక్తులతో సమర్థవంతంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ చదివే అభిరుచిని పెంచుకోవాలి. నేను వెనిస్ నుంచి బొంబాయికి ప్రయాణిస్తూ ఆరు రోజుల్లో ఎనిమిది వేల పేజీలు చదివాను. మరోసారి అరవై నాలుగు గంటలపాటు ఒక పుస్తకాన్ని అది పూర్తయ్యే వరకు చదివాను.

"పుస్తకాలు దీపాల వంటివి. అవి మనో మాలిన్యమనే చీకటిని తొలగిస్తాయి. నేను నా భార్యా బిడ్డల కంటే పుస్తకాలనే ఎక్కువగా ప్రేమిస్తాను. విద్యావికాసాలు పొందాలి. విద్యా వికాసాల్ని ఇతరులకు అందించాలి. అంతర్గతంగా ఆందోళన పడాలి. మార్పు కోసం ఆందోళన చేయాలి. సంఘటిత పడాలి. సమైక్యంగా ముందుకు సాగాలి. ఒక దేవాలయ నిర్మాణం కంటే ఒక గ్రంథాలయ నిర్మాణం ఎన్నో లక్షల రెట్లు గొప్పది. దేవాలయం ముష్టివాళ్ళను సృష్టిస్తే గ్రంథాలయం దేశాన్ని మార్చే మహావీరుల్ని సృష్టిస్తుంది-" అన్నారు డా.బి.ఆర్. అంబేద్కర్. మానవీయ విలువల దృష్టి కోణంతో అంబేద్కర్ కృషిని బేరీజు వేస్తే అది ఇలా ఉంటుంది.

"ఇన్సానోంకొ గులాం బనాకర్/హజారోం బాదుషా బనే హై/లేకిన్ గులామోంకొ ఇన్సాన్ బనాకర్/ సిర్ఫ్ ఏక్ హి బాద్‌షా బనే హై-ఓ హై డా॥ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్!"

అంటే అర్థం మనుషుల్ని బానిసలుగా చేసి, వేల మంది చక్రవర్తులయ్యారు. కానీ, బానిసల్ని మనుషులుగా చేసిన చక్రవర్తి ఒకే ఒక్కడు-ఆయన డా॥ భీమ్‌రావ్ రామ్ జీ అంబేద్కర్. ఆయన విద్యార్హతలు కూడా ఒకసారి గమనిద్దాం. ఫాసిస్టులకు అంబేద్కర్ అంటే పడదు. కాలాలకు అతీతంగా అత్యున్నతమైన విద్యనార్జించిన ఆర్థికవేత్త అయ్యాడని ఉడుకుమోతుతనం! ఆయన విద్యార్హతలు ఏ కాలంలోనైనా ఆశ్చర్యం కలిగించేవే! 1917 పిహెచ్‌డి-కొలంబియా యూనివర్సిటీ. 1921ఎమ్మెస్సి-లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్. 1922- బారిస్టర్ ఎట్ లా. గ్రేట్ బ్రిటన్, లండన్. 1923-డి.యస్సి-లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్. 1952-గౌరవ డాక్టరేట్ ఎల్.ఎల్.డి-కొలంబియా యూనివర్సిటీ. 1953-డి.లిట్:గౌరవ డాక్టరేట్-ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు. రెండు మాస్టర్స్ డిగ్రీలు, నాలుగు డాక్టరేట్లు. ఇన్ని డిగ్రీలు ఇంత జ్ఞాన సంపదను సంపాదించిన భారతీయుడిగా గుర్తించి, న్యూయార్క్ కొలంబియా యూనివర్సిటీలో ఆయన విగ్రహం ప్రతిష్టించారు. అదీ ఎందుకూ? జ్ఞాన సంకేతంగా- సింబల్ ఆఫ్ నాలెడ్జ్‌గా గౌరవించారు.

చదువుకు, విజ్ఞతకు, సమాజోద్ధరణకూ అవినాభావ సంబంధం ఉంది. బ్రిటీష్ రాజనీతిజ్ఞుడు ఫ్రాన్సిస్ బేకన్ చెప్పిన ఈ మాట ఎంత గొప్పగా ఉందో ఆలోచించండి. "చదువు- మనిషిని పూర్తిగా మానవుడిగా తీర్చి దిద్దుతుంది. చర్చ-సంసిద్ధ మానవుడిగా తీర్చి దిద్దుతుంది. రాత-కచ్చితమైన మానవుడిగా తీర్చి దిద్దుతుంది". చదువుకున్న వివేకవంతులకే సోషలిజం విలువ తెలుస్తుంది. చదువు, సంస్కారం, మానవీయ విలువలపై గౌరవభావం లేని పాలకులు కేవలం జంగిల్ రాజ్యం స్థిరపరిచి, ఆటవిక, పాలనను అందించగలరు. ప్రజల బతుకులు అభద్రతలోకి తోసేయగలరు. సోషలిజం-సమాజంలో చాలా మార్పులు తెస్తుందనీ, ప్రజలందరికీ అవసరమైన ఆహారం, గృహ వసతి, అందిస్తుందని, మానవుల మధ్య వర్గ విభజనలు తొలగిస్తుందని, ఆర్థిక వ్యవస్థలో ప్రజాతంత్రయుతమైన ప్రణాళికను ప్రవేశపెడుతుందని, ప్రపంచ శాంతి సమైక్యతల్ని నెలకొల్పుతుందని-ప్రసిద్ధ సామాజిక ఆర్థికవేత్తలంతా చెపుతూనే ఉన్నారు. అయితే ఇవన్నీ ఊరికే రావని క్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించి పారేయాలని కూడా చెప్పారు. కానీ నేటి ప్రభుత్వ పెద్దలు ఏం చేస్తున్నారూ? ప్రజా సంక్షేమం పట్టించు కోకుండా కార్పోరేట్ల దగ్గర పాలేర్లలా పడి ఉన్నారు.

ఇలాంటి పరిస్థితిని గమనించి కాబోలు మావో జెడుంగ్ ఓ మాట చెప్పారు-"అధ్యయనం లేకుండా ఒక పరిష్కారం కనుగొనాలనుకునేవారు లేక ఒక ఆలోచనకు రావాలనుకునేవారు కేవలం తెలివి తక్కువ దద్దమ్మలు మినహా మరేమీ కాదు. అలా చేస్తే సరైన పరిష్కారం లభించడం కానీ, మంచి ఆలోచనకు రావడం గానీ, జరగదన్న విషయం తెలుసుకోవాలి!" తమ మూర్ఖపు ప్రకటనలతో జనాన్ని వెనక్కి నడిపించాలని ప్రయత్నిస్తున్న నేటి మన ఆలోచన లేని పాలకులకు అధ్యయనం- ఆలోచన వంటి మాటలకు అర్థాలు తెలుస్తాయా? అదేమిటో మన దేశంలోనే చిత్ర విచిత్రమైన సంఘటనలు జరుగుతుంటాయి. పెట్రోల్ బంక్‌లో పని చేసిన అంబానీ కోట్ల రూపాయలకు అధిపతి అయ్యాడు. రైల్వే- స్టేషన్‌లో చాయ్ అమ్ముకున్నానన్నవాడు దేశానికి ప్రధాని అయ్యాడు. కానీ, చూడండి - క్లాసులోకి రానివ్వకపోతే, క్లాసు బయటే కూర్చుని చదువుకున్న దళిత బాలకుడు భీమ్‌రావ్ అంబేద్కర్, ఈ దేశపు శిల్పి అయ్యాడని అంటే-ఒప్పుకోరు ఎందుకూ? దేశానికి రాజ్యాంగాన్ని సమకూర్చి, దేశానికో అందమైన ఆకృతినిచ్చాడంటే పట్టించుకోరెందుకూ? ప్రపంచంలోనే జ్ఞానానికి ప్రతీక అయ్యాడని గర్వంగా చెప్పుకోరెందుకూ? న్యూయార్క్-కొలంబియా విశ్వ విద్యాలయంలోనే ఆయన స్మృతి చిహ్నం జ్ఞాన ప్రతీకగా ఉంది కదా?

పాలక పార్టీ నేతలు, అనుయాయులు ఎలా వున్నారో చూద్దాం. ఒకాయన చంద్రుణ్ణి 'హిందూ దేశ్'గా ప్రకటించాలన్నాడు. మరో ఆ ఫలానా పార్టీ ఎంపీ అయితే మతిభ్రమించినట్టు మాట్లాడాడు. చంద్రుణ్ణి భారత్ జయించిందనీ-మళ్లీ ఆ ఫలానా పార్టీనే అధికారంలోకి తీసుకొస్తే...తాము చంద్రుడి మీద ఒక్కొక్కరికి మూడెకరాలు పంచిపెడతామని ప్రకటించాడు. కోతలు కోయడమే ఆ ఫలానా పార్టీ పాలసీ అయినప్పుడు ఇక దానికి హద్దులెందుకూ? అని అనుకుని ఉంటారు. ఒకడు మనుషులను పశువుల కంటే హీనంగా చూస్తాడు. విద్వేషాలు రెచ్చగొడతాడు. తన ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని 'జంగిల్ రాజ్'గా మారుస్తాడు. మరొకడు ఆవు మూత్రం సీసాల్లో నింపి, అందంగా ప్యాక్ చేసి, లీటర్ రూ. 120 నుంచి రూ.1040 వరకు అమ్ముకుంటాడు. వాడో నకిలీ బాబా. ఇలాంటి వారంతా దేశంలో గొప్ప తాత్వికవేత్తలంట! వీళ్ల గూర్చి విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు పాఠాలు చదువుకోవాలంట! దేశం ఎటు పోతున్నది? ఎవరు రక్షిస్తారీ దేశాన్ని? దేశ ప్రజలు ఆలోచించరా? మేలుకోరా? కర్తవ్యోన్ముఖులు కారా? 2015లో ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్వయంగా లాల్ కృష్ణ అద్వానీ ఇలా చెప్పారు. "నలభైయేళ్ళ క్రితం ఇందిరా గాంధీ పరిపాలనలో విధించిన ఎమర్జెన్సీ వదిలేయండి. అది కేవలం కొన్ని నెలలు మాత్రమే. ఇప్పుడు మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం ఎమర్జెన్సీలోనే ఉంది. ఏళ్లకేళ్లు గడిచినా అనధికార-అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది!".

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మీది అక్కసుతో నెహ్రూ జన్మస్థలమైన అలహాబాదు పేరు మార్చి ప్రయాగ్‌రాజ్ అన్నారు. ఢిల్లీలోని నెహ్రూ మ్యూజియం పేరు మార్చి పి.యం. మ్యూజియం అన్నారు. అందులో వున్నవన్నీ నెహ్రూ వస్తువులే. ఇతర ప్రధానుల జ్ఞాపక చిహ్నాలేవీ లేవు. ఈ పేర్లు మార్చే రోగం ఈ ప్రభుత్వానికి ఎందుకు పట్టిందో తెలియదు. వీరు పెట్టిన పేర్లు చిరకాలం వుంటాయా? వీరు అధికారంలోంచి దిగిపోగానే, వీరు పెట్టిన పేర్లు కూడా 'హుష్ కాకి' అయిపోవా? సమకాలీన రాజకీయ పరిస్థితులు చూసి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఇలా వ్యాఖ్యానించారు- "మోడీ కాకపోతే ఇంకెవరూ? అని అడుగుతారు. అయిదేళ్లలో ఆయన ఏం చేశారో చూడండి. ఐదు కోట్ల ఉద్యోగాలు గాలికెగిరిపోయాయి. రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం, కాగ్, లోక్‌పాల్; సిబిఐ, మీడియా అన్నిటినీ వశపరుచుకున్నారు. మూక దాడులు, ద్వేషపూరిత అబద్ధపు ప్రకటనలు ప్రధాన వార్తా స్రవంతిలో, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. వీరికే గనక ఈ దేశ ప్రజలు మరోసారి అవకాశమిస్తే ఇక అంతే-నాగరికత అంతరించినట్టే!" మనమెంత ప్రమాదకరమైన వాతావరణంలో ఉన్నామన్నది ఇలాంటి వివేకవంతుల మాటల్లోంచి గ్రహించుకోవాలి! అందుకే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ దేశ ప్రజల్ని ఉద్దేశించి హెచ్చరికలు చేస్తూ తన మద్దతు కూడా తెలిపారు- "మాకు సాధ్యమైనంత వరకు మేం, భారత రాజ్యాంగాన్ని సంరక్షించడానికి ప్రయత్నిస్తున్నాం. కానీ, మాకు ప్రజల అండదండలు కూడా చాలా అవసరం. ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావాలి. వారి హక్కుల కోసం వారు ఈ నిరంకుశ ప్రభుత్వాన్ని నిలదీయాలి. ఇది ప్రజల హక్కులు హరిస్తోంది. భయాందోళనలకు గురిచేస్తోంది. అయినా, ప్రజలు తగ్గకూడదు. భయపడ కూడదు. ధైర్యంగా ముందుకు రావాలి. ప్రభుత్వాన్ని వివరణలు అడగాలి. లెక్కలు తేల్చమనాలి. ప్రభుత్వాలెప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే! ధైర్యంగా ఉండండి! నేను మీతోనే ఉన్నాను!!" అన్నారు. చదువు, విజ్ఞత, సమాజోద్ధరణకు వున్న లింకు ఇంత బలమైనది మరి.

/ వ్యాసకర్త సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ - మెల్బోర్న్ నుంచి /

సెటైర్

ఫ్యామిలీ మ్యాన్

పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్ళి చెట్టు పైనుంచి శవాన్ని తీసి భుజాన వేసుకుని స్మశానం వైపు నడవసాగాడు.

అప్పుడు శవంలోని బేతాళుడు, ఒక్కసారిగా ఒళ్లు విరుచుకుని చుట్టూ తేరిపారజూసి, 'రాజా, నీ పట్టుదల నాకెంతో ముచ్చటగా వుంది. ఒక్కోసారి మనం చేసే మాయలన్నీ జనాలకు ఇట్టే తెలిసిపోతుంటాయి. దొంగ పిల్లి పాలు తాగుతూ... తననెవరూ చూడట్లేదనుకుంటుందిట. అలాంటి కథ ఒకటి చెప్తా... విను' అంటూ మొదలు పెట్టాడు.

"సింధియా అనే దేశాన్ని కాషాయం పార్టీ ఏలుతోంది. సింధియాని హిందియాగా మార్చేయాలన్న టార్గెట్‌తో పుట్టిన పార్టీ అది. అయితే ఈ విషయం జనాలకు తెలీకుండా మేనేజ్ చేయడానికి జేడీ అనే బ్రహ్మచారిని ఆ పార్టీ రంగంలోకి దింపింది. ఆయన 'అసలు పేదలకు సేవ చేయడానికే తాను పుట్టానని, తాను బ్రహ్మచారినని, ఆస్తులు, అంతస్తులు తనకక్కరలేదని' సొంత మైక్‌తో జనాల బుర్రల్లోకి బలవంతానా చొప్పించే ప్రయత్నం చేస్తుంటాడు.

అందులో భాగంగానే పేద ప్రజలందరికీ ఉచితంగా రేషన్ అన్నాడు. పెద్ద పెద్ద వ్యాపారాలు చేసే కార్పొరేట్ల మీద పన్నులు తగ్గించి, వాళ్ల కోట్లాది రూపాయల బకాయిలన్నీ ఎత్తేశాడు. తనకు తాను అభినవ శ్రీరాముడిలా భావిస్తుంటారు.

పేదలేమో ఉచిత బియ్యం మోజులో పడితే, కార్పొరేట్లేమో దోచుకునే పనిలో పడ్డారు. జేడీతో చెట్టా పట్టాలేసుకు తిరుగుతున్నారు. ఈయనేమో కాషాయం కట్టుకొని గుళ్లూ గోపురాలంటూ తిరుగుతున్నాడు. జేడీగారి సొంత మైక్‌లో కోట్ల విలువ చేసే ఆయన డ్రెస్‌ల గురించి, ఆయన తినే ఖరీదైన తిండి గురించి, ఆయన సింప్లిసిటీ గురించి కథలు కథలుగా ప్రచారం చేస్తున్నారు.

అయితే, జేడీ గారు మాత్రం...తన మనసులో మాట కార్యక్రమంలో 'తనకసలు ఫ్యామిలీయే లేదని, తాను ఒంటరివాడినని, బ్రహ్మచారినని... ఈ డబ్బూ, విలాసాలు నాకెందుకు, నేను చాయ్ అమ్ముకుని పైకొచ్చినవాడిని' కన్నీళ్లు పెట్టుకున్నంత పని చేశాడు. ఇంతకీ నిజమేంటి? నువ్వేమనుకుంటున్నావు?' అన్నాడు బేతాళుడు.

'నేను మాట్లాడను' అన్నట్టుగా తన నోటికేసి వేలు పెట్టి చూపించాడు విక్రమార్కుడు.

'ఓకె ఓకె. సమాధానం కూడా నేనే చెప్తా విను. పూట గడపడానికే అష్టకష్టాలు పడే పేదలకు జేడీని పట్టించుకునే తీరిక లేదు. డబ్బున్నోళ్ళు ప్రభుత్వంతో అసలు సున్నం పెట్టుకోరు. వచ్చిన చిక్కల్లా తనను ప్రశ్నించేవారితోనే. వీళ్లపైకి సిబిఐ, ఈడీలను ప్రయోగిస్తున్నాడు. ప్రజల దృష్టిని మళ్లించి మరోసారి గెలవడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు' అంటూ ఒక్క క్షణం ఊపిరి పీల్చుకున్నాడు బేతాళుడు.

డబ్బాలో రాళ్లేసి గిలకొట్టినట్టుగా వున్న బేతాళుడి కంఠధ్వనికి విక్రమార్కుడి చెవి దిబ్బడ వేసినట్లయింది. భుజమ్మీదున్న బేతాళుడిని జాగ్రత్తగా మరో భుజం మీదికి మార్చుకుని, దిమ్మెక్కిన చెవిని కాస్త రుద్దుకున్నాడు విక్రమార్కుడు.

'రాజా... ఇప్పుడు నేను చెప్పబోయే పాయింట్ జాగ్రత్తగా విను. నిజానికి 'నేను బ్రహ్మచారిని, నాకు ఫ్యామిలీ లేదు' అని చెప్తున్న జేడీ మాటలు శుద్ధ అబద్దాలు. అతనికి పెళ్లయింది. భార్య వుంది. అంతేకాదు... ఆయనకు చాలా పెద్ద ఫ్యామిలీ కూడా వుంది. ఈ విషయం ఎవరికీ తెలియదని ఆయన అనుకుంటాడుగానీ... దేశమంతా తెలుసు.'

'అవునా?' అన్నట్టుగా చూశాడు విక్రమార్కుడు ఆశ్చర్యంగా...

'అంత ఆశ్చర్యపోవడానికి ఏముంది రాజా.... కాస్త బుర్రపెట్టి ఆలోచించే ఎవరికైనా ఆయనో పెద్ద ఫ్యామిలీ మ్యాన్ తెలిసిపోతుంది. ఆయన చుట్టూ తిరిగే పెద్దపెద్ద కార్పొరేట్లతో పాటు.... మరీ ముఖ్యంగా అందానీ, అబానీలు ఆయన సొంత ఫ్యామిలీనే. అందుకే వాళ్లకు దేశ సంపదను దోచిపెడుతుంటాడు. రాజా... ఇప్పుడు చెప్పు. మన జేడీ గారికి ఫ్యామిలీ వుందా? లేదా? ఆయన ఫ్యామిలీమ్యాన్ అవునా? కాదా?... నిజం చెప్పు. నీకు తెలిసి కూడా చెప్పకపోయావో నీ తల వెయ్యి ముక్కలవుతుంది' అన్నాడు బేతాళుడు.

'ఓరి ఈడి శాడిజం తగలెయ్యా! ఇందులో పెద్ద తెలియకపోవడమేముంది. ఇది జగమెరిగిన సత్యం కదా... అయినా వీడితో ఏం చెబితే ఏం తంటానో అని తటపటాయిస్తూనే... ఈ విషయం నాకే కాదు... దేశమంతా తెలుసు' అన్నాడు విక్రమార్కుడు.

విక్రమార్కుడు చెప్పిన సమాధానంతో... అతని భుజమ్మీద నుంచి మాయమై మళ్ళీ చెట్టెక్కాడు బేతాళుడు. దీంతో మళ్లీ తలపట్టుకుని కూర్చున్నాడు విక్రమార్కుడు.

- రాజాబాబు కంచర్ల
9490099231

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

జనవాక్యం

వృద్ధులకు రైల్వే చార్జీల్లో రాయితీ

ఈ మధ్య సమాచార హక్కు చట్టం కింద ఒక పౌరుడు అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి సమాధానమిచ్చారు. కరోనా సమయంలో ఆర్థికంగా దేశం ఎంతో నష్టపోయింది. కనుక సీనియర్ సిటిజన్లకి చార్జీలో రాయితీ ఇవ్వలేమని స్పష్టం చేశారు. అయితే ఇంత ఆర్థికంగా నష్టపోయిన దేశ ప్రజలకు ఏసీ రైళ్లు ఎలా ప్రవేశపెడుతుందో చెప్పాలి? వందేభారత్ రైళ్లు, వందేమాతరం రైళ్లు అంటూ అన్నీ ఏసీ రైళ్లు వెయ్యమని ఏ ఒక్కరైనా అడిగారా? ఎవరు అడిగారు? ఎందుకు ఈ రైళ్ళు? అయినా రైలులో ఒంగోలు నుండి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలుకి సాధారణ టికెట్ 115 రూపాయలుంటే, ఈ వందేభారత్ రైలుకు రూ.1300 వుంటుంది. ఎవరికోసం ఈ రైళ్ళు? ఈ రైలు వస్తుంటే మిగిలిన రైళ్ళు ఎక్కడివక్కడ ఆగి వీటికి దారి ఇవ్వాలి. ఈ రైళ్లలో ప్రయాణించేవారు అంతా ధనవంతులు, అధికారులు ఎంపీలు, ఎమ్మెల్యేలు (ఈ ఖర్చు ప్రభుత్వానిది) తప్ప సాధారణ ప్రజలు ఎక్కరు. గతంలో కాకినాడ-తిరుపతి పాసెంజర్ రైలు ఉండేది. అది ఆ మార్గంలో ప్రయాణించే వారికి చాలా బాగా అనుకూలంగా ఉంది. దాన్ని రద్దు చేసి స్పెషల్ రైలు పేరుతో ఎక్స్‌ప్రెస్ రైలు వేశారు. అది చిన్న చిన్న స్టేషన్లలో ఆగదు. గూడూరు నుండి విజయవాడకు పాసెంజర్ రైళ్లు వెయ్యాలి. ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలుకు సగం జనరల్ బోగీలు వెయ్యాలి. అపుడే ప్రయాణికులు సులభంగా ప్రయాణం చేయగలుగుతారు. ఇప్పటికయినా వృద్ధులకు రైల్వే చార్జీలలో 50 శాతం రాయితీలివ్వాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య

నాటో ఉన్మాదానికి ఉక్రెయిన్ బలి

రష్యాను ఎదుర్కొనే సత్తా లేదని ఎరిగినప్పటికీ జెలెన్స్కీ ఎందుకు ఇంకా పశ్చిమ దేశాల సాయం కోసం పాకులాడుతున్నాడు. రెండేళ్లుగా సాధించలేనిది మరో రెండేళ్లు ఆయుధాలు ఇచ్చినా సాధించగలడా అన్న ప్రశ్నలు ఎవరికైనా తలెత్తటం సహజం. అయినా అతడలా ప్రవర్తిస్తున్నాడంటే పశ్చిమ దేశాల చేతిలో బందీగా మారినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. రష్యాకు వ్యతిరేకంగా ఆయుధాలను మోహరించం, దాని సార్వభౌమత్వానికి ఎలాంటి ముప్పు తలపెట్టం అనే ఒక్క మాట నాటో నోటి నుంచి వస్తే తక్షణమే దాడులు ఆగుతాయని తెలుసు. అయినప్పటికీ అదేమీ తెలియనట్లు ఆయుధాలిస్తాం, కొట్టండి, చావండి అన్నట్లుగా జర్మనీ స్పందన ఉంది.

విశ్లేషణ

ఇజ్రాయిల్‌పై ఇరాన్ జరిపిన ప్రతిదాడి పశ్చిమ దేశాలకు కొత్త సమస్య, ఒత్తిడిని ముందుకు తెచ్చింది. ఇజ్రాయిల్ మాదిరి తమకు గగనతల దాడుల నుంచి రక్షణ ఛత్రాన్ని ఎందుకు కల్పించరంటూ నాటో కూటమి దేశాలను ఉక్రెయిన్ ప్రశ్నిస్తోంది. ఒక టీవీతో మాట్లాడుతూ జెలెన్స్కీ ఇదే అంశాన్ని ముందుకు తెచ్చాడు. రష్యా ప్రారంభించిన సైనిక చర్య 785వ రోజుకు చేరింది. తన సరిహద్దుకు సమీపంలో ఉన్న చెర్నిహివ్ పట్టణంపై రష్యా ప్రయోగించిన మూడు క్షిపణులు 17 మంది ప్రాణాలు తీశాయి. మాకు అవసరమైనన్ని ఆయుధాలు సరఫరా చేయకపోతే మేమెలా ప్రతిఘటించాలి అంటూ పశ్చిమ దేశాల పావుగా మారిన జెలెన్స్కీ ఆర్తనాదాలు చేస్తున్నాడు. క్షిపణి దాడుల నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని నాటో అధిపతి స్టోల్టెన్‌బర్గ్ కోరటం, సిద్ధం సుమతీ అన్నట్లుగా మరిన్ని పేట్రియాట్ క్షిపణి నిరోధక వ్యవస్థలను తరలించాలని జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ ప్రకటించాడు. రష్యా హైపర్‌సోనిక్ క్షిపణులను అడ్డుకొనేందుకు తమ దగ్గర ప్రస్తుతం ఒకే ఒక్క పేట్రియాట్ ఉందని, మరో ఏడు కావాలని బ్రసెల్స్‌లో సమావేశమైన ఐరోపా సమాఖ్య నేతలను జెలెన్స్కీ కోరాడు. తమకు తగినన్ని ఆయుధాలు అందచేసి ఉంటే చెర్నిహివ్ మీద రష్యా దాడిని ఎదుర్కొని ఉండేవారమన్నాడు. ఇజ్రాయిల్‌కు మిత్రదేశాల అండతో పాటు రక్షణ ఛత్రం ఉన్నకారణంగానే ఇరాన్ దాడులను జయప్రదంగా ఎదుర్కొన్నదని లేనట్లయితే రక్తం పారేదని, అదే మాదిరి తమకూ ఇతర దేశాల రక్షణ అవసరమని, లేని కారణంగా రష్యా దాడులను నివారించలేకపోతున్నామని జెలెన్స్కీ చెబుతున్నాడు. జెలెన్స్కీ సభ్య దేశం కాకున్నప్పటికీ నాటో దేశాలు రక్షిస్తున్నాయని, దాన్నే తమకూ ఎందుకు వర్తింప చేయరని ప్రశ్నించాడు. అమెరికా సాయం వెంటనే విడుదల చేయకపోతే తాము గెలిచే అవకాశం లేదన్నాడు. రష్యా దగ్గర పది ఫిరంగి గుండ్లు ఉంటే తమ దగ్గర ఒకటే ఉన్న కారణంగా వారు తమను వెనక్కు కొడుతున్నారని చెప్పాడు.

కందకాల్లో ఉన్న తమ మిలిటరీని వెలుపలికి రప్పించేందుకు టియర్‌గ్యాస్ వంటి వాటిని రష్యా పంపుతున్నదని ఉక్రెయిన్ కొత్తగా ఆరోపించింది. రష్యా డ్రోన్లన్నింటినీ కూల్చివేస్తున్నట్లు ఇంతకాలం చెబుతున్న అధికారులు తమ సైనికులు ఉన్న కందకాలపై డ్రోన్లతో గ్యాస్ బాంబులు వేస్తున్నట్లు చెప్పటం విశేషం. పశ్చిమ దేశాల జీవాయుధ ప్రయోగశాలలు ఉక్రెయిన్‌లో ఉన్నట్లు, రసాయనిక ఆయుధాలను ఉపయోగిస్తున్నట్లు రష్యా చెబుతున్న సంగతి తెలిసిందే. గాజాలో ఆసుపత్రులు, నిరాశ్రయులు తల దాచుకున్న సహాయ శిబిరాల మీద ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను సమర్థిస్తున్న ఉక్రెయిన్ మరోవైపు రష్యన్ దాడుల్లో తమ ఆసుపత్రులు, పౌరుల మౌలిక సదుపాయాలు దెబ్బ తింటున్నట్లు ఆరోపిస్తున్నది. రెండు సంవత్సరాలు దాటిన సైనిక చర్యలో ఇప్పటి వరకు 18 శాతం ఉక్రెయిన్ ప్రాంతాలను (స్వాతంత్ర్యం ప్రకటించుకున్న రెండు ప్రాంతాలతో సహా) రష్యా అదుపులో ఉన్నట్లు చెబుతున్నారు. తాజాగా మరిన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకొనేందుకు ముందుకు పోతుండగా జెలెన్స్కీ మరిన్ని ఆయుధాలు కావాలని కోరుతున్నాడు. ఎన్ని ఆయుధాలు ఇచ్చినా ఎంతగా ప్రచారం చేసినా ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను బట్టి ఉక్రెయిన్‌కు ఒరిగేదేమీ లేదని తేలింది. రష్యాను ఎదుర్కొనే సత్తా లేదని ఎరిగినప్పటికీ జెలెన్స్కీ ఎందుకు ఇంకా పశ్చిమ దేశాల సాయం కోసం పాకులాడుతున్నాడు. రెండేళ్లుగా సాధించలేనిది మరో రెండేళ్లు ఆయుధాలు ఇచ్చినా సాధించగలడా అన్న ప్రశ్నలు ఎవరికైనా తలెత్తటం సహజం. అయినా అతడలా ప్రవర్తిస్తున్నాడంటే పశ్చిమ దేశాల చేతిలో బందీగా మారినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. రష్యాకు వ్యతిరేకంగా ఆయుధాలను మోహరించం, దాని సార్వభౌమత్వానికి ఎలాంటి ముప్పు తలపెట్టం అనే ఒక్క మాట నాటో నోటి నుంచి వస్తే తక్షణమే దాడులు ఆగుతాయని తెలుసు. అయినప్పటికీ అదేమీ తెలియనట్లు ఆయుధాలిస్తాం, కొట్టండి, చావండి అన్నట్లుగా జర్మనీ స్పందన ఉంది. పార్లమెంటు ఉభయ సభలు ఉక్రెయిన్‌కు ప్రకటించిన సాయానికి ఆమోద ముద్ర వేస్తే వెంటనే సంతకం చేస్తానని, ఇరాన్ లేదా రష్యా ఎట్టి పరిస్థితిలోనూ విజయం సాధించకూడదని ప్రపంచానికి సంకేతం పంపాలని జోబైడెన్ రిపబ్లికన్లను కోరాడు. ఇది యుద్ధోన్మాదం తప్ప మరొకటి కాదు. ఉక్రెయిన్‌ను మరింత నాశనం చేసేందుకే పూనుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.



- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

తొలి విడతలో 252 మంది అభ్యర్థులకు నేర చరిత్ర

- 450 మంది కోటీశ్వర్లు
- 10 మందికి ఆస్తుల్లేవ్ !
- ఏడిఆర్ నివేదిక

నమూనా చిత్రం

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో తొలిదశ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 252 మందికి నేర చరిత్ర ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ (ఎడిఆర్) నివేదించింది. కేంద్ర ఎన్నికల సంఘం సమాచారం ప్రకారం.. మొదటి దశ ఎన్నికల్లో మొత్తం 1,625 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 1,491 మంది పురుషులు, 134 మంది మహిళా అభ్యర్థులు. పోటీలో ఉన్న మహిళల శాతం కేవలం 8 మాత్రమే. కాగా 1,618 మంది అభ్యర్థుల అఫిడవిట్లను పరిశీలించి ఎడిఆర్ ఒక నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం మొత్తం అభ్యర్థుల్లో 16 శాతం మంది అంటే 252 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 10 శాతం మంది అంటే 161 మంది అభ్యర్థులపై హత్య, కిడ్నాప్ వంటి కేసులున్నాయి. ఏడుగురు అభ్యర్థులపై హత్య, 19 మందిపై హత్యాయత్నం అభియోగాల కింద కేసులు నమోదయ్యాయి. 18 మంది అభ్యర్థులు, మహిళలపై నేరాలకు సంబంధించి కేసులున్నాయి. వీరిలో ఒకరిపై లైంగికదాడి కేసు కూడా నమోదైంది. అదే సమయంలో 35 మంది అభ్యర్థులపై ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన కేసులూ ఉన్నాయి.

28 శాతం అభ్యర్థులు కోటీశ్వర్లు

తొలి దశ ఎన్నికల్లో 1618 మంది అభ్యర్థుల్లో 450 మంది అంటే 28 శాతం మంది అభ్యర్థులు కోటీశ్వరులేనని ఎడిఆర్ నివేదించింది. అభ్యర్థుల సగటు ఆస్తులు రూ.4.51 కోట్లుగా ఉంది. తమిళనాడులోని తూత్తుకుడి స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థి కె. పొన్‌రాజ్ అత్యంత పేద అభ్యర్థి. ఆయన వద్ద రూ.320 మాత్రమే ఉన్నాయి.

ఆ తొమ్మిది స్థానాలపై అందరి దృష్టి

నాగ్‌పూర్ (మహారాష్ట్ర) ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం అయినప్పటికీ, నాగ్‌పూర్ ఎప్పుడూ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. ఈ స్థానం 1952 నుంచి 1996 వరకు, 1998 నుంచి 2009 వరకు కాంగ్రెస్ ఆధీనంలో ఉంది. 1996 ఎన్నికల్లో తొలిసారి బిజెపి ఖాతా తెరిచింది. అప్పుడు బన్వరీలాల్ పురోహిత్ ఎంపీగా ఎన్నికయ్యారు. 2014లో కాంగ్రెస్ విజయ పరంపరకు నితిన్ గడ్కరీ బ్రేక్ వేశారు. అప్పటి నుంచి ఆయన నాగ్‌పూర్ నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు. గడ్కరీ ఇప్పుడు మూడోసారి ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి వికాస్ ఠాక్రేతో పోటీ నెలకొంది. వికాస్ ఠాక్రే నాగ్‌పూర్ వెస్ట్ నుంచి ఎమ్మెల్యే , మేయర్‌గా ఉన్నారు.

బికనీర్ (రాజస్థాన్) : రాజస్థాన్‌లోని బికనీర్‌లో బిజెపి ప్రస్తుత న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ను అభ్యర్థిగా నిలబెట్టింది. ఆయనపై రాజస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన గోవింద్రామ్ మేఘ్వాల్‌ను కాంగ్రెస్ రంగంలోకి దించింది. గోవింద్‌రామ్ మేఘవాల్ ఇటీవలే ఖాజువాలా స్థానం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. అర్జున్‌రామ్ మేఘవాల్ ఈ స్థానం నుంచి వరుసగా మూడు సార్లు ఎంపీగా ఉన్నారు.

అల్వార్ (రాజస్థాన్): అల్వార్‌లో బిజెపి అభ్యర్థి భూపేంద్ర యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి లలిత్ యాదవ్ మధ్య పోటీ నెలకొంది. లలిత్ యాదవ్ ముండావర్ ఎమ్మెల్యే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేలకు పైగా ఓట్లతో గెలుపొందారు. అలాగే భూపేంద్ర యాదవ్ రాజస్థాన్ నుంచి రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి చెందిన బాబా బాలక్‌నాథ్ అల్వార్ స్థానాన్ని గెలుచుకున్నారు.

చింద్వారా (మధ్యప్రదేశ్) : ఈ సీటు ఏడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌లో ఉంది. గత 45 ఏండ్లుగా ఇక్కడ నాథ్ కుటుంబానికి చెందిన ఒకరు గెలుస్తూ వస్తున్నారు. అయితే 1997లో జరిగిన ఉప ఎన్నికలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి సుందర్‌లాల్ పట్వా కమల్‌నాథ్‌పై 37 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. దీని తర్వాత, మరుసటి సంవత్సరం కమల్ నాథ్ కూడా పట్వాను భారీ తేడాతో ఓడించారు.

కమల్ నాథ్ 1980 నుంచి 2019 మధ్య ఇక్కడ తొమ్మిది సార్లు ఎంపీగా ఉన్నారు. 2018లో ముఖ్యమంత్రి అయ్యాక కుమారుడికి బాధ్యతలు అప్పగించారు. 2019లో మోడీ వేవ్ ఉన్నా నకుల్‌నాథ్ ఈ ఎంపీ సీటును కైవసం చేసుకున్నారు. ఈసారి కూడా కాంగ్రెస్ అభ్యర్థి నకుల్‌నాథ్, బిజెపి అభ్యర్థి వివేక్ బంటీ సాహు మధ్యే పోటీ నెలకొంది. 2019 ఉప ఎన్నికలు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కమల్‌నాథ్‌పై సాహు ఓడిపోయారు.

మాండ్లా (మధ్యప్రదేశ్) : ఇక్కడి నుంచి బిజెపి ఆరు సార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఎన్నికైన ఫగ్గన్ సింగ్ కులస్తేను పోటీలో నిలబెట్టింది. నాలుగుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన ఓంకార్ సింగ్ మార్కంపై ఆయన పోటీ చేస్తున్నారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మాండ్లా జిల్లా నివాస్ స్థానం నుంచి ఫగ్గన్ సింగ్ కులస్తే ఓటమిని చవిచూడాల్సి రావడంతో ఈ సీటుపై బిజెపి ఆందోళన పెరిగింది. మండల పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని 8 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 5, బిజెపి 3 స్థానాల్లో ఉన్నాయి.

ఉదంపూర్ (జమ్మూ కాశ్మీర్) : జమ్మూ కాశ్మీర్‌లోని ఉదంపూర్–దోడా లోక్‌సభ స్థానం నుంచి కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మూడోసారి ఎన్నికల బరిలో నిలిచారు. 2014లో జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్‌పై 61 వేల ఓట్లతో విజయం సాధించారు.ఆ తర్వాత 2019లో కాంగ్రెస్ అభ్యర్థి విక్రమ్ ఆదిత్య సింగ్ 3 లక్షలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు.

అరుణాచల్ వెస్ట్ : బిజెపి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజును ఈ స్థానం నుంచి బరిలోకి దింపింది. ఆయనకు కాంగ్రెస్ అధ్యక్షుడు నబమ్ తుకీ సవాల్ విసిరారు. టుకీ అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పాపం పరే జిల్లాలోని సాగాలి అసెంబ్లీ స్థానం నుంచి ఆరు సార్లు ఎన్నికయ్యారు.

2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కిరెన్ రిజిజు ఈ స్థానంలో గెలుపొందారు.అదే సమయంలో, 2009 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తకమ్ సంజోయ్ విజయం సాధించారు.

కూచ్ బెహార్ (పశ్చిమ బెంగాల్) : 2019లో కూచ్ బెహార్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థి నిషిత్ ప్రమాణిక్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన్ను తృణమూల్ కాంగ్రెస్ బహిష్కరించగా.. బిజెపి టిక్కెట్‌పై కూచ్ బెహార్ నుంచి ఎన్నికలలో పోటీ చేసి గెలిచారు. తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి పరేష్ చంద్రపై ఆయన 54,231 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

నగీనా (ఉత్తర ప్రదేశ్) : యూపీలోని బిజ్నోర్ జిల్లా నగీనా లోక్‌సభ స్థానం ఈసారి హైప్రొఫైల్‌గా మారింది. ఇక్కడ దళిత యువ నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ తన పార్టీ 'ఆజాద్ సమాజ్ పార్టీ' నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. దీంతో ఈ సీటుపై పోటీ చతుర్ముఖంగా మారింది. బిజెపి తరపున నహ్తౌర్ ఎమ్మెల్యే ఓం కుమార్, ఇండియా అలయన్స్ తరపున మాజీ న్యాయమూర్తి మనోజ్ కుమార్ బరిలో ఉన్నారు.

2019 మోడీ వేవ్‌లో కూడా ఈ సీటును బిఎస్పీ గెలుచుకుంది. ఈ స్థానం నుంచి బిఎస్పీ అభ్యర్థి గిరీష్ చంద్ర జాతవ్ గెలుపొందగా, బులంద్‌షహర్ నుంచి మాయావతి ఈసారి ఆయనను పోటీకి దింపారు.

లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరుగుతున్నాయి, జూన్ 4న ఫలితాలు రానున్నాయి. దేశంలోని 543 స్థానాలకు ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న మొదటి దశ, జూన్ 1న చివరి దశ ఓటింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు రానున్నాయి. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ , సిక్కిం 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలను కూడా ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఒడిశాలో మే 13, మే 20, 25 మే, జూన్ 1 తేదీల్లో ఓటింగ్ జరగనుంది.

కోడ్ ఉల్లంఘనుడు మోడీ

- ఆయన ప్రకటనలు ఇసి నియమావళికి విరుద్ధం
- ఇప్పటికే ఫిర్యాదు చేశాం : ఏచూరి

కోజికోడ్ : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పదేపదే ఉల్లంఘిస్తూ వచ్చారని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మోడీ ప్రకటనల్లో అత్యధికంగా ఇసి నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో బహిరంగ సభల్లో ప్రసంగించారు. ప్రజల్లో చీలికలు తీసుకొచ్చేలా విద్వేషాలు రెచ్చగొట్టేలా మతాన్ని అడ్డుపెట్టుకుని ఆయన ప్రసంగాలు దట్టించారు. ప్రధానంగా అయోధ్య 'రాముడి' అంశంపై మతతత్వానికి పదును పెట్టటమే లక్ష్యంగా మోడీ చేసిన ప్రకటనలు గుప్పించారు. ఈ ప్రసంగాల జాబితాను జత చేసి మోడీపై ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఫిర్యాదు చేశామని ఏచూరి తెలిపారు. కేరళలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన ఏచూరి మీడియాతో మాట్లాడారు. వామపక్ష కూటమిపై చేస్తున్న ఆరోపణలకు కౌంటర్‌గా కాంగ్రెస్, యుడిఎఫ్‌ను కూడా ఆయన విమర్శించారు. 'ఎల్‌డిఎఫ్, ప్రత్యేకించి సిపిఎంను.. మోడీపై దాడి చేయకుండా మౌనంగా ఉన్నదని ఆరోపిస్తూ కాంగ్రెస్, యుడిఎఫ్‌లు ఆరోపించటం విచిత్రంగా ఉంది. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) వ్యతిరేకిస్తూ అరెస్టయిన తొలి రాజకీయ నాయకులలో నేనూ ఉన్నా. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కాశ్మీర్‌లో రాజకీయ నాయకులను నిర్బంధించారని పేర్కొంటూ సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసింది వామపక్ష పార్టీనే. ఎన్నికల బాండ్లను స్వీకరించకుండా అవి రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏకైక రాజకీయ పక్షం సిపిఎం' అని సీతారాం ఏచూరి గుర్తు చేశారు. ఈ సమస్యలన్నింటిలో, అనేక ఇతర విషయాలలో కాషాయ పార్టీని వ్యతిరేకించటంలో సిపిఎం ముందున్నదనీ, ఇన్ని సందర్భాల్లో బిజెపిని వ్యతిరేకించలేదని మాపై ఆరోపణలు చేసేవారు ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు. సిపిఎం వటకర లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కెకె శైలజపై సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఏచూరి ఈ ప్రకటన చేశారు. ఆమెపై జరుగుతున్న ప్రచారాన్ని 'తీవ్రమైన, అసభ్యకరమైనది'గా ఆయన అన్నారు. ఇది ఆమె ఎన్నికల్లో విజయం సాధించినట్టు సూచిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు పార్టీని వీడి బిజెపిలో చేరినందున ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని ఏచూరి కోరారు. వ్యక్తిగత దాడులతో కాకుండా వాస్తవాలు, సారాంశాల ఆధారంగా మాట్లాడదామని ఆయన హితవు పలికారు. ప్రచార సమయంలో అందరూ గౌరవాన్ని, మర్యాదను కొనసాగించాల్సిన అవసరమున్నదని ఏచూరీ చెప్పారు. శైలజపై సోషల్ మీడియా వేదికలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై కాంగ్రెస్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) కార్యకర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. శైలజపై సైబర్ దాడి వటకర కాంగ్రెస్ అభ్యర్థి షఫీ పారంబిల్‌కు తెలిసే జరుగుతున్నదని ఆరోపిస్తూ ఆయనపై ఎన్నికల సంఘానికి కూడా సిపిఎం ఫిర్యాదు చేసింది. కేరళలో షెడ్యూల్ ప్రకారం.. ఏప్రిల్ 26న లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

ముర్షిదాబాద్‌లో సలీం నామినేషన్ దాఖలు

కోల్‌కత్తా : పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ సెంటర్ లోక్‌సభ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం గురువారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సలీం అభ్యర్థిత్వానికి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పిసిసి అధ్యక్షులు అధిర్ రంజన్ చౌదరీ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జమీర్ మెల్లా, శత్రుప్ ఘోష్, మీనాక్షి ముఖర్జీ, ధరుభ్‌జ్యోతి సాహా, పలువురు లెఫ్ట్‌ఫ్రంట్ నాయకులు పాల్గొన్నారు.

కొచ్చిన్ విమానశ్రయంలో ఆన్ టెస్సాకు స్వాగతం చెబుతున్న అధికారులు

ఆ 17 మందిలో ఒకరు తిరిగొచ్చారు !

న్యూఢిల్లీ : ఇరాన్‌లో దిగ్బంధించిన నౌకలోని 17 మంది భారతీయ నౌకా సిబ్బందిలో ఒకరు స్వదేశానికి తిరిగివచ్చారు. కేరళలోని త్రిసూర్‌కు చెందిన ఆన్ టెస్సా జోసెఫ్ గురువారం కొచ్చిన్ అంతర్జాతీయ విమానశ్రయానికి చేరుకోగా, ఆమెకు స్థానిక అధికారులు స్వాగతం పలికారు. పోర్చుగల్ జెండాతో ఉన్న ఎంఎస్‌సి ఏరీస్ అనే నౌకను గత వారంతంలో ఇరాన్ దిగ్బంధించిన సంగతి తెలిసిందే. ఇందులో ఉన్న మిగిలిన 16 మంది భారతీయ సిబ్బందిని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది.

జైలు నుండి విడుదలైన సోమాసేన్

న్యూఢిల్లీ : భీమా కొరెగావ్ కేసులో అక్రమంగా అరెస్టయిన నాగపూర్ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ సోమాసేన్ బుధవారం జైలు నుండి విడుదలయ్యారు. సోమాసేన్ కుటుంబసభ్యులను కలుసుకున్న ఫోటోలను ఆమె తరపు న్యాయవాది ఇందిరా జైసింగ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ఎట్టకేలకు జైలు నుండి విడుదలయ్యారు. బైకుల్లా జైలు బయట ఆమె తన కుమార్తెను కలుసుకున్నారు" అని ట్వీటర్‌లో పేర్కొన్నారు. బెయిల్‌కు సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత సేన్ జైలు నుండి విడుదలయ్యారని సీనియర్ జైలు అధికారి ఒకరు తెలిపారు. భీమా కొరెగావ్ కేసులో ఇటీవల సుప్రీంకోర్టు సోమాసేన్‌కు బెయిల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆమెపై వచ్చిన ఉగ్రవాద ఆరోపణలు ప్రాథమికంగా అవాస్తవమని ఏప్రిల్ 15న సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 2018, జూన్ 6న సోమాసేన్ సహా పలువురు మానవ హక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలు, న్యాయవాదులను చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యుఎపిఎ) కింద పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటి నుండి ఆమె బైకుల్లా జైలులోనే ఉన్నారు.

ప్రజావాణి వినిపించేది వామపక్షాలే

- ఎల్‌డిఎఫ్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- కేరళలో ఎఐఎడబ్ల్యుయు నేత బి వెంకట్ పిలుపు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

చట్టసభల్లో ప్రజావాణిని వినిపించేది వామపక్షాలేనని, కేరళలో వామపక్ష అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం పాల్గాట్ పార్లమెంటరీ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఎ విజయ రాఘవన్, ఆల్తూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) అఖిల భారత అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి రాధాకృష్ణ ఎన్నికల ప్రచార సభల్లో బి వెంకట్ ప్రసంగించారు. బిజెపి పాలనలో కార్పొరేట్, మతోన్మాద విధానాలు బలపడ్డాయని, వీటికి వ్యతిరేకంగా వామపక్షాలే నికరంగా పోరాడాయన్నారు. వామపక్ష అభ్యర్థులు గెలిస్తే ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తేవడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. కేరళలో బిజెపి, యుడిఎఫ్ కూటమిని ఓడించి వామపక్ష కూటమి ఎల్ డి ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శ్రమజీవులైన వ్యవసాయ కార్మికులు, రైతాంగం, కార్మికులు, కౌలు రైతులకు మేలు జరగాలంటే తిరిగి వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవడం వల్లనే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. కేరళ మోడల్ నేడు దేశానికి అవసరమని చెప్పారు. దేశంలో బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్ముతుంటే, వాటిని కేరళ ప్రభుత్వం తీసుకొని ప్రభుత్వ రంగంలో నడుపుతున్నదని అన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు ఉపయోగం కలిగేలా తీసుకుని వచ్చిన రైతు నల్ల చట్టాలపైనా, నిరుద్యోగ సమస్య, ఎన్‌పిఆర్, లేబర్ కోడ్లు, సిఎఎ వంటి ప్రజా వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడుతున్నది వామపక్షాలే అని ఆయన తెలిపారు. దేశాన్ని కార్పొరేట్, మతోన్మాద విధానాలతో నష్టం చేస్తున్న బిజెపి, కేరళ ప్రయోజనాల కోసం కాకుండా అవకాశ వాదంతో ఉన్న కాంగ్రెస్‌ను ప్రజలు ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

గూగుల్‌లో నిరసనగళం

- ఇజ్రాయిల్ ప్రాజెక్టుపై ఆందోళన
- 28 మంది ఉద్యోగులపై వేటు
- త్వరలో భారీగా ఉద్వాసనలు..!

న్యూయార్క్ : ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ ఆందోళనలు తుదకు కార్పొరేట్ సంస్థలను తాకాయి. ఈ అంశంలో ఏకంగా టెక్ దిగ్గజం గూగుల్ ప్రాజెక్టుపై ఆ సంస్థ ఉద్యోగులే నిరసనగళం ఎత్తారు. గూగుల్ ఉద్యోగులు కంపెనీ క్లౌడ్ సిఇఒనే ఎదురించడం విశేషం. ఇజ్రాయిల్‌తో క్లౌడ్ కంప్యూటింగ్ కాంట్రాక్ట్ ప్రాజెక్ట్ నింబస్‌ను వ్యతిరేకిస్తూ సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ కాంట్రాక్ట్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు ఇటీవల న్యూయార్క్, సన్నీవేల్‌లోని రెండు గూగుల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అంతకుముందు మంగళవారం గూగుల్ క్లౌడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) థామస్ కురియన్ కార్యాలయాన్ని 8 గంటల పాటు ముట్టడించి అక్కడి నుంచి కదిలేందుకు నిరాకరించారు. ఏకంగా రూ.10వేల కోట్ల ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్‌తో కంపెనీ చేసుకున్న ఒప్పందాలను వెంటనే నిలిపేయాలని కోరారు. నిరసనకు దిగిన ఉద్యోగులను ఆ కంపెనీ అరెస్ట్ చేయించింది. అనంతరం 28 మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. అమెరికా దన్నుతో ఇతర దేశాలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయడం టెక్ కార్పొరేట్ చరిత్రలోనే విశేషం. ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులను అడ్మినిస్ట్రేటివ్ లీవ్‌లో ఉంచినట్లు కంపెనీ తెలిపింది. అయినా అక్కడి నుంచి ఏమాత్రం నిరసన విరమించుకోకపోవడంతో 28 మందిపై వేటు వేసినట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్ ప్రభుత్వంతో గతంలో గూగుల్ క్లౌడ్ కంప్యూటింగ్ 1.2 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగుల ప్రధాన డిమాండ్.

మళ్లీ తొలగింపులు షురూ..

పొదుపు చర్యలు, కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా గూగుల్ మరోసారి భారీగా ఉద్యోగులను తొలగించనుందని రిపోర్టులు వచ్చాయి. ఈ విషయాన్ని కంపెనీ సిఎఫ్ఒ రాసిన అంతర్గత లేఖలో పేర్కొన్నారు. "కృత్రిమ మేధ (ఎఐ) వల్ల టెక్ రంగంలో మార్పులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కఠిన నిర్ణయాలూ తీసుకోవాల్సి వస్తోంది. మన ప్రాధాన్యాలు ఏంటో గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలి. ఈ క్రమంలోనే ఫలితంగా నైపుణ్యం కొరవడిన కొంతమంది సిబ్బందిని బయటకు పంపాల్సి వస్తోంది." అని సిఎఫ్ఒ తెలిపారు. కాగా.. ఎంత మందిని తొలగిస్తున్నారు?, ఎంత మందిని బదిలీ చేసేది వెల్లడించలేదు.

తోషిబాలో 5వేల మందిపై వేటు

పొదుపు చర్యల్లో భాగంగా జపాన్‌కు చెందిన తోషిబా 5వేల పైగా ఉద్యోగులపై వేటు వేయనుందని నిక్కీ నివేదించింది. ఇది సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో పది శాతానికి సమానం కావడం ఆందోళన కలిగించే అంశం. టోక్యోకు చెందిన ఈ సంస్థ నాన్‌కోర్ వ్యాపారాలను తగ్గించడం ద్వారా తన కార్యకలాపాలను క్రమబద్ధీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిక్కీ నివేదించింది.

ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులపై ఎబివిపి దాడి

- హెచ్‌సియు జనరల్ సెక్రెటరీ కృపకు గాయాలు
- ఓటమిని జీర్ణించుకోలేకనే దాడులు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఫేర్వెల్ పార్టీలో మత విద్వేషకర పాటలు పెట్టొద్దని చెప్పినందుకు ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఎబివిపి గుండాలు అతి కిరాతకంగా దాడి చేశారు. ఈ దాడిలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి కృపతో పాటు 15 మంది విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధిత విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు రోజుల క్రితం జరిగిన ఫేర్వెల్ పార్టీలో మత విద్వేషకర పాటలు పాడుతున్న ఎబివిపి విద్యార్థులను ఇతర విద్యార్థులు అడ్డుకొని పాడొద్దని వారించారు. ఈ విషయంపై ఎబివిపి నాయకులను ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించారు. దీన్ని మనస్సులో పెట్టుకున్న ఎబివిపి నాయకులు బుధవారం రాత్రి బ్లేడు, కత్తులతో విద్యార్థుల హాస్టల్ రూముల్లోకి వెళ్లి దాడులకు పాల్పడ్డారు. హాస్టల్ బయట అడ్డుకోవడానికి వచ్చిన విద్యార్థులపైనా తమ ప్రతాపాన్ని చూపించారు. మహిళలనీ చూడకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఓ వికలాంగ విద్యార్థి అంబులెన్స్‌లో బయట హాస్పటిల్‌కు వెళ్తుంటే.. ఎబివిపి కార్యకర్తలు పోలీసుల సమక్షంలోనే అడ్డుకున్నారు. ఈ దాడిలో స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ అతీక్ అహ్మద్, కృప, జార్జ్‌తో సహా మొత్తం 15 మంది గాయపడ్డారు. క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడులకు పాల్పడిన ఎబివిపి గుండాలపై పోలీసులు, యూనివర్సిటీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

సిఎస్, డిజిపిలపై వచ్చిన ఫిర్యాదులను ఇసికి నివేదించాం

(మొదటి పేజీ తరువాయి)

వుంటుందన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో 4 గంటల వరకే పోలింగు

ఏజెన్సీ నియోజకవర్గాలైన అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు పోలింగు జరగనుందని సిఇఒ ఎంకె మీనా తెలిపారు. జూన్ 4న కౌంటింగు వుంటుందని, 6వ తేదీతో రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు. పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి పార్లమెంటుకు అయితే రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి అయితే రూ.40 లక్షలకు మించకూడదని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి జనరల్ అబ్జర్వర్, పోలీస్ అబ్జర్వర్, ఖర్చు అబ్జర్వర్లుగా ముగ్గురు ప్రత్యేక అబ్జర్వర్లను నియమించిందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జనరల్, ఖర్చుల పరిశీలకులతోపాటు ఈ దఫా ప్రత్యేకంగా పోలీస్ అబ్జర్వర్లను కూడా నియమించిందని తెలిపారు. 85 ఏళ్లు దాటిన వారికి ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకునేలా, పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులు, అత్యవసర సర్వీసుల్లో పనిచేసేవారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర పోలీస్ బలగాలు కాకుండా మొత్తం 5,26,010 మంది ఉద్యోగులు ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నారని తెలిపారు.

12,459 తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

రాష్ట్ర వ్యాప్తంగా 30,111 పోలింగ్ స్టేషన్‌లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, అందులో 12,459 పోలింగ్ కేంద్రాలను తీవ్ర సమస్యాత్మకమైనవిగా గుర్తించామని సిఇఒ తెలిపారు. ఇప్పటి వరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేవలం లోపల మాత్రమే వెబ్ క్యాస్టింగ్ జరిగేదని, ఈ ఎన్నికల నుంచి క్యూలైన్‌తో పాటు బయట పరిసరాలను వీడియోలు తీసేలా రెండో కెమెరాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 44,163 మంది వలంటీర్లు రాజీనామా చేశారని, 1,017 మందిని విధుల్లోంచి తప్పించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.180 కోట్ల మేర నగదు, ఇతర వస్తువులను సీజ్ చేశామని వివరించారు.

నెస్లే బేబీ ఆహార ఉత్పత్తుల్లో అధికంగా చక్కెర

- ఇయుతో పోలిస్తే భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లోనే ఎక్కువ
- ద్వంద్వ ప్రమాణాలను ఎత్తిచూపిన స్విస్ ఎన్‌జిఒ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో విక్రయించే నెస్లే బేబీ ఆహార ఉత్పత్తుల్లో చక్కెర శాతం ఎక్కువగా వుందని స్విస్ ఎన్‌జిఒ పబ్లిక్ అండ్ ఇంటర్నేషనల్ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్ (ఐబిఎఫ్ఎఎన్) ఇటీవల విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. భారత్‌తో పాటూ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని తెలిపింది. ఇతర యురోపియన్ మార్కెట్లలో విక్రయించే ఇదే ఉత్పత్తులతో పోలిస్తే ఈ ఉత్పత్తుల్లో అధికంగా చక్కెర వుందని స్పష్టం చేసింది.

అంతర్జాతీయంగా ఫుడ్ అండ్ బేవరేజెస్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన నెస్లే తయారుచేసి, వివిధ దేశాల్లో విక్రయిస్తున్న దాదాపు 150 బేబీ ఉత్పత్తులను బెల్జియం లేబరేటరీలో పరీక్షించారు. ఆరు మాసాల శిశువులకు ఉపయోగించే అన్ని 15 సెరలాక్ ఉత్పత్తుల్లో చక్కెర శాతం ఎక్కువగా వుందని కనుగొన్నారు. అదే సమయంలో బ్రిటన్, జర్మనీల్లో విక్రయించే ఉత్పత్తుల్లో ఎలాంటి అదనపు చక్కెరలు లేవు. భారత్‌లో ఒక్కో ప్యాకెట్‌లో అదనంగా 2.7గ్రాముల చక్కెర వున్నట్లు తేలింది. ఇథియోపియా, థాయిలాండ్‌ల్లో విక్రయించే ఉత్పత్తుల్లో దాదాపు ఆరు గ్రాముల మేరా చక్కెర వుందని నివేదిక వెల్లడించింది.

భారత్‌లో అదనపు చక్కెరకు అనుమతులు

పిల్లలకు ఉద్దేశించిన ఏ ఆహార ఉత్పత్తుల్లోనూ అదనపు చక్కెరను అనుమతించరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసినప్పటికీ భారత రెగ్యులేటర్లు మాత్రం బేబీ ఫుడ్‌లో అదనంగా సుక్రోజ్, ఫ్రక్టోజ్ పరిమిత మొత్తంలో కలిపేందుకు అనుమతించారు. భారత నిబంధనలకు అనుగుణంగా భారతీయ మార్కెట్లో విక్రయించే నెస్లే బేబీ ఉత్పత్తుల్లో అదనపు చక్కెర వున్నట్లు స్పష్టంగా లేబుల్స్‌పై ముద్రిస్తున్నారు. పైగా గత ఐదేళ్ళలో తాము ఈ ఉత్పత్తుల్లో చక్కెర శాతాన్ని తగ్గిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. అదనపు చక్కెరలో 30శాతం మేరా నెస్లే ఇండియా తగ్గించిందని కంపెనీ ప్రతినిధి తెలిపారు. 2022లో భారత్‌లో రూ.20వేల కోట్ల విలువ చేసే సెరిలాక్ ఉత్పత్తులను నెస్లే విక్రయించింది.

ఊబకాయం ముప్పు

బ్రెస్ట్‌ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా (బిపిఎన్ఐ)కి చెందిన అరుణ్ గుప్తా మాట్లాడుతూ, రెండేళ్ళలోపు పిల్లలకు వారి ఆహారంలో అదనపు ఉప్పు లేదా చక్కెర ఇవ్వరాదని చెప్పారు. వీటిని ఇవ్వడం వల్ల వారు అనేక వ్యాధులకు గురవుతారని అన్నారు. కానీ భారత్‌లో ఈ తరహా ముప్పు బాగా ఎక్కువగా వుందని ఆమె హెచ్చరించారు. దీనివల్ల పిల్లల్లో ఊబకాయంపెరుగుతోందని ప్రభుత్వ సర్వేల్లో వెల్లడైందన్నారు.

ద్వంద్వ ప్రమాణాలు

నెస్లే ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందని హెపటాలజిస్ట్ (లివర్ వ్యాధుల నిపుణులు) సిరియాక్ అబే ఫిలిప్స్ తన ఎక్స్‌పోస్టులో విమర్శించారు. నెస్లే కంపెనీకి అంతర్జాతీయంగా వంద కోట్లడాలర్లకు పైగా రిటైల్‌అమ్మకాలు వున్నాయన్నారు. తక్కువ, మధ్య తరగతి ఆదాయం గల దేశాల్లోనే ఈ విక్రయాలు ఎక్కువగా వున్నాయన్నారు. కేవలం బ్రెజిల్, భారత్‌లోనే 40శాతం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. సెనెగల్, దక్షిణాఫ్రికా వంటి పేద దేశాల్లో విక్రయించే బిస్కట్ ఫ్లేవర్డ్ సెరియల్స్‌లో అదనపు చక్కెర ఆరు గ్రాములు కలుపుతున్నారని, అదే ఉత్పత్తి స్విట్జర్లాండ్‌లో అమ్మితే అందులో అదనపు చక్కెర వుండదని, కంపెనీ ఈ రీతిన పేద దేశాలకు సంబంధించి ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందని విమర్శించారు.

'ఓటుకు నోటు' కేసు వాయిదా

- జూలై 24న విచారిస్తామన్న సుప్రీం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

'ఓటుకు నోటు కేసు'కు సంబంధించిన వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు జులై 24కు వాయిదా వేసింది. అయితే జులై 24 తరువాత మరోసారి వాయిదాలు కోరవద్దని తెలంగాణ ప్రభుత్వం, చంద్రబాబు తరపున న్యాయవాదులకు సూచించింది. ఈ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును నిందితుడిగా చేర్చాలని, దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని సుప్రీంకోర్టును కోరుతూ ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎస్ విఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, తెలంగాణ స్టాడింగ్ కౌన్సిల్ శ్రవణ్ కుమార్, చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, పిటిషనర్ ఆళ్ల రామకృష్ణారెడ్డి తరపున సీనియర్ న్యాయవాది బసంత్ హాజరయ్యారు. కేసు విచారణ ప్రారంభం కాగానే ఈ కేసులో చట్టానికి సంబంధించి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయని, ఆ వివరాలను అందించేందుకు సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది మేనకా గురుస్వామి కోర్టును కోరారు. ఈ విజ్ఞప్తులపై స్పందించిన ధర్మాసనం, ఇంకెంత సమయం కావాలని ప్రశ్నించింది. ఇందుకు రెండు వారాల్లో కేసుతో ముడిపడి ఉన్న వివరాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మేనకా గురుస్వామి కోర్టుకు నివేదించారు. మరోవైపు చంద్రబాబు తరపున సిద్దార్థ లూథ్రా జోక్యం చేసుకుని తాము వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉన్నామని కోర్టుకు తెలిపారు. అయితే జులై చివరి వారంలో వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉండాలని ధర్మాసనం తేల్చి చెప్పింది. తదుపరి విచారణ జులై 24కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

పుస్తకాలు మాట్లాడవు కానీ, మహాబోధ చేస్తాయి. మనిషి ఎదగటానికి దోహదపడతాయి. అమ్మలా, నాన్నలా, గురువులా, స్నేహితుడిలా నిరంతరం చెంతనే ఉంటూ జ్ఞానాన్నిస్తాయి. కథలు చెబుతాయి. జీవితాన్ని విడమర్చి చూపిస్తాయి. మంచిచెడ్డలను బోధిస్తాయి. ధైర్యాన్నిస్తాయి. దారి చూపిస్తాయి. అలాంటి విలువైన పుస్తకాలకు ఎందరెందరో ప్రతి నిత్యం ప్రత్యేకమైన స్థానమిస్తారు. కొందరు తమ జీవితంలో జరిగే అన్ని సందర్భాల్లోనూ పుస్తకాలకే ప్రథమ గౌరవం ఇస్తారు.

JEEVANA — జీవన the family

హాయిగా నవ్వుకుందాం!

మోహానికి అందం ఆనందం
హాయిగా నవ్వుతూ ఉందాం
హహహ అంటూ ఎప్పుడూ
చిరకాలం కమ్మగా జీవిద్దాం!

నవ్వే మనిషికి ఆరోగ్యం
ఆనందమే జీవిత సౌభాగ్యం
నలుగురితో కలిసి నవ్వేద్దాం
ఆయువును పెంచుకుందాం!

మమకారానికి నిలువుటద్దం
నవ్వే తరగని పరిమళం
కాంతికి నవ్వే చెరగని చిహ్నం
అందానికి వెలుతురే ఆనందం!

పకపక నవ్వుతూ గడిపేస్తాం
హాస్య కథలను చదివేద్దాం
నవ్వుల దృశ్యాల్ని చూసేద్దాం
కాసేపు లోకాన విహరిద్దాం!

కార్టూన్ బొమ్మలు గీసేద్దాం
సంతోషాలను కలిపేద్దాం
జోకులు మస్తుగా వేసుకుందాం
పగలబడి మరీ నవ్వేద్దాం!

చక్కని మెరుపే కదా ఈ హాస్యం
పదుగురు మెచ్చిన హావభావం
నవ్వే ఆకర్షణకు నిజ రూపం
ఆ నవ్వే మనిషికి ప్రేమానురాగం!

ముసి ముసి నవ్వులు నవ్వేద్దాం
ఆహా ఓహో అంటూ అలరిద్దాం
అందరం కలిసి జీవిద్దాం
మనసుకు హాయిని కలిగిద్దాం

నవ్వుల పోటీ పెట్టుకుందాం
చమత్కార మాటలు వల్లిద్దాం
తలలో బరువుని దింపేద్దాం
తేలిక పడుతూ పయనిద్దాం!

నవ్వుతో స్నేహాన్ని పండిద్దాం
నలుగురి మదిలో నిలిచిపోదాం
చిలిపి జ్ఞాపకాలను నెమరు వేద్దాం
నవ్వుల పువ్వుల్ని వెదజల్లేద్దాం!

ఆనందమే జీవన సౌందర్యం
నవ్వే జీవిత సుఖ మధురం
కలకాలం నవ్వుతూ వుందాం
ఆయుస్సును పెంపొందిద్దాం!

- నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

నేను గీసిన బొమ్మ

ఎస్.లావణ్య,
5వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సందర్భం ఏదైనా పుస్తకానికి పట్టాభిషేకం!



విజయనగరానికి చెందిన చీకటి దివాకర్ బాల్యం నుంచి సాహిత్యాభిలాషి. పుస్తక ప్రేమికుడు. తన జీవితాన్ని, ఆలోచనా దృక్పథాన్ని తాను చదివిన పుస్తకాలే తీర్చిదిద్దాయని బలంగా నమ్ముతారు. వృత్తిరీత్యా ఇంజినీరు అయినా, మిగతా సమయం అంతా సాహిత్యంతోనే ఆయన జీవితం ముడిపడి సాగుతోంది. సాహితీ స్రవంతి సంస్థ ద్వారా ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేపడుతున్నారు. తన బాల్యంలో ఊరి పంచాయతీ కార్యాలయంలో చదివిన పుస్తకాలు ఆయన్ని ఉత్తేజితం చేశాయి. 'మంచి పుస్తకం ఓ గొప్ప విజ్ఞాన గవాక్షం' అని తెలుసుకునేలా చేశాయి. పుస్తకాలు కొనటం, చదవడం, వివిధ సందర్భాల్లో బంధుమిత్రులకు ఇవ్వడం ఒక అలవాటుగా మారిపోయింది. ఆయన సహచరి చంద్రికారాణి కూడా అదే బాటలో నడుస్తున్నారు.

ఉద్యోగ విరమణలో కథల కానుక

ఈ ఏడాది మార్చిలో దివాకర్ పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరుగా ఉద్యోగ విరమణ చేశారు. ఆ సందర్భంగా మిత్రులు అభినందన సభ ఏర్పాటు చేస్తే, దానిని ఓ పుస్తక మహోత్సవంగా మార్చారాయన. నాలుగు తరాల ఉత్తరాంధ్ర కథలతో 456 పేజీల పుస్తకం వేసి, ఆ సభలో ఆవిష్కరింపచేశారు. నిజానికి మహాకవి గురజాడ మొదలుకొని ఇప్పటి వర్తమాన రచయితల వరకూ ఉత్తరాంధ్ర కథలకు ఏర్చి కూర్చి ప్రచురించటం అంటే మామూలు విషయం కాదు. లక్షల రూపాయల ఖర్చుతోనూ, ఏళ్ళ తరబడిన శ్రమతోనూ ముడిపడిన కార్యం. అయినా సరే, ఆ వ్యయప్రయాసలకోర్చి, ఆ కార్యాన్ని విజయవంతంగా నెరవేర్చారు. ప్రముఖ సాహితీవేత్తలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, చీకటి దివాకర్‌ల సంపాదకత్వాన 63 కథలతో 'కళింగ కథాజాడ' పేరిట ఆ గ్రంథాన్ని వెలువరించారు. తన ఉద్యోగ విరమణ కానుకగా తన మిత్రులకు అందించారు.

అమ్మ స్మరణలో 'పేగుబంధం'

2022 జూన్‌లో తన తల్లి సరోజనమ్మ సంస్మరణార్థం ఇదే విధంగా 'పేగుబంధం' పేరుతో ఒక కవితా సంకలనం వెలువరించారు దివాకర్. ఎవరి జీవితంలోనైనా తల్లి ప్రేమ, పాత్రా అపారం, అమూల్యం. దివాకర్ తన తల్లి జీవితాన్ని స్మరించుకుంటూ, అప్పటికే అనేక మంది కవులు అమ్మ మీద రాసిన అమూల్యమైన కవిత్వాన్ని ఈ పుస్తకంలో చేర్చి, ప్రచురించారు. తల్లి సంస్మరణ రోజున బంధుమిత్రులకు అందించారు. అమ్మ సరోజనమ్మకు దైవభక్తి ఉన్నా అది మూఢభక్తి కాదు. కుమారుడు దివాకర్ శాస్త్రీయ ఆలోచనలను అర్థం చేసుకొని, అండగా నిలబడ్డారు. 2013లో దివాకర్ కొత్త ఇల్లు నిర్మించుకొని, ప్రవేశం చేసినప్పుడు పూజా కార్యక్రమాలు లేకుండా తన తల్లి చేతనే ఇంట్లో తొలి అడుగు పెట్టించి, ప్రారంభోత్సవం జరిపారు. అప్పటికే భర్త చనిపోయిన సరోజనమ్మ వితంతువుగా ఆ కార్యక్రమం చేయడం మంచిది కాదని ఒకరిద్దరు బంధువులు అడ్డు చెప్పబోతే, "ఇంకెవరికీ లేని గౌరవం నా కొడుకు నాకిచ్చాడు. నేను ప్రారంభిస్తాను." అని ఆమె ముందడుగు వేసిన విషయాన్ని దివాకర్ తన మాటలో గుర్తు చేసుకున్నారు. శివారెడ్డి, సినారె, నగ్నముని, దేవీప్రియ మొదలుకొని వర్తమాన కవుల వరకూ అమ్మ గురించి రాసిన వందకు పైగా కవితలతో 'పేగుబంధం' పుస్తకం ఎందరినో ఆకట్టుకొంది.

పుస్తకంతో పెళ్లి పిలుపు

దివాకర్ – చంద్రికారాణి కుమారుడు రవితేజ వివాహం ఈనెల 18న జరిగింది. ఈ సందర్భంగానూ ఒక పుస్తకం రూపంలోనే వివాహ ఆహ్వాన పత్రాన్ని రూపొందించారు. 168 పేజీలున్న ఈ పుస్తకంలో మహాకవులు గురజాడ, జాషువా, శ్రీశ్రీ, వేమన రాసిన స్మరణీయ కవితలు, పద్యాలూ పొందుపర్చారు. సుపరిచితమైన చైతన్యగీతాలతో పాటు గుండె లోతులకు తాకే ప్రేమైక గీతాలను, వ్యాఖ్యలను జోడించారు. పుస్తకం కవరు పేజీలో వేమన, గురజాడ, జాషువా, శ్రీశ్రీ రేఖాచిత్రాలతో పాటు వధూవరులు వైష్ణవి, రవితేజల ఫొటో ప్రచురించారు. పుస్తకం చివరి అట్టపై "పెళ్లి పిలుపు" వివరాలు ఇచ్చారు. "మహాకవుల మాటలు" పేరిట వెలువరించిన ఈ ఆహ్వాన పుస్తకాన్ని చూసి, బంధుమిత్రులు "ఇది చాలా ప్రయోజనకరమైన పని" అని అభినందిస్తున్నారు.

ఈ పుస్తకానికి ప్రముఖ విశ్లేషకులు తెలకపల్లి రవి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పల నాయుడు ముందు మాటలు రాశారు. "సాధారణంగా పెళ్లికానుకగా రకరకాల ఆకర్షణీయమైన సరుకులను ఇవ్వడం ఆనవాయితీ అయిపోయింది. చాలా సందర్భాల్లో ఆ సరుకులు పుచ్చుకున్నవారికి అంతగా ఉపకరించవు. వాటికి ఉపయోగ విలువ కంటే వినిమయ విలువ ఎక్కువ. కానీ, పుస్తకం సరుకూ వస్తువూ కాదు. శాశ్వత ఉపయోగ విలువ గలది. ఇచ్చేవారు ఏ ప్రయోజనం ఆశించి, ఈ పుస్తకం ఇస్తున్నారో– ఆ ప్రయోజనం నూటికి నూరు పాళ్లూ నెరవేరుతుంది." అని పేర్కొన్నారు.

వివిధ సందర్భాల్లో పుస్తకాలను కానుకగా, జ్ఞాపికగా ఇవ్వడం మంచి వరవడి. దానివల్ల పుస్తకం పుటలు పుటలుగా వర్ధిల్లుతుంది. జ్ఞానం పుస్తక మహోత్సవంలా విస్తరిస్తుంది!

- సత్యాజీ

అమూల్య కానుకలు.. పుస్తక జ్ఞాపికలు

తమ ఇంట పదిమందీ చేరే సందర్భాల్లో పుస్తకాలను ప్రత్యేకంగా ముద్రించి, జ్ఞాపికలుగా ఇవ్వడం మన సమాజంలో చాలా కాలంగా అమల్లో ఉంది. వివాహం, గృహప్రవేశం, సంస్మరణం ... ఇలాంటి సందర్భాల్లో చాలామంది ఇలా పుస్తకం ప్రచురించి, పంచారు. ప్రముఖ రచయిత్రి ఓల్గా తమ కుమారుడి వివాహ సందర్భంగా 'శరత్ జ్యోత్స్న' పేరిట పుస్తకం తెచ్చారు. ఎమెస్కో విజయ్‌కుమార్ తమ ఇంట జరిగిన వివాహ వేడుకకు అందమైన బొమ్మలతో రూపొందించిన నండూరి ఎంకిపాటలు పుస్తకాన్ని కానుకగా అందించారు. రచయిత కోట పురుషోత్తం తమ కుమారుడు పెళ్లి సందర్భంగా 'కీర్తి ఆమనిల పెండ్లిపుస్తకం' వెలువరించారు. విశాఖలో జెవి సత్యనారాయణ మూర్తి తమ ఇంట జరిగిన పెళ్లిలో 'అనామకుడు' అనే రష్యన్ కథను ఒక పుస్తకంగా వేసి, అతిథులకు అందించారు. కవి బండ్ల మాధవరావు తమ గృహ ప్రవేశ కానుకగా 'మా వూరు – మా ఇల్లు' పుస్తకం వెలువరించారు. కవి ప్రసేన్ తమ 'మనవరాలు' పుట్టినరోజుకు ఓ పుస్తకం తెచ్చారు. శిఖామణి, లలితానంద ప్రసాద్ తదితరులు కూడా తమ ఇంట ఉత్సవాల సందర్భంగా పుస్తకాలను ప్రచురించారు. తెలుగు నాట ఇలాంటి సందర్భాలు ఇంకెన్నో ఉన్నాయి. సంస్మరణ సంచికలైతే చాలానే వెలువడుతున్నాయి.

పుస్తకాలు వెలుగు దారులు

తమ ఇళ్లల్లో జరిగే వివిధ కార్యక్రమాలను పురస్కరించుకొని చాలామంది అతిథులకు జ్ఞాపికలను అందిస్తున్నారు. మేం పుస్తక రూపంలో ఆ జ్ఞాపికను ఇస్తున్నాం. వేమన, గురజాడ, శ్రీశ్రీ, కందుకూరి, జాషువా వంటి మహామహులు రచించిన పుస్తకాలు జీవితానికి వెలుగు దారులను చూపిస్తాయి. వారి మాటలూ, రచనలూ చదివితే మనిషి ప్రతి దశలోనూ ఎంతగానో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాం.

- దివాకర్ - చంద్రిక

29 కిలోల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

- 1190 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అధిక మొత్తంలో తరలిస్తున్న నగదు, నగలు, మద్యం, ఇతర విలువైన వస్తువులను పట్టుకుని సీజ్ చేస్తున్నారు. వైఎస్ఆర్ జిల్లా గోపవరం మండల పరిధిలోని పిపి కుంట చెక్‌పోస్టు వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. సీక్వెల్ గ్లోబల్ ప్రీసియస్ లాజిస్టిక్స్ అనే కంపెనీకి చెందిన బొలెరో వాహనాన్ని పరిశీలించగా 29 కిలోల బంగారం, వెండి వస్తువులను గుర్తించారు. ఆభరణాలను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు. పట్టుబడిన బంగారం, వెండి విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. బంగారం, వెండి ఆభరణాలకు సంబంధించి పత్రాలను పరిశీలిస్తున్నట్లు బద్వేల్ రూరల్ సిఐ విక్రమ్ సింహ, ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయిలో అక్రమంగా నిల్వ ఉంచిన 1190 మద్యం బాటిళ్లను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. వల్లంకొండ రమణయ్య, చీకటిమళ్ల, షేక్ నాగులు, వల్లంకొండ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ జగ్గయ్యపేట సిఐ మణికంఠ రెడ్డి తెలిపారు.

కృష్ణా జిల్లా వత్సవాయిలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి – పగిడ్యాల (నంద్యాల జిల్లా)

వడదెబ్బకు ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలో గురువారం చోటుచేసుకుంది. పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బుల్లెద్దుల ఏసేపు (45) గ్రామ సమీపంలోని కెసి కెనాల్‌లో ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనులకు చేస్తుండగా ఎండ వేడిమికి తాళలేక స్పృహ తప్పి పడిపోయారు. తోటి కార్మికులు ఆయనను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఏసేపు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏసేపు మృతదేహానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి పి.పక్కీర్ సాహెబ్, ఈశ్వరమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గెలుపు ముంగిట పంజాబ్ బోల్తా

ముంబయి చేతిలో తొమ్మిది పరుగుల తేడాతో అనూహ్య ఓటమి

ఛండీగఢ్: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో మరో ఉత్కంఠ మ్యాచ్‌కు ముల్లన్‌పూర్ వేదిక అయ్యింది. ముంబయి ఇండియన్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు 9 పరుగుల తేడాతో అనూహ్యంగా ఓటమిపాలైంది. ముంబయి నిర్దేశించిన 193పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ జట్టు తడబడి ఓడింది. 14పరుగులకే 4వికెట్లు కోల్పోయి తొలుత ఓటమికోరల్లో నిలిచిన పంజాబ్‌ను శశాంక్ సింగ్(41; 25బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు)తో ఆదుకున్నాడు. ఆ తర్వాత మరోదఫా వరుసగా వికెట్లు కోల్పోయి జట్టుస్కోర్ 111పరుగులకు చేరేసరికి ఏడు కోల్పోయింది. ఆ దశలో అశుతోష్ శర్మ(61; 28బంతుల్లో 2ఫోర్లు, 7సిక్సర్లు), హర్‌ప్రీత్ బ్రార్(20) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. దీంతో చివరి 24బంతుల్లో 28పరుగులు చేస్తే పంజాబ్‌దే గెలుపు అన్న దశలో అశుతోష్‌ను కోర్జే ఔట్ చేశాడు. మరోవైపు హర్‌ప్రీత్ బ్రార్‌ను హార్దిక్ ఔట్ చేయడంతో పంజాబ్ చివరి చివరి ఓవర్లో 12 పరుగులు చేయాల్సి వచ్చింది. ఆ దశలో తొలి బంతి వైడ్ పడగా.. ఆ తర్వాత బంతిని రబడా రెండు పరుగులు తీసే క్రమంలో రనౌటయ్యాడు. దీంతో పంజాబ్ అనూహ్యంగా ఓటమిపాలైంది. ముంబయి బౌలర్లు కోర్జే, బుమ్రాకు మూడేసి, మధ్వాల్, హార్దిక్, శ్రేయస్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు ముంబయి ఇండియన్స్ బ్యాటర్, మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ ఒంటరి పోరాటం చేశాడు. సూర్యకుమార్ అర్ధసెంచరీకి తోడు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ కూడా చెలరేగడంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 192పరుగులు చేసింది. జరుగుతున్న మ్యాచ్‌లో సూర్య కుమార్ యాదవ్(78; 53బంతుల్లో 7ఫోరుఓల, 3సిక్సర్లు) అర్ధసెంచరీతో రాణించాడు. ముంబయి ఓపెనర్ ఇషాన్ కిషన్(8) రబడా బౌలింగ్‌లో ఔటయ్యాడు. భారీ షాట్ ఆడి.. బౌండరీ వద్ద హర్‌ప్రీత్ బ్రార్ చేతికి చిక్కాడు. దాంతో, 18 పరుగుల వద్ద ముంబయి తొలి వికెట్ కోల్పోయింది. ఇషాన్ ఔటైనా గత మ్యాచ్‌లో సీఎస్కేపై సెంచరీ బాదిన రోహిత్ శర్మ(36) దంచాడు. చివర్లో పంజాబ్ కింగ్స్ బౌలర్ హర్షల్ పటేల్ కట్టడి బౌలింగ్ చేయడంతో ముంబయి భారీస్కోర్‌పై ఆశలు వదులుకుంది.

సామ్ కర్రన్‌కు పగ్గాలు...

పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శిఖర్ ధావన్ వ్యక్తిగత కారణాలతో ముంబయి ఇండియన్స్‌తో మ్యాచ్‌కు దూరంగా కావడంతో సామ్ కర్రన్ జట్టు పగ్గాలు అందుకున్నాడు. ధావన్ సారథ్యంలో పంజాబ్ జట్టు మూడు మ్యాచుల్లో ఓడి, మరో మూడు మ్యాచుల్లో గెలిచింది.

ఐపిఎల్‌లో నేడు
లక్నో × చెన్నై
వేదిక: లక్నో; రా.7.30గం॥లకు

'అచ్చెన్న' బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఎపి స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ నిధుల మళ్లింపు అభియోగాలతో సిఐడి నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మే 8కి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ టి మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు పత్రాలు సమర్పించేందుకు గడువు కావాలని సిఐడి కోర డంతో విచారణ వాయిదా వేశారు. ఈలోగా పిటిషనరును అరెస్టు చేయడం లేదా ఇతర కఠిన చర్యలు తీసుకోరాదన్న గత ఉత్తర్వులను పొడిగించారు.

దస్తగిరి పిటిషన్‌పై విచారణ 23కి వాయిదా

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తనను హంతకుడిగా అభివర్ణిస్తూ టివిల్లో కథనాలు ప్రసారం చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 23కు వాయిదా పడింది. ఈ నెల 8న కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని దస్తగిరి వాదన. కేసు విచారణ పూర్తయ్యే వరకు టివిల్లో కథనాలు రాకుండా చేయాలని కోరారు. పిటిషనరు వినతిపత్రంపై చర్యలు ఏం తీసుకున్నదీ వివరించేందుకు గడువు కావాలని కేంద్ర ఎన్నికల సంఘం కోరింది. దీంతో విచారణ 23కు వాయిదా పడింది.

సిఎంపై దాడిని అవహేళన చేయడం తగదు

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రిపై దాడి జరిగితే ప్రతిపక్షాలు బాధ్యతా రాహిత్యంగా అవహేళన చేయడం తగదని మంత్రి జోగి రమేష్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం జగన్‌పై విజయవాడలో దాడి జరిగితే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ ఆ దాడిని డ్రామా అని, పథకం ప్రకారం చేశారని సంస్కార హీనంగా మాట్లాడుతున్నారని అన్నారు. సిఎం జగన్‌పై చంద్రబాబు దుష్ప్రచారం తగదని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు జూపూడి ప్రభాకరరావు అన్నారు. చుండూరు, పదిరికుప్పం ఘటనలు చంద్రబాబు కుట్రలేనని విమర్శించారు.

చంద్రబాబు, పవన్‌పై ఇసికి ఫిర్యాదు

ఈ నెల 17న పెడన, మచిలీపట్నంలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌పై వ్యక్తిగత విమర్శలు, ధూషణలు చంద్రబాబు చేశారని సిఇఒ ఎంకె మీనాకు వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. మచిలీపట్నం బహిరంగ సభలో పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యాలు చేశారన్నారు. ఈ నెల 16న నర్సీపట్నంలో ఎన్నికల ప్రచారంలో టిడిపి నేత చింతకాయల అయన్నపాత్రుడు కూడా జగన్‌పై వ్యక్తిగత విమర్శలు చేశారని ఫిర్యాదు చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిప్పుల కొలిమిలా రాష్ట్రం

45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
తీవ్ర అస్వస్థతకు గురైన వంగా గీత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/పార్వతీపురం రూరల్

రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. గురు వారం ఉదయం నుంచే ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పిఠాపురం వైసిపి అభ్యర్థి వంగా గీత వడదెబ్బ తగలడంతో ప్రచారాన్ని ఆపేసి ఆస్పత్రిలో చేరారు. చాలా మంది అభ్యర్థులు ప్రచారాన్ని మధ్యాహ్నం పూట వాయిదా వేసుకున్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా యెర్రంపేట, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో 45.8 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా నందవరంలో 45.6 డిగ్రీలు, విజయనగరం జిల్లా జామిలో 45.5 డిగ్రీలు, కడప జిల్లా కొంగలవీడులో 45.4 డిగ్రీలు, తిరుపతి జిల్లా రేణిగుంట, ప్రకాశం జిల్లా దరిమడుగులో 45.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పల్నాడు జిల్లా ముటు కూరులో 44.9, అన్నమయ్య జిల్లాలోని కంబాల కుంట, నెల్లూరు జిల్లా కసుమూరులో 44.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత లు నమోదయ్యాయి. 84 మండలాల్లో అతి తీవ్ర వడగాడ్పులు, 120 మండలాల్లో వడగాడ్పులు వీశాయి. అలాగే శుక్రవారం కూడా ఇదే తీరులో వడగాడ్పులు వీచే అవకాశం వుందని, ప్రజలు అప్ర మత్తంగా వుండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వ హణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రక టనలో తెలిపారు. మరికొన్ని రోజులు ఈ ఎండల తీవ్రత కొనసాగే అవకాశం వుందని పేర్కొన్నారు.

మండుతోన్న 'మన్యం'

పార్వతీపురం మన్యం జిల్లా మండిపోతోంది. జిల్లాలోని వీరఘట్టం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో 45.8 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని బలిజిపేట భామిని, సాలూరు, మక్కువ, సీతంపేటలో 44.5, పార్వతీపురం, పాచిపెంట, సీతానగరం మండలాల్లో 43.8, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

టాప్‌లో నెపొంనెచ్చి

రెండోస్థానంలో గుకేశ్, నకముర

టొరంటో(కెనడా): ఫిడే క్యాండిడేట్ ఛాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్‌గుకేశ్ 2వ స్థానానికి పడిపోయాడు. గురువారం జరిగిన 11వ రౌండ్ పోటీలో అమెరికాకు చెందిన ఫ్యాబినో కరోనాతో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో గుకేశ్.. నకమురాతో కలిసి సంయుక్తంగా 2వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక రష్యా గ్రాండ్‌మాస్టర్ నెపొంనెచ్చి విదిత్ గుజరాతిని చిత్తుచేసి అగ్రస్థానానికి ఎగబాకాడు. 11వ రౌండ్ ముగిసిన అనంతరం నెపొంనిచ్చి 7పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. గుకేశ్, నకముర సంయుక్తంగా 6.5పాయింట్లతో రెండోస్థానంలో ఉన్నారు. ఇక మహిళల విభాగంలో కోనేరు హంపి 5.5పాయింట్లతో 4వ స్థానానికి ఎగబా కగా.. ఆర్. వైశాలి 4.5పాయింట్లతో 7వ స్థానంలో కొనసాగుతోంది.

గాయంతో పారిస్ ఒలింపిక్స్‌కు శ్రీశంకర్ దూరం

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిం చిన భారత లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తీవ్ర మోకాలి గాయం కారణంగా పారిస్ ఒలింపిక్స్ నుంచి వైదొలుగుతున్నట్లు గురువారం ప్రకటించాడు. ఒలింపిక్స్‌కు సిద్ధమౌతున్న శ్రీశంకర్ మంగళ వారం శిక్షణలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. శస్త్రచికిత్స అవసరమని తేలింది. దీంతో తప్పనిపరిస్థితుల్లో ఒలింపిక్స్ నుంచి వైదొలుగుతున్నట్లు కన్నీళ్ల పర్యంతమై పేర్కొన్నాడు. బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీశంకర్ 8.37మీ జంప్‌తో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. ఆ పోటీల్లో శ్రీశంకర్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌కు లాంగ్‌జంప్ విభాగంలో భారత్‌ను అర్హత సాధించిన ఏకైక అథ్లెట్ శ్రీశంకర్ మాత్రమే. 25ఏళ్ల శ్రీశంకర్ 2022 బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్, 2022లో హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో రజత పతకంతో మెరిసాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 7.69మీ. జంప్ చేసి 13వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు.

కోహ్లీకి అరుదైన గౌరవం.. జైపూర్ మ్యూజియంలో మైనపు విగ్రహం

జైపూర్: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి మరో అరుదైన గౌరవం దక్కింది. రాజస్థాన్‌లోని జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో కోహ్లి మైనపు విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోహ్లీ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు మ్యూజియం వ్యవస్థాపక డైరెక్టర్ అనూప్ శ్రీవాస్తవ గురువారం వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాదిగా పర్యాటకులు, ముఖ్యంగా పిల్లలు, యువత నుంచి మ్యూజియంలో కోహ్లీ విగ్రహం ఏర్పాటు చేయాలని పెద్దఎత్తున డిమాండ్లు వచ్చినట్లు తెలిపారు. వారి అభిప్రాయాలను గౌరవిస్తూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకొని కోహ్లీ విగ్రహాన్ని మ్యూజియంలో పెట్టినట్లు వెల్లడించారు. 35 కిలోల బరువు కలిగిన ఈ విగ్రహాన్ని రెండు నెలల్లో తయారు చేశారు. ఇందులో 44 మైనపు విగ్రహాలున్నాయి. వీటిలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, అబ్దుల్ కలాం, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, కల్పనా చావ్లా, అమితాబ్ బచ్చన్, మదర్ థెరీసా, సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ వంటి పలువురు ప్రముఖుల మైనపు విగ్రహాలు ఉన్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68